# తొలిమాట

తెనుగుభాషా సమితివారి పక్షమున ౧౯౪3 జనవరి మొదటి తేదీనాడు మద్రాసు గవరన్మెంటు ఆర్ట్సుకాలేజిలో నాచే నీయబడిన యుపన్యాసమున కిది విపులీకరణము; తరువాత నిది భారతి మాసపత్రికలో సంపూర్ణముగ ముద్రింపబడెను. ప్రకాశకుల ప్రోత్సాహము మీఁద దీని నిప్పుడు గ్రంథ రూపముగ వెలువరించు చున్నాడను. పుస్తకముగ ముద్రించుకొనుటకు సమ్మతించినందుకు తెనుగుభాషాసమితి అధికారవర్గమునకును భారతి సంపాదకులకును గృతజ్ఞుడను. గ్రంథ ముద్రణమును సత్వరముగ సాగించినందుకు స్వతంత్ర ముద్రాశాలాధిపతులు శ్రీ ఖాసా సుబ్బరావుగారికిని, మేనేజరు శ్రీ మంజేరి ఈశ్వరన్ ఎమ్. ఎ., గారికిని శుద్ధపత్రమును దయారు చేసి యిచ్చినందుకు బ్ర. శ్రీ వేదము వేంకటేశ్వర శాస్త్రుల వారికిని వందనములు సమర్పించుచున్నాను.

…లటూరు వేంకటరమణయ్య.

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10593

కృతి సమర్పణము

చిరమిత్రులు

**శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారికి.**

894.82709
VEN
A0UA105B117



నాయక రాజాస్థాన

# దాక్షిణాత్యాంధ్ర సాహిత్యము

## ప్రకరణము ౧.

## నాయక రాజోత్పత్తి

నాయక రాజులనాటి దాక్షిణాత్యాంధ్ర సాహిత్యమును వివరించుటకు ముందు తొలుదొల్త జెప్పదగిన యంశములు రెండు మూడు గలవు. తంజావూరు సరస్వతీ మహాలు పుస్తక భాండాగారమున నిక్షిప్తములైయుండు నాంధ్ర గ్రంథములన్నియు గొందరనుకొనునట్లు దాక్షిణాత్య ఆంధ్రకవి విరచితములు గావు. ఆంధ్రదేశమునం దుత్పత్తిల్లిన గ్రంథము లనేకము లందుకలవు. మఱియు నాయకరాజుల మన్ననకు బాత్రులైన కవులందరును దాక్షిణాత్యులని యెంచుటయు సరికాదు. శ్రీ నిడదవోలు వెంకట్రావు పంతులుగారు క్షేత్రయ్య తంజావూరాస్థాన విద్వాంసుడని సూచించి యున్నారు. "దాక్షిణాత్య సంగీత ప్రపంచమున మూర్తిత్రయమని చెప్పదగినవారు ముగ్గురు. అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్య. ఇందు కడపటివారిరువురు తంజావూరికి సంబంధించినవారే. క్షేత్రయ్య రఘునాథనాయకుని కాలమున తంజావూరాస్థానమునకువచ్చి, యావెనుక విజయరాఘవునిపై వేయి పదములను జెప్పియున్నాడు" అని వక్కాణించిరి. త్యాగయ్యవలె క్షేత్రయ్య దాక్షిణాత్యుడు కాడు; అతని జన్మదేశము గుంటూరు మండలము. సంగీత విద్యయం దభిరుచిగల రాజుల సంస్థానములకెల్ల బోయి తన విద్యాకౌశలమును జూపి బహుమానములను బొందెను. ఇతనిచే బదములు జెప్పించుకొనినది విజయరాఘవుడొక్కడే కాదు, మధురాపురీశుడు—చొక్కనాథుడేమో?—తుపాకుల వేంకటకృష్ణుడు, గొలకొండ కుత్బుశాహు మున్నగు వారెందరో కలరు.

గోలకొండ పాదుశాహు నాలుగువేల పదములు జెప్పించుకొనెనట. చెవ్వంది లింగడు, తిల్ల గోవిందరాజు, కంచి (కరిగిరి) వరదరాజు, తిరవళ్ళూరి వీరరాఘవుడు, కడప వేంకటేశుడు, పాలగిరి చెన్నుడు మున్నగు దైవములను బ్రశంసించియున్నాడు. కావున క్షేత్రయ్య దేశద్రిమ్మరి. ఆంధ్రభాష వ్యవహారమునందుండిన దేశమంతయు నతనికి గీర్వాణియొసగిన యమరమాగాణము. తంజావూరివాడనుట పొరబాటు. కావున క్షేత్రయ్యపదములు గాని మఱి యిట్లే నాయకరాజుల సంస్థానముల కాగంతుకులై వచ్చి బహుకృతులై చన్న కవుల రచనలనుగాని ఇచట బ్రస్తాపింప దలపెట్టలేదు.

మఱియు ద్రావిడదేశమున ఆంధ్రవాఙ్మయమును బ్రవేశపెట్టి పెంపొందించిన వారు మధుర తంజావూరాంధ్ర నాయకరాజులని వాఙ్మయ పరిశోధక పండితులు చెప్పుదురు; కాని వాస్తవమును విచారించిన పై బేర్కొనిన నాయకరాజ్యముల స్థాపనకు ముందే యరవదేశమునం దాంధ్రకావ్య రచన ప్రారంభమైనది. మధురనాయకరాజ్యము క్రీ. శ. 1564-5 సంవత్సరమున నడచిన రక్కసి-తంగడి యుద్ధానంతరమున బ్రభవించినది. తంజావూరు రాజ్యము దాని కించుకపూర్వము క్రీ. శ. 1550 వ సంవత్సర ప్రాంతమున సంస్థాపిత మాయెనని నవీనచరిత్ర పరిశోధనలవల్ల దెలియవచ్చుచున్నది; కాని ద్రావిడభూమియందు ఆంధ్రకావ్యరచన దాని కిరువది ముప్పదియేండ్లకుముందె ప్రారంభమైనది. క్రీ. శ. 1529 మొదలు 1542 వఱకును విజయనగర సామ్రాజ్యమును పాలించిన యచ్యుతదేవ మహారాయ లాంధ్రభాషాభిమాని. ప్రతి సంవత్సరంబు శ్రీ వెంకటేశ్వరునకు సత్కావ్య ప్రబంధపుష్పాంజలి సమర్పించువాడు. ఏలినవాని మార్గము ననుసరించి మంత్రులును, నాయకులును, బెక్కండ్రాంధ్రభాషను బోషించి కవులను గావ్యరచనకు బ్రోత్సాహించి భాషాసేవ యొనర్చిరి. వారిలో గోళ్ళ బసవేంద్రుని కుమారులు పెదరామప్ప చినరామప్ప యనువార లీసందర్భమున బేర్కొనఁదగినవారు. చిన రామప్ప

దన యన్నయగు పెదరామప్ప పేర చొక్కనాథ చరిత్రయను ద్విపద కావ్యమును పచ్చకప్పూరపు తిరువెంగళ కవిచే జెప్పించెను. ఈ పెద రామప్పనాయకుడు వాకిటి చిన్నప్ప నాయకుని మిత్రుడు, వ్యాసతీర్థుల శిష్యుడు. ఇతడు క్రీ. శ. 1531 మొదలు 1538-9 వఱకును అచ్యుతరాయల పక్షమున రామనాథపురం జిల్లా తిరుపత్తూరు తాలూకాలోని శివపురి ప్రాంతమును పాలించుచుండెను. ఇతడు మధుర చొక్కనాథస్వామి భక్తుడు; కావుననే చొక్కనాథుని లీలలను వర్ణించు చొక్కనాథ చరిత్రను జెప్పించుకొనెను. ఇందువలన నాంధ్ర వాఙ్మయమును ద్రావిడదేశమున బ్రథమమున బ్రవేశపెట్టినవారు మధుర తంజాపు రాంధ్రనాయకులుగారనుట తెల్లమగుచున్నది. ఆ కీర్తి గోళ్ళవారికి జెందవలసియున్నది.

గోళ్ళ నాయకుల యాశ్రయమున నాంధ్రభారతి ద్రావిడదేశమును బ్రవేశించినను, నది యచట సుస్థిరముగ నెలకొనినది మధుర తంజాపురాంధ్ర నాయక రాజుల యాదరణము వల్లనె. దక్షిణదేశమున దెలుగుభాష స్థిరముగ నెక్కొనుటకును, గ్రంథ రచన యభివృద్ధి నందుటకును ముఖ్యకారణము రక్షసి-తంగడి యుద్ధమని చెప్పవచ్చును. ఈ యంశమును విదశపఱచుకొఱ కిచట విజయనగర సామ్రాజ్యపాలన విధానము నించుక తడవవలసి యున్నది. రాయ సామ్రాజ్యము వర్ధిలిన మూడువందల యెబదియేండ్లును దురకలతో నెడతెగని పోరాటము సాగించుట యావశ్యకమాయెను. మొదట బహమనీ సుల్తానులతోడను, పిమ్మట అహమదునగర, బిజాపుర, గోల్కొండ సుల్తానులతోడను విజయనగర సామ్రాజ్యాధిపతులు హిందూధర్మమును గాపాడుటకొఱకు యుద్ధము జేయవలసి వచ్చెను. ఈ కార్యమును నెఱవేర్చుటకు రాయలు గొప్ప సైన్యమును గూర్చి భరింపవలసి యుండెను. ధనములేక సైన్యములను భరించుట సాధ్యముగాదు. సర్వవిధములైన సంపదలకును ఆకాలమున భూమియే మూలాధారము గావున సామ్రాజ్యసంరక్షణ భూమిపై నాధారపడి యుండి

నది. ఇది మనము దృక్పథమున నిలుపుకొనవలసిన ప్రధానాంశము. రెండవది భూస్వామ్యము. రాయసామ్రాజ్యములోని రాష్ట్రమున కంతటికిని రాయలు ఒడయుడు. భూమినుండి వచ్చు వరుంబడిని సైన్యపోషణకొఱకు వినియోగించుటకై రాయలొక పద్ధతి నవలంబించెను. దేవదేయ, బ్రహ్మదేయములు గాక మిగిలిన గ్రామము లన్నియు రెండుతరగతులుగ విభజింపబడెను. అందొక తరగతి గ్రామములు నగరికి జెల్లెడివి; వీనినుండి వచ్చు నాయము నుండి రాయలు నగరిఖర్చులను కై జీతదళముల జీవితములు మొదలగు పరిజన పోషణఖర్చులను భరింపవలసి యుండెను. ఆర్థవణపు లెక్కలలో నీ తరగతి గ్రామములను భండారవాడ గ్రామములని పేర్కొనువారు. రెండవతరగతి గ్రామములకు అమరగ్రామములని పేరు. అమర మనగా, "అగత్యమైనప్పుడు కొంతదండును తీసుకొని రావలసినదనే నిబంధనమీద, చిన్న రాజులకు విడువబడ్డ సీమ" అని బ్రౌన్ దొరగా రర్థనిర్ణయము గావించిరి. ఈ యర్థమునే పేరుచెప్పక సంగ్రహించినారు సూర్యారాయాంధ్ర నిఘంటు కర్తలు. అమరము యెరవు మాట, పార్సీనుండి స్వీకరింపబడినది. అమ్ర్ అనగా ఉత్తరువు, అజ్ఞ యని యర్థము. దళనాయకులకు రాజు కొన్ని నిబంధనలమీద నిచ్చు భూమికీ కారణమున అమర మనియు నమరమాగాణ మనియు పేరువచ్చినది. అమర భూములను గొన్నవారికి అమరనాయకులని పేరు. ఇట్లు రాజు రాష్ట్రమును నాయకులకు అమరనిబంధనల ప్రకారము బంచిపెట్టు పద్ధతికి అమరనాయంకరపద్ధతియని గాని లేక నాయంకరపద్ధతి యనిగాని పేరు. అమర నిబంధనలు ముఖ్యమైనవి రెండు: ఒకటి, బ్రౌనుగారు చెప్పినట్లు వలసినప్పుడు నిర్ణీతసంఖ్య గల గజాశ్వపదాతి బలములతోగూడ యుద్ధకార్యమునకు వచ్చుట; రెండవది, నిర్ణీతమైన ధనసంచయమును వర్షవర్షమును గప్పముగ చెల్లించుట. అమర గ్రామముల నాయకులకిచ్చునప్పుడు రాజు మితిమీఱి యీరాదని కృష్ణ రాయలు శాసించియున్నాడు. మఱియు నమరనాయకులను స్థిరముగ నొక

స్థలమున నుండనీరాదు. వారి యమరమాగాణములు దఱచుగ మారుచుండెడివి. కావున వంశపారంపర్యముగ నమరనాయకులకొక సీమ నేలుటకు గాని యందు దమ యధికారమును స్థిరముగ నెలకొల్పుటకు గాని సాధ్యమయ్యెడిది కాదు. ఇందువలన రాయ సామ్రాజ్యమునం దమర నాయకులు చిరకాలము ప్రబలుటకు వీలులేక పోయినది. కాని రక్కసి-తంగడి యుద్ధానంతరము రాయసామ్రాజ్య పరిస్థితులు మారిపోయినవి. రాయల కైజీతము బలము లన్నియు సమసెను. క్రొత్తదళములను గూర్చుటకు వలసిన ధనము రాయ భండారమున లేకపోయెను. కావున రాయలకు అమరనాయకులను దన యాజ్ఞా నిబద్ధులను సేయజాలు శక్తి లేకపోయెను. తత్కారణమున అమరనాయకులు పెచ్చుపెరిగి తమ యమర సీమలయందు నెలకొని నూతన సంస్థానములను స్థాపించిరి. ఇట్లు వెలువడిన నూతన సంస్థానములలో ప్రబలమైనవి మధుర తంజాపుర జింజి నాయక రాజ్యములు.

ఈ రాజ్యస్థాపకులు తొలుదొల్త తక్కిన అమరనాయకులవలె రాయల కడనుండి కొన్ని గ్రామములను నాయంకరముగ బడసినవారలె. రక్కసి-తంగడి యుద్ధానంతరము రాయసామ్రాజ్యమున వఱలుచుండిన యరాజకస్థితిని సందర్భ పఱచుకొని తమశక్తి సామర్థ్యములవలన జుట్టుపట్ల నుండిన యమర నాయకులను జయించి విస్తారమగు రాష్ట్రముల నాక్రమించుకొని రాయలవారికి మ్రింగరాని కములైరి. శీర్ణకర్ణాట సామ్రాజ్యమును బునరుద్ధరింప గంకణము గట్టుకొన్న తిరుమలదేవరాయలకు వారిని దన యధికారముక్రిందికి దెచ్చుకొనుటకు శక్తి చాలకపోయెను. ఒకప్రక్క తురకల దండయాత్రలు, మఱియొకప్రక్క సామ్రాజ్యాధిపత్యముకొఱ కళియరామరాజు పుత్రుడు తిమ్మరాజు కుట్రలు. ఈ పరిస్థితులందు విజయనగరముననుండుట శ్రేయస్కరము గాదని రాజధానిని పెనుగొండకు మార్చి రాయలను వెంటనిడుకొని యచటికి బోయెను. మఱియు నమరనాయకుల నందఱను దన కనుకూలురుగ జేసికొను

టకు ఎవ్వరాక్రమించిన సీమలకు వారే స్థిరమైన ప్రభువులని యొప్పుకొనెను. అంతట అమరనాయకులై యుండిన మధుర తంజాపురాది నాయక రాజ్య స్థాపకులు సామంతులై సామంత రాజచిహ్నములను ధరించి తమతమ సీమల నేలగడగిరి. రాయసామ్రాజ్యముపై నెత్తి వచ్చు శత్రువులెల్ల నుత్తర దిగ్భాగమునుండియె వచ్చుటచేత వారితాకు సాక్షాత్తుగ రాయల యేలుబడి క్రింది దేశమునకె తగిలెడిది; ఆత్మసంరక్షణార్థము వారితో దన యావచ్ఛక్తిని వినియోగించి పోరాడవలసి వచ్చుటచేత యుద్ధభారమంతయు రాయలమీదనే బడుచుండినది. దాక్షిణాత్య నాయకరాజులకు యుద్ధము జేయవలసిన యావశ్యకతయు శత్రుభయమును లేకపోయెను. సారవంతము లైన రాష్ట్రములనుండి వచ్చు నాయమును యథేష్టముగ వెచ్చపెట్టుచు నానావిధ భోగముల ననుభవింపుచు నిరంతరము సుఖసంకథావినోదంబుల గాలము గడపుటకు వారి కవకాశము గల్గెను.

తురకల యుపద్రవము రానురాను ఆంధ్రదేశమున దుర్భరమై పోయెను. తిరుమలదేవ శ్రీరంగదేవ రాయలకాలమున విజాపుర సల్తాను పెనుగొండపై నేడు పర్యాయము లెత్తివచ్చెను. గోల్కొండ సుల్తాను కొండ వీటి రాజ్యము నాక్రమించుకొనుటయే కాక యుదయగిరి కందనవోలు రాజ్య ములపై బలుమారు దండయాత్రలు సేయ నారంభించెను. కొలలు గొల్లలు మిలిమీఱెను; దేవాలయములు దోపిడిపోయెను; పెక్కు నాశమందెను; దేశ మున దెక్కలికాండ్రు ప్రబలిరి; గ్రామములు పరశురామప్రీతి యాయెను; రైతులు సర్వస్వమును గోలుపోయిరి; సేద్యనాద్యము సేయు జనసంఖ్య సన్న గిల్లెను; పైరుపచ్చలు బగ్గియైపోయెను. ఈ పరిస్థితులలో జనులు దమ జన్మ స్థానముల నుండలేక దేశత్యాగముజేసి దక్షిణమందలి నాయకరాజ్యములకు వలసలుపోయిరి. ఇట్లు వలసపోయినవారిలో రాయదత్త అగ్రహారాదికముల ననుభవించుచు వేదాధ్యయనపరులై యజ్ఞాది వైదిక కర్మలయందును శాస్త్ర

పరిశోధనయందును కాలము గడుపుచుండిన శ్రోత్రియులును, రాయ సంస్థానము నాశ్రయించుకొని యుండిన విద్వత్కవిగాయకనర్తకాది కళావిశారదులును ముఖ్యముగ నెన్నదగినవారు. వీరికెల్ల నాయకరాజు లాశ్రయమిచ్చి జీవనాధారములు గల్పించిరి. తత్కారణమున వారి యాస్థానములు సరస్వతీపీఠములై యాంధ్రగీర్వాణ సాహిత్యములకే కాక లలిత కళలకును దానకములై విలసిల్లినవి.

## ప్రకరణము ౨
## సారస్వత పీఠములు.

దాక్షిణాత్య ఆంధ్రవాఙ్మయమంతయు దంజాపూరు మధుర సంస్థానములయందె యుత్పత్తిల్లెనని వాఙ్మయ చరిత్రకారులు జెప్పుదురు. ఇది సరికాదు. తంజాపూరు మధుర సంస్థానములుగాక ఆంధ్రవాఙ్మయ మభివృద్ధినందిన తావులు ద్రావిడదేశమున మఱికొన్ని కలవు. అందు పుదుక్కోట యొకటి. ఈ సంస్థానాధిపతు లాంధ్రులుగారు; శుద్ధ ద్రావిడులు; కాని గ్రంథరచన మూలమునను కవి పోషణవల్లను వీరు చేసిన యాంధ్రభాషాసేవ సంస్మరణీయము. విజయరఘునాథుడు ఆంధ్ర కవికల్పభూజము; రాయరఘునాథుడు దొడ్డ కవి, రసిక శిఖామణి. పార్వతీ పరిణయమను చక్కని కబ్బమును విరచించెను. ఆంధ్రభాషార్ణవాది బహుళ గ్రంథకర్తయైన నుదురుపాటి వెంకన ఇతని యాస్థానము నలంకరించెను. చెంజిరాజధానిగ తుండీరమండలమును పాలించిన యాంధ్రనాయక రాజులును మాతృభాషాభివృద్ధికి దోడ్పడినవారలె. నాయకయుగమున వెలసిన కవు లనేకులు తుండీర ప్రభువులచే సత్కారమును బడసినట్లు తెలియవచ్చుచున్నది. "కర్ణాట తుండీర చోళ పాండ్య ప్రముఖాఖిల మండల మండలాఖండల దత్తమత్త సింధుర... రత్నాంబరాది వస్తు...నిఖిల శుభలక్షణుండ"నని గణపరపు వెంకటకవియు; "బాకశాసన చిహ్నభాసురప్రభ చెంజి వరదేంద్రు నాస్థాన వసుధయందు, మంతుకెక్కిన" తిరువేంగళార్య కవి శిష్యుండనని ఋగ్వేద కవి వేంకటాచలపతియు జెప్పుకొని యున్నారు. ఈ తిరువేంగళార్యకవి చెంజివరదప్ప నాయకుని యాస్థానకవియని తోచుచున్నది. ఇట్లు తుండీర మండలాధిపతులచే సత్కారములను బడసితిమని చెప్పుకొను కవులు మఱికొందఱుగూడ గలరు. కావున తంజాపుర మధురాధిపతులవలె చెంజిదొరలును ఆంధ్రభాషను బోషించిరనుట తెల్లము. కాని చెంజి సంస్థానమున రచియింపబడిన గ్రంథము

లెవ్వియు నింకను బయల్వడలేదు. కువలయాశ్వచరిత్రను రచించిన సవరము చిననారాయణరాజు చెంజిరాజకుటుంబమునకు సంబంధించినవాడని యెంచుటకు గొంత యవగాశముగలదు.*

దాక్షిణాత్య ప్రభువులెల్లను ద్రావిడ దేశమునం దాంధ్రభాషను బెంపొందించినను, మధుర తంజాపుర నాయకులభాషాసేవ సంస్తవనీయము. మధుర నాయకులకంటె దంజాపుర ప్రభువులు వాసికెక్కిరి. తొలుదొల్త భాషాభిమానము మధురనాయకులకు స్వాభావికమైనట్లగపడదు. తంజాపురాధిపులతో బోటిసేయ నలవఱచుకొనిన గుణవిశేషముగ దోచెడిని. మధుర నాయకులలో భాషాపోషకులని పేరందినవారు ముగ్గురు. మొదటివాడు క్రీ. శ. 1623 మొదలు 1659 వఱకు ప్రజాపాలన మొనర్చిన తిరుమల నాయకుడు. ఇతడు లింగనమఖి కామేశ్వరకవికి స్వచ్ఛముక్తాగుళుచ్ఛ

---

* సవరము చిన నారాయణ నాయకుడు కువలయాశ్వ చరిత్రను దన పితృవ్యుడైన సవరము నారాయణరాజున కంకితమొసగెను. ఈ నారాయణరాజు "మణినాగనగరకాంతు"డని షష్ఠ్యంతములలోను, "మణినాగపట్టణవిశ్రుత ప్రభుతోజ్జ్వలు"డని ప్రథమాశ్వాసాంతమునను జెప్పియున్నాడు. ఇందువల్ల సవరము నారాయణరాజునకు మణినాగపురవరాధీశ్వరుడను బిరుదుండెనని తోచుచున్నది. ఈ మణినాగపురముతోటి సంబంధము చెంజి నాయకులకును గలదు. శకాబ్దము 1583 నకు సరియగు క్రీ. శ. 1670-71 సంవత్సరమున చెంజి వరదప్పనాయుండు రామేశ్వరమునుండి మరలివచ్చుచు మధురజిల్లాలోని తిరుప్పరన్ గున్రమను గ్రామమున వ్రాయించిన శిలాశాసనములలో దమ పూర్వికు లిరువదియైదు తరములకు ముందు ఆర్యావర్తములోని మణినాగపురమునుండి విజయనగరమునకు వలసవచ్చిరని చెప్పియున్నాడు. (ARE 860,861 of 1917) చెంజి నాయకులకును సవరము వారికిని దప్ప మణినాగపురముతోటి సంబంధ మాంధ్రుల కెవ్వరికిని లేదు. కావున సవరము

సితచ్ఛత్ర చామరకళాచికాకనకాందోళికాది రాజోపచారముల జేసి సత్కరించెను; సంగీత సార్వభౌముడని నుతికెక్కిన సుప్రసిద్ధపదకర్త క్షేత్రయచే దనపేర బదములు జెప్పించుకొని బహూకరించెను. ఇతనివలెనె ఇతని తమ్ముని పుత్రులు చొక్కనాథ నరపతియు ముద్దళగిరియు భాషాపోషకులు. చొక్కనాథుడు కామేశ్వర కవి కాశ్రయమొసగెనే కాని గ్రంథరచనకు బురికొల్పినట్లగపడదు. తమ్మునికి ముద్దళగరి కుండిన యభిరుచి యతనికి లేదు. ముద్దళగరి కామేశ్వరకవిని గ్రంథరచనకు బ్రోత్సాహించి యతనిచే సత్యభామాసాంత్వనమును వ్రాయించి యంకితము గొనెను. చొక్కనాథ నాయకుని రాణి మంగమ్మయు గ్రంథరచనకు గారణభూతురాలైనది. ఆమెకు భాషాభిమానములేదు; కవులకాశ్రయమిచ్చి వారిని కావ్యరచనకు బురికొల్పనులేదు; స్వయముగ గవయిత్రియుగాదు. కాని యామె పేర రెండు గ్రంథములు విరచింపబడెను. మంగమ్మచే నపకృతి నందిన కవి యొక్కడామెను

---

వారును చెంజి నాయకులును నేక కుటుంబమునకు జెందినవారు కావచ్చును. అగునేని, కువలయాశ్వ చరిత్ర చెంజినాయక రాజ్యమం దుప్పతిల్లిన కావ్యమని చెప్పవచ్చును.

ఈ సందర్భమున చెంజి వరదేంద్రుని చరిత్రను గొంచెము చెప్పవలసి యున్నది. ఇతడు చెంజి వెంకటప్పనాయని తమ్ముడు. వెంకటప్పనాయనికి బుత్రసంతానములేదు; కావున క్రి. శ. 1645 మార్చి తే 13 నాడతడు దివంగతుడైన పిమ్మట వరదప్పనాయుడు గద్దెయెక్కెను. క్రీ. శ. 1649 జనవరి నెలయందు విజాపుర దండనాయకునకు చెంజిని కైవసము గావించెను. (N, Macleod: De Oost Indische Compagnie alls zee mogen dhied, Vol 11, pp 186, 407.) ఇంతటితో చెంజి నాయక రాజ్యచరిత్ర సమాప్తమాయెను. కావున తిరువెంగళార్యకవి చెంజి వరదేంద్రు సభ నంతుకెక్కినది. క్రీ. శ. 1635-39 మధ్య కాలముననైయుండవల యును. పై నుదాహృతములైన తిరుప్పురన్ గుఱ్ఱ శాసనముల నాధారపఱచు

బూతులు దిట్టుచు మధురమంగాపుంశ్చలీవిలాసమును, చినవెంగన్న యను నతఁడు మంగమ్మదండకమును రచించిరి. ఎట్లైన నేమి? వాఙ్మయప్రపంచమున తాను సంపాదించుకొన్నది ధన్యురాలు మహారాణి మంగమ్మ. భాషా పోషకులైన మధురనాయకులలో నగ్రగణ్యుడు మహారాణి మంగమ్మ మనుమడు విజయరంగ చొక్కనాథ నాయకుడు. ఇతడు కవిజనప్రియుడు. సుప్రసిద్ధులైన కవుల కనేకులకాశ్రయ మొసగి వారిచే సుకావ్యములను రచియింపజేయుచు విద్యావినోదముల విద్వాంసులగోష్ఠిని కాలము గడపువాడు. విద్వత్సభల కితని కాప్తుడగు సాంబ దండనాయకుని తనయుడును, సంగీత

---

కొని జయంతి రామయ్యపంతులుగారు వరదప్పనాయకుడును తిరువెంగళార్యుడును క్రీ. శ. 1670 ప్రాంతమున నుండిరని చంపూరామాయణ పీఠికయందు వ్రాసియున్నారు. వరదప్పనాయుడు రాజ్యభ్రష్టుడైన పిమ్మట మధురనాయకుల నాశ్రయించి తిరుచునాపల్లియందుండెను. చొక్కనాథనాయకు డితని నిజరాజ్యమున బునఃప్రతిష్ఠితుని జేయుటకు బ్రయత్నించెను కాని సాధ్యపడదాయెను. (See, History of the Nayaks of Madura, pp. 155-6) ప్రవాసకాలమందు వరదప్పనాయకుడు దన యాస్థానమున కవులను పోషించెననుటకంటె రాజ్యకాలముననె కవుల కాశ్రయ మొసంగెనని తలంచుట సమంజసము. కావున తిరువెంగళార్యకవి 17వ శతాబ్ద మధ్యను, నతని శిష్యుడు ఋగ్వేదకవి వేంకటాచలపతి యా శతాబ్దోత్తరార్థమునను వెలసిరని యెంచుట యుక్తము.

అపరము నారాయణరాజు వరదప్పనాయకునకు సమకాలికుడే. క్రీ. శ. 1630 మొదలు 1642 పర్యంతము కర్ణాట సామ్రాజ్యమును పాలించిన ముమ్మడి వేంకటపతిరాయుల కితడాశ్రితుడు. 1633 వ సంవత్సరమున తంజావూరు సింహాసనము నెక్కిన విజయరాఘవనాయకునిచే బండనల్లూరు యుద్ధమున నితడు బరాజితుడాయెను. కువలయాశ్వచరిత్ర రచయిత చిన నారాయణ నాయకుడును నప్పటివాడె కావలయును.

సాహిత్య సంస్కృతాంధ్ర కవితసరసజ్ఞుడును విద్యాధికారియునైన గోవిందయా మాత్య దగ్రాసనాధిపత్యము వహించువాడు. విజయరంగ చొక్కనాథనాయకుని యాస్థానమున వెలసిన కవులలో సముఖము వెంకట కృష్ణప్ప నాయకుడు, శేషము వెంకటపతి, వెలగపూడి కృష్ణయ్య, కుందుర్తి వెంకటాచలకవి ప్రముఖులు. వీరుగాక వెంకటాధ్వరిసుతుడు తిరుమలకవియను యక్షగానకర్త యొక్కడు విజయరంగ చొక్కనాథుని మన్ననకు బాత్రుడాయెను. విద్యాభిమానియై విద్వాంసులను గవీశ్వరులను, నాటకకర్తలను జేరదీసి వాఙ్మయమును బెంపందించిన దాక్షిణాత్యాంధ్రనాయక రాజులలో విజయరంగ చొక్కనాథ భూపతి కడపటివాడు.

వాఙ్మయపోషణయందేమి గ్రంథరచనయందేమి యొక దాక్షిణాత్యాంధ్రనాయక రాజులనేకాక ఆంధ్రదేశ విద్వత్ప్రభువులనెల్ల నధఃకరించినవారు తంజాపురాంధ్ర నృపాలురు. రఘునాథనాయకుడు తలయెత్తువఱకును దంజాపూరు సంస్థానమునం దాంధ్రభాషకు ప్రాముఖ్యము గలుగలేదు. చెవ్వప్పనాయకుడుగాని యచ్యుతప్ప నాయకుడుగాని విద్యాభిమానము గల దొరలుగ గన్పింపరు. రఘునాథనాయకుని దాక్షిణాత్య భోజుడని చెప్పవచ్చును. చక్కని విద్వాంసుడు, సంగీత సాహిత్య విశారదుడు, ఆంధ్ర గీర్వాణములు రెంటియందును సమానచాతుర్యముతో గవిత్వ మల్ల నేర్పుగల ప్రతిభావంతుడు, కవి జనాశ్రయుడు, వదాన్యుడు, కళాపోషకుడు, శూరుడు. సీతారామ భట్టాచార్యులవారన్నట్లు, "రఘునాథుడా—తంజాపుర నాయక రాజ—చరిత్రమునకు నాయకమణి. ఆయన యెంత వీరుడో యంత రసికుడు, ఆన్వీక్షక్యాది రాజ్యతంత్రమున నెంత సమర్థుడో, సంగీత సాహిత్యముల యందంత ప్రజ్ఞాధురంధరుడు. సంగీతసుధాగ్రంథమును రచియించునంతటి గానకుశలుడు. గొబ్బూరి జగ్గరాయాది సమూహాము నెంత యవలీలగ నోడించెనో యంత ప్రజ్ఞతో "జయంతసేన" "రామానందము"లను రాగములను కని

పెట్టెను. విజయనగర సామ్రాజ్యమునకు కృష్ణరాయలెట్టివాడో ఈయన తంజావూరు రాజ్యమున కట్టివాడని చెప్పనగును". *

రఘునాథనాయకుని యాస్థానమున ఆంధ్రకవులును గవయిత్రులును ననేకులువర్ధిల్లిరి. వీరియందు చేమకూర వేంకటకవియు కృష్ణాధ్వరియు ముఖ్యులు. మధురవాణి రామభద్రాంబలను కవయిత్రులిరువురు, సంస్కృత ప్రాకృతాంధ్రముల గవనము సెప్పగలవారు, రఘునాథుని యాస్థానము నలంకరించి యుండిరి; కాని వీరు తెనుగునందు గ్రంథములను రచించినట్లు కానరాదు. రఘునాథనాయకునకు సంస్కృతాంధ్రములు రెంటిలోపలను సంస్కృతము ప్రియతరము. కావున నతని యాస్థానమున సంస్కృత రచయితల కుండిన ప్రాధాన్య మాంధ్రకవులకు లేకపోయినది. విజయరాఘవుని యాగమనముతో నీ స్థితి మారెను.

తండ్రికి దగిన కుమారుడు విజయరాఘవుడు. ఆంధ్రసాహిత్యము నెదృష్టియందుంచుకొని చూచిన తండ్రిని మించినవాడని చెప్పకతప్పదు. విజయ రాఘవు డష్టభాషాధురీణుడు, ఆంధ్రగీర్వాణములు రెంటియందును ఆరితేఱిన విద్వాంసుడు, చతుర్విధ కవితానిర్వాహక సార్వభౌమబిరుదాంగద విరాజమాన చరణాంభోజుడు, గానకళా విశారదుడు, రసజ్ఞుడు, వదాన్యుడు, విద్వత్ప్రియుడు, కవిజన కల్పభూజము. గీర్వాణభాషా విశారదుడైనను సంస్కృత గ్రంథరచనకు బూనుకొనలేదు. చాలమివలన గాదు, ఆంధ్రముందలి మాలిమివలన. రాజ్యమేలిన నలువదియేండ్లును నిరంతరము భాషాసేవయందు కాలము గడపెను. కావ్యములు, నాటకములు, కీర్తనలు, పాటలు, పదములు లెక్కింటిని రచించెను, అతని యింఘ్రి నమరియుండిన సాహిత్యరాయ

---

* చూ. కొండలు తంజావూరు కవులు, పండితులు, హైదరాబాదు, 1943, పుట. 138).

పెండార మతని విద్యావైశారద్యమును ప్రకటించుచుండెడిది. కొలువు కూటము వాణీవిలాసమందిరమె. అందు:—

"భరత సంగీత సాహితీ ప్రముఖ విద్య
లాకృతులు గన్న చందాన నబ్జముఖులు
సరస ముక్తాతపత్ర చామరము లమర
వివిధ బిరుదాంక వాద్యముల్ వెలయనిల్వ"

కొలువుదీరి, విద్యావినోదముల బ్రొద్దుపుచ్చువాడు. నాట్యగాంధర్వ విద్యలయందు ప్రౌఢలైన చంద్రరేఖ, రూపవతి, చంపక, మూర్తి, కోమలవల్లి, లోకనాయిక, శశిరేఖ, రత్నగిరి, భాగీరథి మున్నగు విలాసినీమణులు దమ విద్యాకౌశలము బ్రదర్శించి యానందాంబుధి నోలలాడించువారు. విజయరాఘవుని కొలువుకూటమునకు బ్రధానాంగము శారదాధ్వజము. చెంగల్వ కాళకవి యనర్ఘములైన రెండు సీసపద్యములయందీ శారదాధ్వజము నిట్లు వర్ణించియున్నాడు.

"ఒక్కొక్కయెడఁ జీనిచక్కెర పానకంబాని నట్లాహ్లాదమావహిల్ల
నొక్కొక్కయెడఁ దావి నెక్కొన విరజాజిసరము లెత్తినరీతి బరిమళింప
నొక్కొక్కయెడఁ జల్వలూష్పతిల్లఁగ మందమారుతంబులు వీచు మహిమ చెలఁగ
నొక్కొక్కయెడ మేనజొక్కు సంపాదించు వెలదివెన్నెల తేఁటు విధము మించ

కవిత రచియింప విజయరాఘవ విభుండె
నేర్చునని వాణినర్తించు నేర్పుమీఱ
చామరానిల కందళ చలితమగుచు
దనరు సభయందు నల శారదాధ్వజంబు.

నవనవోల్లేఖన నవనయోగ్యముగాని పద్యంబు జనులకు హృద్యమగునె
ఘనతరాలంకార కారణంబులుగాని వాక్యవైఖరుల నెవ్వారు వినరు
శేషభాషిత వాగ్విశేషాన్వితముగాని పదము విద్వచ్ఛ్రేష్ఠపదము గాదు
ఘనసారసారంబుగాని సందర్భంబు లర్భకులైనను నాదరింప

రంచు వివరించు చలచామరాంచదనిల
చలితచేలాంచలాగ్రహస్తంబుచేత
విజయరాఘవ మేదినీ విభుని సభను
తనదు మహిమంబుచే శారదాధ్వజంబు."

సోమశేఖర శర్మగారు వచించినట్లు "విజయరాఘవుని కాలమున తంజాపూరిరాజు కొలువుకూటము నిజముగా గనులపండువు సేయు శారదా నాట్యమందిరమే. సంగీత నాట్యములందు సయితము విజయరాఘవుని దండెవేసిన చేయి. అతడు నవరసికులకెల్ల నాయకుడు" * కావున కవి పండిత జనమును బోలి, సంగీతనాట్య విద్యలలో గడిదేఱిన కళా విశారదులెల్ల దమ విద్యా కౌశల్యమును జూపి "సాహిత్యరాయ"ని మెప్పించి సత్కారమును బడయుట కాకొలువుకూటమునకు మూగువారు. విజయరాఘవుని కాలమున దంజాపూరాస్థానమున వెలసిన కవులలో జెంగల్వ కాళ కవి ముఖ్యుడు, ఇతఁడు కవిమాత్రుడుగాడు. కవిత్వమందువలె గాంధర్వ నాట్య విద్యలయందు నిపుణుడు. రఘునాథుని కాలమునుండియు సంస్థానము నలంకరించియుండిన రామభద్రాంబ, కృష్ణాజి మొదలగు కవయిత్రులకు విద్యా గురువై విజయరాఘవుని మన్ననకు బాత్రుడైనవాడు. కాళకవిగాక విజయరాఘవుని పుత్రుడు మన్నారుదేవుడును కోనేటి దీక్షిత, పురుషోత్తమ దీక్షిత

---

* 3. రఘునాథనాయకాభ్యుదయము, రఘునాథాభ్యుదయము. పీఠిక, పుట. 39.

వేంకటు సోమయాజులను యక్షగాన కృతులను రచించి వాసికెక్కిరి. సంగీత సాహిత్య విద్యలందు చతురలై విజయరాఘవుని యాస్థానమునకు పేరుతెచ్చిన కవయిత్రులలో చంద్రరేఖ, కృష్ణాజి, రంగాజులు ప్రముఖులు. మొదటివారిర్వురి కవితాకౌశలమును కాళకవి విశేషముగ ప్రశంసించి యున్నాడు. చంద్రరేఖ సామాన్యురాలు గాదు.

'వీరవేంకటురాయ పృథ్వీమహేంద్ర
దత్తబహువిధ బిరుదముల్ దనరుచుండ
సముఖముననిల్చి యాముద్దు చంద్రరేఖ
వివిధవిద్యలవినిపించి వింతగొల్పె'

డిదటు! కృష్ణాజి ప్రతిభను ఇట్లు వర్ణించి యున్నాడు:

"ప్రస్తార సంఖ్యను పదమూడుకోటులు నలువది రెండులక్షలు పదేడు వేలు నేన్నూరును వింశతియునునాలు వృత్తంబులందు నీ వృత్తమునకు నీ వర్ణనసమస్య నీవు గూర్పు మటన్న నా వృత్తమున సమస్యను రచించి యందుకు శ్లోకంబులాశువుగా జెప్పి యవి తెనుంగునను బద్యములు జేసి

ఇఱువదాఱును ఛందంబులెఱిగి యిట్లు
కవిత జెప్పినవారలీ భువిని గలరె
యనుచు నందఱు వినుతింప ఘనతగాంచె
కీర్తనీ యగుణాలంబ కృష్ణమాంబ!"

కాని చంద్రరేఖయును గృష్ణాజియును దాత్కాలికముగ దమ విద్యా చాతుర్యమును బ్రకటించి సమకాలికుల మన్ననలచే దృప్తులైరే కాని శాశ్వత కీర్తిని గోరి గ్రంథరచనకు గడగినట్లుగపడదు. వాగ్గేయకారుని శారీరమువలె వీరి విద్యావైశారద్యమంతయును నడపొడలేక మాసిపోయినది. రంగాజి వీరి యంతటి జాణ గాకపోయినను పాండిత్యమునను గవిత్వ నైపుణ్యమునను

వీరికి దీసిపోయినది కాదు. తన సామర్థ్యమునంతటిని కావ్యనిర్మాణమందె వినియోగించి, బహు గ్రంథకర్త్రియై యాంధ్ర కవయిత్రులలో నత్యున్నత స్థానము నాక్రమించినది. రంగాజీ విజయరాఘవునికి గరము ప్రియురాలు. ఈమె కాతడు కనకాభిషేకము జేసెనట. "అచ్యుతవిజయరాఘవ సార్వభౌమ ధర్మపత్నియై రంగుమీఱు రంగాజమ్మ" యని ప్రకటించుకొనినది. ఇది సంశయాస్పదము. రఘునాథనాయకుని భార్యలమని చెప్పుకొనిన మధురవాణీ రామభద్రాంబలవలె నీమెయును వారవనిత యగునేమొ! ఎవ్వతెయైన నేమి? శారదా కటాక్షములకు గుఱియై పవిత్రురాలై వినుతి కెక్కినది.

# ప్రకరణము. 3.

## నాయకయుగాంధ్ర సాహిత్యము - గుణవిశేషములు.

నాయక యుగమున వెలువడిన యాంధ్ర వాఙ్మయమునకు ముఖ్య గుణము వాఙ్మాధుర్యము. ఆంధ్రభాషయొక్క సహజమాధుర్యమంతయు సమాసక్తమై దాక్షిణాత్యాంధ్ర వాఙ్మయముగ నవతరించినదని చెప్పుట యొప్పు. తేట తెనుగుమాటలును, సరళమైన శైలియు, సందర్భోచితమైన సామెతలును, సరసమైన పదగుంఫనమును, హృద్యమైన పద్యములును దాక్షిణాత్యాంధ్ర కవితకు స్వభావసిద్ధమైన భూషణములు; శృంగారము ప్రధానరసము. కావ్యములు బహుళముగ శృంగారాత్మకములే. శృంగారమును విచ్చలవిడిగ వర్ణించుట కవకాశము గలుగజేయు నితివృత్తములనే కవులేర్చుకొనువారు. మన్నారుగుడి స్థల పురాణముగూడ వారి చేతులబడి రాజగోపాలవిలాసమను శృంగార ప్రబంధముగ మారినది.

నాయక యుగాంధ్ర సాహిత్యమును గురించి పెక్కు దురభిప్రాయములు ప్రబలియున్నవి. భాష పరిశుద్ధమైనది కాదు, తత్కారణమున నది యుత్తరాంధ్ర కవిత్వముతో సరితూగజాలదు; కావున నది రెండవ రకమని చెప్పవలసి యున్నది, అని కొందఱభిప్రాయ పడుచున్నారు. వీరియందు ప్రముఖులు జయంతి రామయ్యపంతులుగారు. దాక్షిణాత్య కవులు చాతుర్య ప్రదర్శనమే కవిత్వమునకు పరమావధియని యెంచి తత్సిద్ధికొఱకు సాంప్రదాయమును వీడియిచ్చి భాషా సాంకర్యమున కాలాయపడిరి; వారి రచనలలో బోడకట్టు వ్యాకరణ విరుద్ధ ప్రయోగముల కనేకముల కిదియె కారణమని పంతులుగారు సెలవిచ్చిరి. భాషా విషయములందు పంతులుగారు పరమ నైష్ఠికులు. కవిత్రయము వారి రచనలు వీరి కొలతబద్ద. తదనుసారము రచింపజాలని కవులను వీరు మెచ్చరు. తెనుఁగు లోకవ్యవహారము నందింకను ప్రవ

ర్తిల్లుచుండు జీవభాష యను సంగతిని వీరు విస్మరించినట్లున్నది. జీవభాషలకు నిత్య పారిశుధ్యము చేకూరదు. నానాటి కవి యభివృద్ధి నందుచుండును. ఈ యభివృద్ధి ననుసరించి భాషాపరిశుద్ధి మాఱుపు లేక యెల్లప్పుడు నొక్కతీరున నుండదు. దాని స్వభావము నూతన పరిణామములనందుచు యుగయుగములకును భిన్నమగుచుండును. మఱియు గవిత్వ గుణావగుణములను నిర్ణయించు నపుడు వ్యాకరణ మొక్కదానినె యొరగల్లుగ గ్రహించుట యుక్తముగాదు. "శబ్దార్థౌ సహితౌ కావ్యమ్" అని పెద్దలు చెప్పుదురు. కావున కావ్యరచనయందు శబ్దార్థములు రెంటికిని సమాన గౌరవము గలదు. వ్యాకరణ విరుద్ధ ప్రయోగములు కాదాచిత్కముగ గానవచ్చినంతటనె కావ్యములను గ్రిందుపఱచుట సమంజసము గాదు.

ఈ సందర్భమున వీరేశలింగము పంతులవారి వాక్యములు స్మరింపదగినవి. "ఇప్పటి వారు కవిత్వ స్వారస్యమును విచారింపక గ్రంథములందు రేఫద్వయప్రాస విశ్రమ మైత్రియో, యేదో వ్యాకరణ దోషమో యున్నదన్న హేతువుచేత రసవంతములైన యుత్తమ గ్రంథములను సహిత మగ్రాహ్యమని నిరాకరించు చున్నందున, అట్లు చేయుట యుక్తము కాదు. ఛందో వ్యాకరణ దోషములు లేని రసహీనములగు గ్రంథములకంటె ఛందో వ్యాకరణ దోషములను గలవయినను రసవంతములయిన గ్రంథములే యధికాదరణీయములు" అని చెప్పియున్నారు.

నాయకయుగము క్షీణయుగమనియు, నీ కాలములో తెలుగు కవిత్వము క్రొత్తపోకడలు లేక వెనుకటి రీతులలోనే విస్తారము నడచినదనియు, నూతనప్రతిభ క్షీణించెననియు, దిక్కన పోతనగార్లవలె కవిత్వము దివ్యకళయని విశ్వసించిన వారుగాని, శ్రీనాథునివలె రసోచితముగ వ్రాయగలవారుగాని, పింగళి సూరనవలె నూత్న కల్పనలు చేయగలవారుగాని ఈ కాలములో లేరనియు, సాహిత్యము క్షీణదశలో నుండుటకు గారణము సంఘ జీవితము

కూడ క్షీణస్థితిలో నుండుటయే యనియు ఖండపల్లి లక్ష్మీరంజనముగారను చున్నారు.

సీతారామ భట్టాచార్యులవారు వచించినట్లు, "దక్షిణాంధ్ర వాఙ్మయ మింతయని యిప్పటికిని చెప్పవలనుపడదు. రఘునాథ రాయాదులు రచియించి నట్లు చెప్పు గ్రంథము లిప్పటికిని బయట పడలేదు. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు తద్వాఙ్మయమును ప్రపంచమున కెఱుక చేయుటలో ప్రథములైనను, దాని వైఖరి యెట్టిదో సంపూర్ణముఁ దెలియరైరి." పరిషత్తు వారొక్కరే కారు,—చెప్పినట్టుగ నుండునుగాని,— వాస్తవముగ దాక్షిణాత్యాంధ్ర వాఙ్మయ విమర్శకుల కనేకుల కావాఙ్మయములో బరిచయము తక్కువ. "ఈ కాలములో కవిత్వము క్రొత్తపోకడలు లేక వెనుకటి రీతులలోనే విస్తారము నడచె"నని చెప్పిన లక్ష్మీరంజనముగారే "ఇది క్షీణయుగమైనను ఈ కాలములో పెక్కు సాహిత్య ప్రక్రియలు ఆంధ్ర భాషలో వెలసినవి. మొట్ట మొదటిసారి వచనరచనము విస్తారముగా ఈ కాలముననే జరిగినది. యక్షగానములని పిలువబడు నాటకము లీనాడే వ్యాప్తిలోనికి వచ్చినవి"అని వ్రాక్రుచ్చి నారు. వచనరచనయు యక్షగాన ప్రాదుర్భావమును క్రొత్తపోకడలుగావా? కావ్యరచనయు దొల్లిటి మార్గమున సాగలేదు. ఉత్తరాంధ్ర ప్రబంధములు వర్ణనాప్రధానములు, అందు కథాంశమల్పము. ఔచిత్యమును బరిపాటిం పక ప్రబంధ కవులు దమ గ్రంథములలో నిచ్చవచ్చినట్లు వర్ణనల బెంచిరి. కృష్ణరాయ విరచి తాముక్తమాల్యద, భట్టుమూర్తి కృత వసుచరిత్ర మున్నగు ప్రబంధము లిందుకు దార్కాణ. నాయక యుగ కావ్యము లిట్టివి కావు. అందు కథాంశము ముఖ్యము. వర్ణనలకొఱకు కథ నడక యొచటను నిలచి పోదు. వర్ణనలు లేకపోలేదు. కాని యవి కథ కనుగుణముగ వచ్చును, విజయ విలాస కువలయాశ్వచరిత్రములను మనువసు చరిత్రలతో బోల్చిచూచిన నుత్త రాంధ్ర ప్రబంధములకును నాయక యుగ కావ్యములకును గల భేదము తెల్లము

గాఁగలదు. తిక్కన పోతనాదుల వంటి మహాకవులు ప్రతి శతాబ్దమునను బొడమరు. అట్టి వారు లేకపోయినంత మాత్రమున వాఙ్మయము క్షీణ దశకు వచ్చెనని యెంచుట తగవుగాదు. నూతన ప్రతిభ క్షీణించినదని యన్నారుకదా లక్ష్మీరంజనముగారు. వారి యభిప్రాయమేమొ చక్కఁగ దెలియరాకున్నది. ప్రతిభ యనఁగా నప్పటప్పటికి వికసించెడు బుద్ధియని యర్థము చెప్పినారు శబ్దరత్నాకరకారులు. మేధాతిశయము గల కవులెవ్వరు నీ యుగమున బుట్టలేదని గాబోలు వీరి యభిప్రాయము. అగునేని యట్టి తలంపు ప్రమాద జనితమని చెప్పవలయును. కథా సంవిధానమునగాని, కల్పనా చాతుర్యమునగాని, చమత్కార వచోవిలాసమునగాని, వర్ణనా సౌష్ఠవమునగాని నాయక యుగాంధ్ర కవులెవ్వరికిని దీసిపోరు. చేమకూర, సవరము, శేషము, కంకంటి, పుష్పగిరి, ధరణిదేవుల కవులు వర్థిల్లిన కాలమును క్షీణయుగమనుట సాహసము గాదా?

దాక్షిణాత్యాంధ్ర వాఙ్మయము నీతి బాహ్యమని చెంచయ్య భుజంగ రావు గారలు ఖండించిరి. దాక్షిణాత్య కవులు పాతివ్రత్యము కంటె వ్యభిచారమును అతిశయముగ వర్ణింతురనియు దుర్నీతి నుపదేశింతురనియు దత్కారణమున నది యనర్థకరమనియు జెప్పిరి. సీతారామ భట్టాచార్యుల వారు వారి విమర్శ నొప్పుకొనక యది వారి క్రైస్తవ మతాభిమానము పెంపున జేసిన దుర్విమర్శయని నిరసించిరి. కాని యిట్టి విమర్శ కంకురార్పణము జేసిన వారలు చెంచయ్య భుజంగరావుగారలు గారు. వీరికి దారిచూపినవాఁడు వీరేశలింగము పంతులు. పంతులుగారు తమ యాంధ్ర కవుల చరిత్రయం దచటచట కొందఱు కవులను గూర్చి చెప్పిన అభిప్రాయములను వీ రేకముఖమునకు దెచ్చి దాక్షిణాత్య వాఙ్మయ మంతటిమీఁదను సొడ్డువెట్టిరి. ఇది వీరుచేసిన పొరపాటు. కాని వాస్తవముపై దృష్టియుంచి చూచితిమేని యిట్టి విమర్శకు గొంత యెడము గలదని తోఁచకపోదు.

నాయక యుగము శృంగార యుగము. భోగమప్పటి యాంధ్రు లకు జీవన పరమావధియైనది. స్త్రీ లౌల్యము సామాన్యము; బహుకళత్ర గ్రహణమును, వేశ్యాంగనా గమనమును సిరి గలవారికి లక్షణములు. కేవ లాంగ భోగములతో దృప్తినందియుండక ధనవంతులగు రసికవతంసులు స్త్రీల సర్వాంగములనే కాక స్త్రీ పురుషుల పరస్పర సంబంధ వర్తనలకు జెందిన బయలుపెట్టరాని మర్మ విషయములను గూడ నాయక నాయికా వ్యాజమున పలువిధముల వర్ణింపించి యానందించెడివారు. ఈ కారణముచేత నాయక యుగాంధ్ర వాఙ్మయమునకు గళంకు దెచ్చెడి నీతి బాహ్యకావ్య ములు పెక్కు బయలు వెడలినవి. కాని దాక్షిణాత్య వాఙ్మయము సర్వ మును నీతిబాహ్య శృంగార వర్ణనాత్మకము గాదు. కొందఱు దాక్షిణాత్య కవులు హద్దుమీఱి శృంగారమును పచ్చిగ వర్ణించినది వాస్తవమె. కాని వారి తప్పుకై దాక్షిణాత్య వాఙ్మయము నంతటిని దూషించి ఖండించుట సద్విమ ర్శకుల పద్ధతి కాదు.

ఈ సందర్భమున దృష్టియం దుంచుకొనదగిన యంశమొకటికలదు. కావ్య నిర్మాణము యొక్క ముఖ్యప్రయోజనము ధర్మోపదేశముగాదు. ప్రపంచాను భవమువలన గలిగిన భావోద్రేకము శబ్దరూపమున బహిర్గతమై కవితయన బరగుచున్నది. రసాలంకార భూషితమైన కవిత కావ్య మనబడును. కావున కావ్యోత్పత్తికి బ్రధాన కారణము ప్రపంచానుభవము వలన గలుగు భావోద్దీ పనమే. ప్రపంచానుభవము బహువిధములైనది. దానినిబట్టి భావము లనేక రూపముల బ్రభవించుచుండును; వాని ననుసరించి కవితావస్తువు మాఱుచుండును. ఏతత్కారణమున కవిత్వము నిర్నిరుద్ధమై యుండవలయు ననియు, నీతి నిబంధనలను కవులు సరకు సేయవలసినది లేదనియు వాదించు వాఙ్మయ విమర్శకులును గలరు. కావున శృంగారాత్మకమైనదని దాక్షిణాత్య వాఙ్మయమును వెలివేయబూనుట భాష కపకారము జేయ బూనుటయే కాని యన్యము కాదు.

## ప్రకరణము. ౪.

### కావ్యము

నాయక యుగమునం దాంధ్ర సాహిత్య వాహిని బహు ముఖముల బ్రవహించినది. ఇందు ముఖ్యమైనవి మూఁడు. కావ్యము, నాటకము, గీతము.

౧. కావ్యము:—ఇది త్రివిధములైనది, పద్యకావ్యము, ద్విపద కావ్యము, వచన కావ్యము.

మొదట పద్యకావ్య చరిత్రను విచారింతము.

### రఘునాథుఁడు

దాక్షిణాత్యాంధ్ర పద్యకావ్య రచయితలలో బ్రథమమున బేర్కొన దగినవాడు తంజావూరు రఘునాథ నాయకుఁడు. ఇతడు బహు గ్రంథకర్త. నూఱు గ్రంథములను రచించెనట! విజయరాఘవ నాయకుఁడు తన తండ్రి రచించిన గ్రంథములను గొన్నింటిని పేర్కొని యున్నాడు.

భువి మెచ్చ నచ్యుతాభ్యుదయ కావ్యంబు
నవరస చిత్రంబు నలచరిత్రంబు
హరువైన పారిజాతాహరణంబు
మెఱపడి జూపు వాల్మీకి చరిత్ర
జానకీ కల్యాణ చాటు కావ్యంబు
తా నిర్వహించిన తక్కిన కృతులు.

ఇవి యన్నియు నాంధ్రకృతులని తోచెడిని. ఇందు పారిజాతాహరణ కావ్యరచననుగూర్చి యజ్ఞనారాయణ దీక్షితులు దన సాహిత్య రత్నాకరమునం దిట్లు చెప్పియున్నారు.

యా మద్వయేన యదునేతరి పారిజాత
మాజీహర త్సరస మచ్యుతభూప సూనుః

కావ్యం తదత్ర విబుధైస్తు కథం కథంచి
దాలేఖి చిత్ర మవదాయ ఫణీంద్రకల్పైః.
ఏవం వద స్తనయ మేవ కృపారసార్ద్రైః
జాతాభిషేక మపితం జగతీబిడౌజాః
తత్రాభ్యషి ఇచ్చిత మణీభి రసౌ సభాయా
మాసీత్స ఏవ వసుధేశ కటాభిషేకః.

ఇందువలన రఘునాథ నాయకుఁడు పారిజాతాపహరణమును ఆశువుగా జెప్పెనని తెలియుచున్నది. ఇవిగాక రామాయణమును రఘునాథుఁ డాంధ్ర కావ్యముగా రచించి దానిని మధురవాణిచే సంస్కృతీకరణము గావించెను. ఈ యంశమును రఘునాథుని వాక్యములుగ మధురవాణి ఇట్లు తెలుపుచున్నది.

"రసోత్తరం రామకథానుబంధ
కావ్యం మయాకల్పిత మాంధ్రవాణ్యా
కార్యం కయా సంస్కృతవాగ్భిరేతత్
ఇత్యేవది త్తే గణయన్న వాటీత్.
అజహాదలంకృతిక్రమ మనేకరసోల్లసితం
సరస పదార్థ సంగతి సమగ్ర గుణానుగుణం
రఘురమణ ప్రబంధతిలకం రసికాభిమతం
సుదతి విధీయతా మితి సుధీ రగదీన్నృపతిః."

రఘునాథ కృతములని పైఁ జేర్కొన్న ఆంధ్ర గ్రంథములలో రెండు మాత్ర ముపలబ్ధమైనవి. అందు రామాయణ మొకటి. కాని ఇది మధురవాణి సంస్కృతములోనికి దర్జుమా జేసిన రామాయణమని తోఁచదు. ఏలనఁగా, మధురవాణి రామాయణము చిన్న కావ్యము. ఇందు పదునాలుగు సర్గలును మొత్తము మీఁద ౧౫౦౦ శ్లోకములను గలవు. కాని మనకు లభ్యమైన రఘు

నాథ రామాయణ మసమగ్రము; ఇందు బాలకాండమునందు మూఁడాశ్వాసము
లును నాల్గవ యాశ్వాసారంభమునం దిరువదియాఱు పద్యములు మాత్రము
గలవు. ప్రథమాశ్వాసమంతయుఁ బీఠికయును బాలరామాయణమునకును సరిపోయి
నది. ద్వితీయాశ్వాసము కోసలదేశ వర్ణనతోఁ బ్రారంభమై ఋశ్యశృంగ
చరిత్రతోఁ దుద ముట్టినది. తృతీయాశ్వాసము ఋశ్యశృంగుని యయోధ్యా
గమనముతో నారంభమయి పుత్రకామేష్టితో ముగిసినది. నాల్గవయాశ్వాసము
శ్వేతద్వీప వర్ణనతో నారంభమైనది. మొత్తముమీఁద నందు పద్యములుగాని
వచనములుగాని ౪౬౮ కలవు. దీనినిబట్టి చూడఁగా రఘునాథుఁడు వ్రాయ
దలపెట్టిన ఈ రామాయణము బృహద్గ్రంథమని తోఁచుచున్నది. ఇది మధుర
వాణి ౧౫౦౦ శ్లోకములలో సంస్కృతీకరించిన యాంధ్ర రామాయణమై
యుండదు. సీతారామ భట్టాచార్యుల వారును నిట్టి యభిప్రాయమునె వెలి
బుచ్చియున్నారు. కాని వారి యభిప్రాయమునకు గారణము లేదు:—
"మధురవాణి కావ్యముతో దీనిని బోల్చిన యెడల నిదియే భాషాంతరీకరింప
బడినట్లు తలంచుటకు వీలులేదు. ఏలన తెలుగు గ్రంథముకంటె సంస్కృత
కావ్యము ప్రౌఢతరముగ నున్నది." మధురవాణి భాషాంతరీకరించిన యాంధ్ర
రామాయణము ప్రస్తుతమునందుండు రామాయణమునకంటె భిన్నమైనదే
యైనను నిది ప్రౌఢిమయందు మధురవాణి సంస్కృతీకరణమునకు సరికాదనుట
న్యాయముగాదు. ఏ కావ్యమందుగాని రచనా సౌష్ఠవము మొట్టమొదటి
పద్యమునుండి చిట్టచివర గద్యమువఱకు నొక్క తీరుగ నుండదు; సందర్భమును
బట్టి మాఱుచుండును. విరాటోద్యోగములందును, యుద్ధపంచకమందును
గానవచ్చు తిక్కనగారి కవితా ప్రౌఢిమ శాంతి సప్తకమున గానరాదు. మను
చరిత్ర మొదటి మూఁడాశ్వములలోని మజా తరువాతి గ్రంథమునందు లేదు.
రఘునాథరామాయణము రామాయణము నందంతయుఁ నొక లేశము. కథా
నాయకుఁడగు రాముని జన్మమునకు ముందే యాగిపోయినది. ఆ లేశమును

సంపూర్ణముగ విరచితమైన మధురవాణి గ్రంథముతో బోల్చి యందు ప్రౌఢిమ చాలదనుట పునాదిని పరీక్షించి పై కట్టడము జక్కనిది కాదని యన్నట్లున్నది. రఘునాథ రామాయణ కవిత్వము రసవంతమైనది. నిరర్గళమైన ధార, సరసమైన శైలి, మధురమైన వాగ్గుంఫనము, స్వభావసిద్ధమైన వర్ణనలు చదువ జదువ జవులూరుచుండును. ఋశ్యశృంగుని కథ చొక్కమై యింపెసలారుచు రఘునాథుని కవితావైభవమును ప్రకటించుచున్నది. గ్రంథమున దక్కిన భాగము నష్టమైపోయెనని వాఙ్మయ చరిత్రకారులును విమర్శకులును వాపోవుచున్నారు. కాని రఘునాథుడు వ్రాసినదంతయు నింతియె యేమొ! పూర్తి సేయక మునుపె యతడు స్వర్గసీమ నలంకరించెనేమొ!

రెండవది వాల్మీకి చరిత్ర. ఇది మూడాశ్వాసముల చిన్న ప్రబంధము; వాల్మీకి పూర్వచరిత్ర మిందువర్ణింపఁబడినది. సప్తద్వీపములందలి పుణ్యతీర్థములును, ఋషుల పర్యటనమును, వాల్మీకి సమాగమమును, నతని జ్ఞానోత్పత్తియు, బోయజీవనమును, రంభోర్వసుల పరాభవమును మనోహరముగ వర్ణించినాడు. రఘునాథ భూపాలుడు సౌందర్య పిపాసకుఁడు, రసజ్ఞుఁడు. కవిత్వ స్వరూపమెట్టిదో నిర్దేశించినాఁడు.

పలుకఁగ వలె నవరసములు
గులుకం బద్యములు చెవులకున్ హృద్యముగా
నలుకక యటుగాకున్నం
బలుకక యుండుటయె మేలు బహుమానముగన్.
చెప్పవలె కప్పురంబులు
కుప్పలుగా బోసినట్లు గుంకుమపైపై
గుప్పిన క్రియ విరిపొట్లము
విప్పినగతి ఘుమ్మనన్ గవిత్వము సభలన్.

చెవులకుఁ జవులై చల్లఁగఁ
గవులకుఁ దవులై సమస్త కావ్య కళాబం
ధువులై రససింధువులై
యవురా! యన గవిత లవని నలరఁగ వలదా.

దీని కనుగుణముగనె చెప్పినాఁడు కవిత్వమును. లచ్చారావుగారు చెప్పి నట్లు "ఈతని కవిత్వము లలితార్థ చమత్కార పద భూయిష్ఠమై స్వభావోక్తి చణమై పండిత పామరకర్ణ రసాయనంబై మృదుమధుర శైలితో నెంతయు సమయోచిత వర్ణనలతో నొప్పారుచున్న యది. వ్యర్థపదంబులు గానరావు."

రామాయణ వాల్మీకి చరిత్రలు గాక సావిత్రీ చరిత్రను వర్ణించు రెండాశ్వాసముల పద్యకావ్య మొకటి కలదు. గ్రంథావతారికగాని యాశ్వా సాంతములు గాని లేవు. యత్కృతమో తెలియదు. కాని గంటి సూర్య నారాయణ శాస్త్రులవారు దీనికి శృంగార సావిత్రి యని నామకరణము జేసి రఘునాథ నాయకుని కంటగట్టినారు. దీనికి వారు చూపిన కారణ మొక్క టియే. "శ్రీ రఘునాథ రాయ మహాకవి రచియించిన రామాయణమందలి పద్యములు—ఋశ్యశృంగ తపోభంగము పట్టున నున్నవి—ఈ గ్రంథము నందుండుటచే తత్కర్తయే యేతత్కర్త యని మే మూహించినాము." అని చెప్పినారు. ఆ రెండు గ్రంథములకును ఉమ్మడియైన పద్యము లెవ్వియో వారు తెలుపలేదు. ముద్రిత రఘునాథ రామాయణములోని పద్యము లెవ్వియు శృంగారసావిత్రియందు గన్పట్టవు. ఈ విషయము నింకను బరిశోధింపవలసి యున్నది. ఇది యెట్లున్నను గవిత్వమునుబట్టి చూడఁగా శృంగారసావిత్రి రఘునాథుని రచన కాదని తోఁచుచున్నది. శృంగార సావిత్రిని రఘునాథుని గ్రంథములతో బోల్చి చూచిన నీ విషయము దెల్లము కాఁగలదు.

## చేమకూర వెంకట కవి

ఇతఁడు రఘునాథుని యాస్థానాంధ్రకవి బృందమునకు శిరోమాణిక్యము. దాక్షిణాత్యాంధ్రకవులలో నింతకు మించిన కవిలేడు. ఇతఁడు సారంగధరచరిత్ర, విజయవిలాసములను రెండు గొప్ప కావ్యములను రచించి రఘునాథుని కంకిత మిచ్చెను. సారంగధర చరిత్ర వేంకటు కవియొక్క ప్రథమ రచన. కవిత్వము రసవంతమైనదే. కాని విజయవిలాసములోని పరిపక్వత యందు గానరాదు. చేమకూరవారి కవిత నాంధ్రలోకము చిర కాలము క్రిందనే చవిచూచినది. ఇంటిపేరు ససరైనను, కవిత్వము పసగా నున్నదని యొక ప్రాచీన వాఙ్మయ విమర్శకుఁడు వక్కాణించెను. "ఈ చేమకూర చక్కెరమడిలో నమృతము పారించి పెంచినది కాని మట్టిలో నీరు పారించి పెంచినది కాదు" అని యానందపరవశులై యాభాషించి నారు పూజ్యపాదులు కళాప్రపూర్ణ వేదము వేంకటరాయ శాస్త్రిగారు. సెబాసని యామోదించినది ఆంధ్ర విద్వత్ప్రపంచము. "పింగళి సూర్యని ప్రభావతీ ప్రద్యుమ్నమునకు తరువాత విజయవిలాసమే సర్వవిధముల చేతను తెలుఁగులో శ్లాఘ్య కావ్యముగ నున్నది." "సామెతలతోను, శబ్దాలంకార ములతోను నిండియుండి యర్థగౌరవము కలదయి రసవంతమయి యున్నందున చేమకూర వేంకటుకవి కవిత్వము సర్వజనాదరణీయమయిన దని తలచు చున్నాను" అని సెలవిచ్చినా రాంధ్రకవిచరిత్రకారులు.

వాస్తవముగ చేమకూరవారి కవిత్వము నెంతపొగడినను తనివి తీరదు. వేంకటుకవి భాషింప నేర్చిన యమృతధారాధరము. అతనిది సాధారణ కవిత్వముగాదు. ఆమనియందు చిగురాకు జొంపములలో డాగి కర్ణరసాయనముగ బాడుకోయిల గానము. ఇందు సుధారసమును మరపించు మృదుమధురధారయు, శిరీషకుసుమపేశలమగు యోక్తులును ఆనందాబ్ధి నోల

లాడించును. ఒక వింత. కవీశ్వరులు రసధునీ ప్రవాహమువలెను, చమత్కార పయఃపూరమువలెను గవనము చెప్పియున్నారు. ఈ రెంటిని సమ్మేళనము గావించి యత్యంతరమణీయముగను హృదయంగమముగను కావ్యకల్పన జేసిన వారు కొందఱే. ఇందు మహాకవి రామరాజభూషణుఁడు ప్రముఖుఁడు. మన చేమకూర కవియన్నతో రామరాజభూషణుని యథఃకరించినాడు, అగ్ర స్థానము నాక్రమించినాఁడు. ఈ విషయమునం దితడు రామరాజ భూష ణునికంటెను, వేయేల ఆంధ్రకవు లెల్లరకంటెను మిన్నయై వన్నెకెక్కెను. రసగుంఫితముగాని పదమునుగాని పద్యమునుగాని యీతని గంటము వ్రాయ నెఱుఁగదు. అద్భుతవర్ణనలు, శబ్దార్థాలంకారములు, చమత్కారోక్తులు నెల్లి కొల్లలై యుల్లమును రంజింపజేయును. సారస్యపు గల్పవృక్షముపై నల్లి బిల్లిగ నల్లుకొన్న యమృతవల్లివంటి దీతని చమత్కారము; బుద్ధికి సులభముగ గోచరముగానివిధమున భావశబ్దార్థములతో లంకె దగిలియున్నది. ఇట్టి యసామాన్య కవితాప్రభావము గల్గినవాడగుటచేతనే,

తారసపుష్టిమైఁ బ్రతిపదంబున
        జాతియు వార్తయుఁ జమ
త్కారము నర్థగౌరవముఁ గల్గ
        ననేక కృతుల్ ప్రసన్న గం
భీరగతిం రచించి మహిమించిన

యీ రఘునాథ భూపరసికాగ్రణి వేంకటుకవి కావ్యకన్యలను వలచి వరించెను.

## కృష్ణాధ్వరి

కృష్ణాధ్వరి రఘునాథ భూపాలుని యాస్థానము నలంకరించిన విద్వ త్కవిపుంగవులలో మఱియొక్కఁడు. ఈయన బహు గ్రంథకర్త. తాను వ్రాసిన గ్రంథములనన్నిటిని రఘునాథునికె యంకిత మొసఁగెనట. వినుఁడు:

నవరస శ్రీ రఘునాథ భూపాలీయ
నామ భామాభీష్ట దాయకుండు
నైషధపారిజాతావతారిక కావ్యవర్యా
స్వయంవర వల్లభుండు
కల్యాణ కౌముదీ కందర్ప నాటక
కన్యోద్వహన బద్ధ కంకణుండు
అమరు కాహంకార హారి భంగిర
శృంగార సంజీవనీ కాముకుండు
తాళచింతామణీ వధూతత్పరుండు
మంచిజామాత రఘునాథమనుజ నేత
తెలియ నైషధపారిజాతీయ కృతియుం
నేవురక్కల చెల్లె లై హెచ్చుననుచు.

ఇందువలన కృష్ణాధ్వరి రఘునాథ భూపాలీయము, నైషధ పారిజాతీయావతారిక, కల్యాణకౌముదీకందర్పనాటకము, శృంగార సంజీవని, తాళచింతామణి, నైషధపారిజాతీయ మను నాలుగ్రంథములను రచించెనని తెలియుచున్నది. వీనిలో రఘునాథభూపాలీయము విద్యానాథ మహాకవి విరచిత ప్రతాపరుద్రీయిమువంటి యలంకార శాస్త్రమనియు, నందువలెనే యిందును ప్రతి శ్లోకమునను కృతిపతి నామము తగిలియున్నదనియు శ్రీ చల్లా సత్యనారాయణగారు చెప్పుచున్నారు. ఈ రఘునాథభూపాలీయమును నైషధ పారిజాతీయమును దప్ప తక్కిన గ్రంథములు గానిపించుటలేదు. అవి సంస్కృత గ్రంథములని కొందఱూహించుచున్నారు. శృంగారసంజీవని సంస్కృతమున రచింపఁబడి యుండవచ్చును. తక్కినవానిమాట యిదమిద్ధ మనుటకు వీలులేదు. అవి తెలుఁగు గ్రంథములైనను కావచ్చును. అగు నేని కల్యాణ కౌముదీకందర్పనాటకము యక్షగానము కావచ్చును.

నైషధ పారిజాతీయము ద్వ్యర్థి కావ్యమని దాని పేరే తెల్పుచున్నది. ద్వ్యర్థి కావ్యకర్తలలో నితనిస్థాన మున్నతమైనదని విమర్శకుల యభిప్రాయము. పింగళి సూరన "రాఘవ పాండవీయమును రంజకముగాను ప్రౌఢముగాను రచియించెను; తరువాత భట్టుమూర్తి తన హరిశ్చంద్ర నలోపాఖ్యానమును రచియించి యాత్రోవను కీర్తి గాంచెను; కాని నైషధ పారిజాతీయము పై రెంటివలెగాక చక్కని శైలిలో వ్రాయఁబడినది. రెండు ప్రబంధములవలె నడచుచున్నది." అని సీతారామ భట్టాచార్యులవారు వక్కాణించి యున్నారు. "సూరన తొల్తటి రచన యగుటచేత గావలయుఁ బ్రబంధమునందువలె వర్ణనలపై దృష్టినిలుపక కథాకథనవ్యగ్రుఁడై రాఘవ పాండవీయమును రచించెను..రామరాజ భూషణుఁడు...హరిశ్చంద్ర నలోపాఖ్యానముల కథను గైకొనుటయే కాక ప్రబంధోచితవర్ణన లన్నిటిఁ జేర్చి సూరన్నకన్న ద్వ్యర్థి కావ్యరచనలో నధికుఁడనిపించుకొనుటకు బ్రయత్నము జేసెను. కృష్ణాధ్వరియు వారిని మీఱఁ గేవలము వర్ణనలను జేర్చుటయే కాక కథాకల్పనయందును మృదుపదార్థ రచనయందును దృష్టినిల్పి తన ద్వ్యర్థి కావ్యమును జక్కని ప్రబంధద్వయముగా సంతరించెను" అని చల్లా సత్యనారాయణగారు వచించి యున్నారు. ఇది యంతయు వాస్తవమే కావచ్చును. శ్లేషకావ్యకర్తలలో కృష్ణాధ్వరి కడు దొడ్డవాడే కావచ్చును. కాని శ్లేష కవిత కాలికి దగిల్చిన సంకెల; భావప్రకటనను నిర్నిరోధముగ సాగనీయదు. ఎట్లు నిజాకర్షణ శక్తివలన సర్వపదార్థములను భూమి తన వైపున కాకర్షించుచున్నదో యట్లే శ్లేష కవి దృష్టినంతటిని బహుళార్థ పద సంయోగము వంకనే లాగుచుండును. కావున కృష్ణాధ్వరియు నన్య శ్లేష కావ్యకర్తలవలె దన యావచ్ఛక్తిని వలసిన యర్థములు గల పదములకూర్పునందె వినియోగింపవలసి వచ్చెను. వీరేశలింగము పంతులుగారన్నట్లు, "ఇట్టి గ్రంథములయందు నిఘంటువులు వెదకి పదములనేర్చి కూర్చిన శిల్పప్రౌఢి

మయేకాని యర్థచమత్కారముగాని భావగౌరవముకాని రసపుష్టిగాని పుట్టను." కృష్ణాధ్వరి నేర్పును పాండిత్యమును నెంత ప్రశంసాపాత్రములైనను, సమకాలికులగు రఘునాథ వెంకట కవుల కవిత్వమువలె నుత్తమమైనది కాదు.

## కాళయ్య

రఘునాథ నాయకుని కాలమునుండియు తంజావూ రాస్థానము నాశ్రయించుకొనియున్నను, కాళయ్య మంతుకెక్కినది విజయరాఘవుని కాలమునందె:

'ఆయ్య దినముల రామ భద్రమ్మ వారు
నేడు కృష్ణాజి కవితల నేర్పు మెఱసి
వినికి సేయుటలెల్ల మీ ఘనత గాదె'

యను విజయరాఘవుని వాక్యమువలన కాళకవి తంజావూరాస్థాన మండలి భోగకాంతలకు విద్య గఱపెడివాడని తెల్లమగుచున్నది. ఇతఁడు రచించినది రాజగోపాలవిలాస మను గ్రంథ మొక్కటియే. ఇటీవల నిది తంజావూరి సరస్వతీ మహాలు పుస్తకభాండాగారాధికారులచే బ్రకటింపఁబడినది. ఇది నైదాశ్వాసముల గ్రంథము. మన్నారుగుడి స్థలపురాణము. మొదటి యాశ్వాసమున జాల భాగము పీఠికకు సరిపోయినది, తక్కిన భాగమున రుక్మిణీకృష్ణుల సంయోగము వర్ణింపబడినది. రుక్మిణీస్వీయ యని పేర్కొనబడినది. ఇట్లే చతుర్థాశ్వాసము తుదవఱకు, కలహాంతరిత భద్ర, జారిణి లక్షణ, విప్రలబ్ధ జాంబవతి, ఖండిత మిత్రవింద, విరహోత్కంఠిత సుదంత, ప్రోషితభర్తృక కాళింది, స్వాధీనపతిక సత్యభామ వీరితో గోపాలకృష్ణుని కూటమి వర్ణింపబడినది. *

---

* జారిణి భద్ర, (పుట ౪౪) జారిణి లక్షణయని (పుట ౫౪) అని రెండుపర్యాయములు జారిణులను వర్ణించినట్లు ముద్రిత ప్రతియందుగలదు. ఇది పొరపాటు. సంపాదకులు దీనిని సవరించియుండిన బాగుగ నుండియుండును.

కృష్ణుని యష్టభార్యలను అష్టవిధనాయికలుగ జిత్రించుట కాళయ ప్రధానోద్దేశమని తెలియవచ్చుచున్నది. పంచమాశ్వాసమున మన్నారుగుడి స్థలమాహాత్మ్యకథనము గలదు. కవిత్వము సరసమైనదే. ఇతని సమాసరచన శ్రీనాథుని రచనందలపించుననియు, నన్నయవలె మత్తేభవృత్తమును నడిపించుట యందు గట్టివాడనియు, శృంగార రసమును ఆంధ్రకావ్యములందువలెగాక అమరుక కావ్యమునందువలె భావప్రధానముగనె యావిష్కరణము గావించినా డనియు శ్రీ నిడదవోలు వేంకటరావుగారు రసుచున్నారు. ప్రతానాముత్తమ ప్రత మనున్యాయముబడి చెప్పిన మాటలని తోచుచున్నవి. ఇంతకంటె, 'ఈయన కవిత్వము రసవంతమైనదేకాని విశిష్టగుణము గలది కాదు.' అను సీతారామ భట్టాచార్యులవారి యభిప్రాయమె సత్యమునకు దాపుగ నున్నది.

ఒక దృష్టిన జూచిన కాళయ్య తరువాతి మధురాపురాంధ్ర కవులకు మార్గదర్శకుడైనట్లు తోచుచున్నది. ఇతని శృంగార వర్ణనలు నాయికానాయకు లొండొరుల కూటమిఁగోరి పడు నాపసోపముల నుగ్గడించుచున్నవి. మధురాపుర కావ్యములం దీలక్షణము దఱచుగ గానవచ్చును. మధురవారికి దంజాపుర కవు లాదర్శప్రాయు లగుటవలన నొకవేళ వారీ కలవుటంగలారుపను కాళయ్య కడ నభ్యసించి యుండిన నుండవచ్చును.

## రంగాజమ్మ

రంగాజమ్మ తన వైదుష్యము నిట్లు చెప్పుకొన్నది: "విచిత్రతర పత్రికా శతలిఖిత వాచికార్థావగాహన ప్రవీణ. తత్ప్రతి పత్రికాశతస్వహస్తలేఖన ప్రశస్తకీర్తి. శృంగారరసతరంగిత పదకవిత్వ మహనీయమతిస్ఫూర్తి. అతులితాష్టభాషా కవితా సర్వంకషమనీషా విశేష శారద. రాజనీతి విద్యా విశారద, విజయరాఘవ మహీపాల రచిత కనకాభిషేక." పాటలు పదములు

గాక రంగాజమ్మ యాఱు గ్రథములు రచించెను. సంగ్రహ రామాయణ భారత భాగవతములు మూడు; మన్నారుదాసవిలాసోషాపరిణయ ప్రబంధములు రెండు; మన్నారుదాసవిలాస యక్షగాన మొకటి. ఇందు మొదటి మూడును నామమాత్రావశిష్టములై పోయినవి; తక్కిన మూడును తంజావూరు సరస్వతీ మహాలు పుస్తకభాండాగారమునందున్నవి. వీనిలో మన్నారుదాసవిలాస యక్షగాన మాంధ్రసాహిత్యపరిషత్తువారిచే ముద్రింపఁబడినది. తక్కినవి రెండును అముద్రితములు. ఎవ్వరో యొకరిద్ద రీ గ్రంథములను జదివిరి. దూరమున ద్రావిడదేశమున నిక్షిప్తమై యుండుటచే నివి యాంధ్రుల కందుబాటున లేవు. కావున వారి యభిప్రాయములను అంగీకరించి తృప్తిపడవలసి యున్నది. వీరిలో గణ్యులు కురుగంటి సీతారామ భట్టాచార్యులవారు. వీరు తంజావూరు పుస్తకభాండాగారాధికారులై యున్నపుడు భాండాగారములోని యన్యాంధ్ర గ్రంథములవలె రంగాజమ్మ కృతులను జక్కగా బరిశోధించి వానికి గాకితపు బ్రతులను వ్రాయించిరి. ఈమె గ్రంథములను వీ రిట్లు ప్రశంసించి యున్నారు.

"ఉన్నవానిలో మొదటిది మన్నారుదాస విలాసము. ఈ గ్రంథమునందలి నాయకుఁడైన మన్నారుదాసుఁడు విజయరాఘవ నాయకుఁడే. ఈ గ్రంథము తన యేలికయైన విజయరాఘవ నాయకునిపై వ్రాయబడినది. రెండవది హరివంశాంతర్గతమైన యుషాపరిణయగాథ. ఈ రెండు ప్రబంధములను జదివిన వారికి మొదటిదానికంటె రెండవది మిన్నయని కనపట్టక మానదు. కథాసంవిధానమందును, కవితా పటిమయందును, శైలిరీతియందును నీ రెండవది తెనుగున గల గొప్ప ప్రబంధములతో సరియని చెప్పుట నిజము చెప్పుట యగును." "ఈ గ్రంథము కనుపర్తి యబ్బయామాత్యునికి పూర్వము వ్రాయబడి యుండి, యబ్బయామాత్యుని 'యనిరుద్ధ చరిత్ర'కంటె సర్వవిధముల మేలని చెప్పుటకు తగినదై యున్నది."

మన్నారుదాసవిలాస నాటక మప్పటి యక్షగాన రచనలలో ప్రసిద్ధికెక్కినది. యక్షగాన ప్రకరణమున నీ నాటక విషయము విచారింతము.

తంజావూరు సంస్థానాశ్రితుఁడు గాకపోయినను విజయరాఘవునకు సమకాలికుఁడగుటచేత సవరము చిననారాయణరాజును ఇచట ప్రస్తావించుట యుచితము. ఇతఁడు చెంజిరాజకుటుంబమునకు సంబంధించినవాఁడు గావచ్చునని ఇంతకుపూర్వ మూహించితిని. చిననారాయణకవి కువలయాశ్వచరిత్ర మను రసవత్తమ కావ్యమును రచియించి తన పెంపుడు తండ్రియైన నారాయణ భూపాలున కంకిత మిచ్చెను. ఇతఁడు మహాకవి. నాయకయుగంపు పింగళి సూరన్న యని చెప్పవచ్చును. కొన్ని విషయములం దితఁడు సూరన్నను మించిన ట్లగపడును. ప్రతిభాతిశయమునను గల్పనా సామర్థ్యమునను వీ రిరు పురును సమానులే యైనను చిననారాయణరాజు కవిత్వమందలి శిల్ప పరిపక్వమును, ప్రసన్నత్వమును, నిగ్గును సూరనార్యునందు గానరావు. సంస్కృత పాండిత్యము గలవాఁడైనను, సంస్కృత పదములను సమాసములను గుప్పింపక దాక్షిణాత్యాంధ్రకవులకు సామాన్యమైన తియ్యని తేట తెనుఁగుమాటలను గూర్చి హృద్యమైన పద్యములతో నెల్లవారికి సులభగ్రాహ్యముగ గ్రంథమును రచించినాడు. చేమకూరవాని భావగాంభీర్యమును చమత్కార నైపుణియు నితని కతీతములే; కాని పద గుంఫనయందును వర్ణనాకౌశల్యమునను నతనికి సమానుఁడని చెప్పవచ్చును. ఇతని కవిత్వ విశేషమును గూర్చి వ్రాయవలసిన దెంతేనియు గలదు; కాని సమయము చాలదు.

విజయరాఘవునితో దంజావూరు నాయకరాజ్యము సమసిపోయినది. మొదట నది మధుర నాయకులకు గైవసమాయెను; కాని యటుపిమ్మట స్వల్ప కాలముననే శహాజీ పుత్రుఁడు ఏకోజీ వారిని జయించి మహారాష్ట్ర ప్రభుత్వమును నెలకొల్పెను. అంతట ఆంధ్రుల యధికార మచట మాసిపోయి

నది; కాని యాంధ్రభారతి మునుపటికంటె నధికతరముగ బ్రవర్ధిల్లినది. ఇందుకు గారణ మేమన మహారాష్ట్రు లాంధ్రులను జయించి తమ ప్రభుత్వము స్థాపించినను, ఆంధ్రులచే వారును బరాజితులైరి. మహారాష్ట్రుల విజయము రాజకీయము, ఆంధ్రవిజయము సాంస్కృతికము. తంజావూ రాంధ్ర నాయక ప్రభుత్వము ఫలరహితమైపోలేదు. వారి నాశ్రయించుకొని యుండిన తెనుగు ప్రజ యందె స్థిరముగ నిలచిపోయినది. ఆనా డాంధ్రముద్రలేక నాగరికత కు జెలామణి లేకపోయినది; ఆంధ్రుల జీవిత ప్రకార మందఱకు మేలుబంతి యైనది. విజ్ఞానమునకు వారు పెట్టినదే భిక్షు; కళాకౌశలమున వారిదే మీఁది చేయి; ఆంధ్ర భాషా పరిచయము రసికతకు ముఖ్య చిహ్నము; ఆంధ్ర కవిత నొసటి మాణిక్యము. కావున మహారాష్ట్రరాజులందఱు దెనుఁగు నభ్యసించిరి. సభయందు దెనుఁగు మాటాడిరి; తెనుఁగు విద్వాంసులను గవులను గాంధర్వవిద్యావిశారదులను గాయనగాయనీ జనులను జేరదీసి నాయక రాజులవలె నాశ్రయ మొసఁగిరి. మహారాష్ట్రరాజు లాంధ్రమున గవన మల్లుటకు నేర్చి కావ్యములను నాటకములను రచించిరి. కాని పద్య ప్రబంధ రచన సన్నగిలెను. ద్విపద కావ్యములును, యక్షగానములును దామర తంపరగ నభివృద్ధి నందెను. వీనిగూర్చి ప్రకరణాంతమున విచారింతము.

## కామేశ్వరకవి

విజయరాఘవుని యనంతరము, మధుర పుదుకోట సంస్థానములు ప్రబంధరచన కిరవులాయెను. మధుర సంస్థానమునం దాంధ్ర సారస్వతమును నెలకొల్పిన వాఁడు ముద్దళగరి. ఇతఁడు తిరుమల నాయకుని మనుమఁడు, క్రీ. శ. ౧౬౫౯ మొదలు ౧౬౮౨ వఱకు మధుర రాజ్యమును పాలించిన చొక్కనాథ నాయకుని సవతి తమ్ముఁడు * క్రీ. శ. ౧౬౭౩ వ సంవత్స

* సత్యనాథ అయ్యరుగారు అళగరి చొక్కనాథునికి పాలిచ్చి పెంచిన దాది కొడుకని వ్రాసిరి. (*History of the Nayaks of Madura,*

రమున చొక్కనాథ నాయకుఁడు విజయరాఘవుని వధించి తంజావూరి రాజ్యమును స్వాధీనపఱచుకొనిన పిమ్మట ముద్దళగిరిని దానికి పాలకునిగ నియమించెను. అచట నళగిరి కొంతకాలము నివసించి యీ రాజ్యముపై నెత్తి వచ్చిన మహారాష్ట్రులతో నొకటి రెండు పర్యాయములు పోరవలసి వచ్చెను. తంజాపురమున నున్నప్పుడె యతని కాంధ్రభారతి ప్రసన్న మాయెను. ఇతని పేర మూడు కృతులు వెలయుచున్నవి. మొదట జెప్పదగినది 'పెద్దళ్గరి విజయము'. ఇది మహారాష్ట్ర యేకోజీపై నీతడు పడసిన విజయమును వర్ణించు ౧౩౦ చరణములుగల యుత్పలమాలిక. తంజావూరుకోట నాలుగు దిక్కులయందును జెక్కబడి యున్నది. అప్రకటితము. ఇంతకంటె దీనిని గూర్చి చెప్పుటకు వలను పడదు. రెండవది లింగనమఖి కామేశ్వరకవికృత సత్యభామాసాంత్వనము. కామేశ్వరకవికి తిరుకామ కవి యని నామాంతరము గలదు.

---

*p. 165)* . అతఁడు చొక్కనాథుని "దూదు భాయి" అని తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర యందు కలదు. కాని సమకాలిక రచన యగు సత్యభామా సాంత్వనమున, "మేదినీవరుముద్దుతిరుమలవీరధరాధినాథుఁడు మీనాక్షమాంబ యందు చొక్కనాథావనీపాలు లింగాంబికయందు ముద్దళఘరీంద్రు" గాంచె నని యున్నది (పుట. 41). శ్రీ వేటూరు ప్రభాకరశాస్త్రుల వారేలనో ముద్దళగిరిపై గసులెజ్జి జేసినారు. "ఇతఁడు బింకాలమారి. పొగడితే పొంగి పోయేవాడు. తంజావూరి కోట నాలుగు తట్టులనూ యేకోజీని నాలుగు రోజులలో తాను వోడించినట్టు 'పెద్దళ్గరి విజయము' అని గ్రంథం చెప్పించుకొన్నాడు. నాలుగు దిక్కులకూ నాలుగు ఉత్పలమాలలు పెద్దవి. మొత్తం చరణాలు ౧౩౦ ఉంటవి. గ్రంథం పెరిగి పోతుంది. కొంచెంకూడా ఉదహరించలేను.' అని వక్కాణించినారు—(పుట ౪౬. అ. జ్ఞా.) కొంచెము శాంతమనస్కులై విచారించి యుండిన శాస్త్రులవారింత తీవ్రముగ నళగిరిని నిరసించియుండరు. ముద్దళ్గరి పై శాసనమును వ్రాయించిన దెప్పుడు? అను నది ప్రథమమున వితర్కింపఁ దగిన విషయము. ఏకోజీ తంజావూరికోటను

"అనువుగ రుక్మిణీ పరిణయంబును
మున్ పావణించి యాచార్యులా
ననఁదనియించినావు మము
నప్రతిమంబుగ నవ్యకావ్యమిం
పునరచియింపుమీ సొగను
పోడిమి మీఱఁగ సత్యభామసాం
త్వనమున గప్పురంపు చలువన్
గెలువన్ దిరుకామసత్కవీ."

యని కృతిపతి తన్ను సంబోధించినట్లు చెప్పుకొన్నాడు. ఈ యంశమే యీతని వచన భేరు మాహాత్మ్యములోని కడపటి పద్యమువలన విదిత మగుచున్నది.

---

స్వాధీనపఱచుకొనినవిమ్మటనై యుండదుగదా. తత్పూర్వమై యుండవలయును. అగు నేని యేకోజీతో యుద్ధము పొసగక ముందే అతని నాలుగు దినములలో నోడించినాడనని కల్పనాకథనుగట్టి శాసనమున నీ యబద్ధ విజయమును ప్రకటించుకొనిరైన నుండవలయును; లేదేని, తంజావూరిని ఏకోజీ సాధించుటకు పూర్వమొకసారి యెత్తివచ్చి యళగిరిచే బరాజితుఁడై మరలి పోయిరైన నుండవలయును. రెండవ పక్షమే సత్యమని నా విశ్వాసము. ఇది యెట్లుండినను సుప్రసిద్ధ వాఙ్మయ విమర్శకులని పేరందిన శాస్త్రిలవారు ఆ యుత్పలమాలలను వ్రాసి ప్రకటింపకపోవుట యత్యంతశోచనీయము. ఉత్పలమాలలను రచించిన వారెవ్వరు? రచనా కాల మెప్పుడు? అందలి వృత్తాంత మెట్టిది? కవిత్వమేపాటిది? అను ప్రశ్నలు భాషాభిమానుల హృదయముల మొలకలెత్తును. పెద్దళగిరివిజయము చారిత్రకముగను వాఙ్మయ దృష్టి యందును ముఖ్యమైనది. భాషాభిమానులెవ్వరైనను దీని ప్రతిని వ్రాయించి ప్రచురింతురుగాక!

"వివిధకళాకలాపఖని వేంగన
లింగమఖేంద్రునాగన
త్కవి తిరుకామ కోవిద
శిఖామణి ధీయుతుఁ బాకవైరిలో
కవికచకల్పక స్తబక గంధ
ధురంధర సూక్తి యుక్తి నా
నవునని మెచ్చనావుల
మహాత్మ్యమొనర్చెను తేటమాటలన్."

ఇది చొక్కనాథ నాయకున కంకిత మీయబడెను. తిరుకామకవి మూడు తరముల మధురనాయక రాజుల యాస్థానమందున్నను, చొక్కనాథ నాయకుని రాజ్యకాలముననె గ్రంథరచనకు గడఁగినట్లున్నది. ఇతఁడు హావణించి ముద్దళగిరిని దనియించిన రుక్మిణీపరిణయ కావ్యమిప్పటివఱకు లభ్యముగాలేదు. సత్యభామాసాంత్వనము గంటివారి శృంగార గ్రంథమాలయందు ముద్రితమై ప్రకటింపబడినది. ఇందలి కథ నరకాసురవధ. నాలుగాశ్వాసముల గ్రంథము. మొదటి యాశ్వాసము మధురాపురవర్ణన కృష్ణవర్ణనలతో సమాప్తమగుచున్నది. ఇంద్రాగమనము, నరకాసుర దుష్ప్రవర్తన, నరకాసుర వధోద్యోగము, వసంతోత్సవము, సత్యాకృష్ణుల విహారము, యుద్ధప్రయాణము, సత్యభామ యుద్ధప్రేక్షణాపేక్ష, తన్నివారణము, మొదలగు నంశవర్ణనలతో రెండవ యాశ్వాసము ముగియుచున్నది. స్కంధావారమున కృష్ణుని విరహవేదన, ద్వారకయందు సత్యతాపము, ప్రద్యుమ్నుని ద్వారకా ప్రయాణము, సత్యరాక వీనితో మూడవ యాశ్వాస మంతమందుచున్నది. ఋతువర్ణన, నరకాసురవధ, భగదత్తపట్టాభిషేకము, షోడశసహస్రస్త్రీ వివాహము, సత్యభామకోపము, కృష్ణుడామెకు గోపోపశమనము జేయుటతోఁ బ్రబంధము తుదముట్టుచున్నది.

కామేశ్వర కవి కవిత్వము ప్రౌఢమైనదని యొక్కమాటతో మంచి యోగ్యతాపత్రము నొసఁగినారు వీరేశలింగము పంతులుగారు. శృంగార రసాస్వాదన పరాయణులైన గంటి సూర్యనారాయణ శాస్త్రులవా రానంద మగ్నమానసులై యయ్యను కావ్యమందు నెరసులున్న వని సూచించినారు. "ఈ కవి ఘనాఘనము శ్రీకృష్ణకథావృత్తముతో మేళవింపబడిన శృంగారరసముతో నీ ప్రబంధ సరోవరమును గూలంకషముగ నిండించి కామభక్త కామజనక భక్తులను దనియింపఁ బూనినాఁడు. శృంగార రసప్రియులైన సహృదయు లీ ప్రబంధ సరోవరములో నవగాహ మాచరించి యమందానందమున నోలలాడుదురుగాక!...కవి యుభయభాషా పాండిత్యము గలవాడయ్యును రసాభినివిష్టుఁడగుటచేఁ గాబోలును పలుచోట్ల ఆంధ్రవ్యాకరణ మర్యాదలను లక్షింపలేదు. కవిత్వము మృదుమధురశైలి గలిగి ద్రాక్షాపాకమునఁ బడినది." విజ్ఞుల యభిప్రాయము శిరసావహింపదగినదే. కాని యీ కామేశ్వర కవి శృంగార రసావిష్టుడై యౌచిత్యమును వీటిఁబుచ్చినాడు. ఈ నరకాసుర వధను ఎఱ్ఱన సోమన పోతన మున్నగు మహాకవులెందరో వర్ణించినారు. శ్రీకృష్ణు నింతటి బైసిమాలిన వ్యక్తిగ మఱే యెవ్వరును బ్రదర్శించి యుండలేదు. సామాన్యుఁడా శ్రీకృష్ణుడు? ధర్మసంస్థాపనకై పుడమిపై నవతరించిన భగవంతుడు. ఇంద్రాది దేవతల యాపదల నాపగల శక్తిప్రభావ సంపన్నుడు. అట్టివాని నిచట కేవల స్త్రీలోలునిజేసి రతిరహస్యములను అతని ముఖాంతరమునుండి వెడలగ్రక్కించినాఁడు. కామేశ్వరకవి భావించిన శ్రీకృష్ణుఁడు స్త్రీలోలుడు, విషయాసక్తుఁడు, కాంతావియోగము నొక్క నిముసమైన సహింపజాలఁడు. వలవంతచే భ్రాంతుఁడై యూడిగంబులు చుట్టునున్నారనియైన దలపక యెట్లు వదరుచున్నాడో చూడుఁడు:

"ప్రక్కలో బవళించి పదముపై హవణించి
యచ్చోటు గదియించి హాసుమిడిచి

బిగికౌఁగిలింపఁగఁ గ్రూరమైన బిగియఁ గుందొనరించి
పెదవి కెంపులానించి బెదరణించి
మోవిచ్చి తేలించి ముద్దాడి లాలించి
ముందుగా గదియించి మోహరించి
యలస నీ వలయించి చెలగి నన్నెలయించి
పుంభావ మొనరించి ఖుజ్జగించి

వేగనభిముఖవై తోఁన విముఖవగుచు
భ్రమణ మొనరించి రమణ పరాకటించు
మరపుతోఁ బ్రాలి నీ మేని యొరపులెల్ల
నింక నొకసారి దయసేయవే యొయారి."

ఇట్టి యసభ్య శృంగార వర్ణనాత్మకములైన పద్యములీక యాశ్వాసమునకు మిక్కుటమైనవి గలవు. ఎంతటి ప్రౌఢమైనదైనను ఇట్టి కవిత్వ మేవగింపు బుట్టింపకపోదు. కామేశ్వర కవి ప్రతిభావంతుఁడే కాని, స్వశక్తి కొలఁది రెుఱుఁగక మహాకవులతో దులదూఁగబోయి చదికిలబడినాడు.

నంది తిమ్మనగారి పారిజాతాపహరణములోని

"అందఱిలోనఁ బెద్ద మహి
మాన్విత రుక్మిణి గానఁ బూవు గో
వింధుఁడు దానికిచ్చెఁ దగవే యని
లక్షణ యోర్చె నైఁచెఁ గా
ళింది శమించె భద్ర యవులెమ్మని
యూరడిలెన్ సుదంత లోఁ

గుందుట మానె జాంబవతి
కోపమడంచెను మిత్రవిందయున్."

అను నుత్పలమాలకు బ్రతిగ,

"కోఱకోఱమించె రుక్మిణికి
ఘూర్ణిలె లక్షణ యెంతయేని చు
ఱ్ఱుఱుమనె భద్ర జాంబవతి
కుందెఁ గళిందజగుందెఁ జాల నే
సరుకొని మిత్రవింద నగెఁ
జాలదపించె సుదంత వారిలో
వరయఁగ సత్యతా సరసురాలగుటన్
మది గిన్క మాటుచున్.

అను చంపకమాలను,

పతి ప్రాణ సదృశ బంధువు
పతి దైవం బేడుగడయుఁ బ్రతిసతులకు న
ప్పతియె కడు మేలు దప్పిన
గతి కులకాంతలకు వేఱు కలదే చెపుమా.

అను కందమునకు బ్రతిగ,

మగఁడే దైవమటంచును
మగువలు మతి నమ్మియుండు మమత కలదు గా
మగఁడెడసి చౌక చేసిన
మగువకు గాదన దరంబె మదవతులారా.

అను ప్రతికందమును వ్రాసినాఁడు.

తిమ్మనగారి పద గుంఫనయు కవిత్వపు జగ్గును నితని పద్యములందు గానరావు. పారిజాతాపహరణముతోఁ బోల్చి చూచిన నితనిది బిగిమానము చాలని కవిత్వమని తోఁచకపోదు.

## గణపవరపు వేంకటకవి

ముద్దళగిరి పేర రచింపబడిన మూడవకృతి విద్యావతీ దండకము. కామేశ్వరకవియొక్కఁడే కాదు ముద్దళగిరికి కృతియిచ్చి బహూకృతినందినాతఁడు. మహాకవి యని యాకాలమున బేరెత్తిన గణపవరపు వేంకటకవియు ముద్దళగిరి పేర కృతిజెప్పి యతనిచే మన్నన బడసినవాఁడే.* ఇతఁ డనేక గ్రంథము

* చిరకాము నుండియు వేంకటపతి కవియొక్క వాస్తవకాలము దెలియక వాఙ్మయ విమర్శకులును జరిత్రకారులును దిక్కులుపడుచు పలువిధ ముల నూహించు చుండిరి. ప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసమును బరిష్కరించి తమ యముద్రితగ్రంథచింతామణియందు బ్రకటించిన పూండ్ల రామకృష్ణయ్యగారు, "ఈ గ్రంథకర్త ఆధునాతన కవివర్గములోని వాఁడు. శ్రీకృష్ణరాయల సభాసదులగు ముక్కు తిమ్మనాదులను దా నవతారిక యందలి 38 వ పద్యమున నుదహరించిన కారణముచే నితను శ్రీకృష్ణరాయ లకు నీవలివాఁడగుటకు సందియము లేదు. అనేక గ్రంథ శోధకుండగు కాక నూర్యప్ప కవి వర్యుండు తన లక్షణ గ్రంథమగు "అప్పకవీయమున" నిట్టి గ్రంథమునుగూర్చి యెచ్చట నుదహరించనందున నితను అప్పకవికిని యీవలి వాఁడని యూహ కట్టుట కవకాశమిచ్చుచున్నది." కందుకూరు వీరేశలింగము పంతులవారుకూడ నిట్టి యభిప్రాయమునె వెలిపుచ్చియున్నారు. "పదునాఱవ శతాబ్దాంతమందున్న పింగళి సూరనార్యుని, (రామరాజ) భూషణుని బేర్కొనుటచేత నీతఁడు పదునేడవ శతాబ్దమునకు లోపలివాఁడు కాఁడనుటకు సందేహములేదు. మఱియొకచోట 'లక్షణసారసంగ్రహసరస్వతీవిలాస

లను రచించెను. తారావళి, యమశతకము, శృంగారరసమంజరి, కృష్ణమల్లకథ చతుర్భద్ర, బాలరామాయణ ద్విపద, లింగాను శాసనము, తెనుగు ప్రతాపరుద్రీయము, తెనుఁగు రసమంజరి, అభినవాంధ్ర నిఘంటువు— ఇదే వెంకటేశాంధ్రము — ఆంధ్రకౌముది, గణయతిప్రాసలక్షణసీసమాలిక, ఆంధ్ర ప్రయోగ రత్నాకరము, రేఫ అకార నిర్ణయపద్ధతి, షట్ప్రిత్యయముల ప్రస్తార సరణి, ఇర్వదాఱు ఛందముల వచనము, అలంకార సారము, పరమ భాగవత చరిత్రము, ఆంధ్ర ద్విరూపకోశము, కల్పిత కల్పలత, తెలుఁగు వసంతతిలక భాణము, కఠినప్రాస శతకము, ఆంధ్ర పక్రియా

---

సాహిత్యచింతామణి సత్కవిజనసంజీవని' యని లక్షణసారసంగ్రహమును, కవిసంజీవనిని చేర్కొనియున్నాడు. ఇందలి లక్షణసారసంగ్రహము చిత్రకవి పెద్దన్న రచియించినదైన పక్షమునఁ గవి పదునేడవ శతాబ్దారంభమునకు దరువాతి వాఁడును, కూచిమంచి తిమ్మకవి రచియించినదయిన పక్షమున బదునెనిమిదవ శతాబ్దమధ్యమునకు దరువాతివాఁడును అగును." ఇటీవల శ్రీ త్తపల్లి సూర్యారావుగారు, "కర్ణాట తుండీర చోళ పాండ్యమండల ప్రముఖాఖిల మండలాఖండల దత్తమత్త సింధుర...రత్నాంబరాదివస్తు... నిఖిలశుభలక్షణ లక్షణకవి వేంకటపతికవి" యని వ్రాసికొన్న దానింబట్టి చూడఁగా బాండ్య మండల ప్రభువులలో నాంధ్ర కవుల నాదరించుటచే ప్రశస్తి కెక్కిన 'మండలేశ, పాండ్య భూవిభు' మొదలుగా గల విశేషములచే వ్యవహరింపఁ బడినవాఁడు విజయరంగచొక్కనాథభూపాలుఁడే యని పెక్కండ్రు దాక్షిణాత్య కవుల వ్రాతల వలన విశ్వసింపఁదగియుండుటచే నిక్కవి యతని కాలమందే యనఁగా క్రీ. శ. ౧౮ వ శతాబ్దము మొదట నుండినవాఁడై కూచిమంచి తిమ్మకవికి సమకాలికుఁడై యుండునని తోఁచును" అని తీర్మానించిరి. ఇంచుక చారిత్రదృష్టితో జూచి యుండిన వీరిట్టి తీర్మానమును జేసియుండరు. కర్ణాట తుండీర చోళ పాండ్యమండల మండలాధీశ్వరులచే సత్కారములను బొందినట్టుగదా వ్రాసికొన్నాడు వేంకటపతి కవి. పాండ్య మండలాధీశు నొక్కనినే దృష్టి యందుంచుకొని

కౌముది, జాంబవతీ విలాస చిత్రకావ్యము, చండవిద్యావతీదండకము, చక్రవాళ తారావళి, పురాణసారము అను గ్రంథములను రచించియు దనివి నందక ప్రబంధరాజవేంకటేశ్వరవిజయమును రచించెనటు. సర్వ లక్షణ శిరోమణియను మహాకావ్యమును, మఱియొక లక్షణ గ్రంథమును గూడ వేంకటేశాంకితముగ వ్రాసెను. వేంకటపతిని కవియని పేర్కొనుట కంటె శాస్త్రకర్తయనుట యుక్తము. పద్యములను ఛందోవ్యాకరణాది దోషములు లేక వ్రాసినంతటనె కవితా ప్రతిభ లేనివాడు కవి కాజాలడు. వేంకటపతి వ్రాసిన

---

కవి కాలనిర్ణయము సేయబూననేల? తక్కిన కర్ణాట తుండీర చోళ మండలాధిపుల మాటయేమి? కర్ణాట రాజ్యమును క్రీ. శ. ౧౬౪౮ సం. నను తుండీర మండలమును మరుసటి యేటను మహమ్మదీయులు జయించి స్వాధీనము జేసికొనిరి. క్రీ. శ. ౧౬౭౩ వ సం. న మధుర నాయకరాజులు తంజావూరి విజయరాఘవుని జంపి చోళమండలము నాక్రమించుకొనిరి; కాని యనంతర మల్పకాలముననె యందు నెలకొన్న మహారాష్ట్రులుగూడ తాము చోళమండలాధిపతులమని చెప్పుకొనుట వలనను వారును నాంధ్ర కవి జనపోషకు లగుట వలనను వేంకటపతి చేసిన చోళ మండలేశ్వర ప్రస్తావము అతని కాలనిర్ణయమున కంతగ దోడ్పడదు. కాని కర్ణాట తుండీరములు రెంటియందును హిందూరాజ్యము క్రీ. శ. ౧౬౪౮-౯ లో సమాప్తినందినది. తరువాత నవి విజాపుర సుల్తానుల యేలుబడిక్రిందికి వచ్చినవి. కావున గణపవరపు వేంకటపతికవి కర్ణాట తుండీర మండలేశ్వరులచే సత్కారము బడసినది ౧౬౪౮-౯ కు ముందై యుండవలయును. అగునేని యతఁడు ౧౭ వ శతాబ్ద మధ్య కాలమున వెలసియుండునని మన మూహింపవచ్చును. ఇదియు యతని సరియైన కాలమని నిర్ధారణసేయ గల సాక్ష్యము గలదు. ప్రబంధ రాజ వేంకటేశ్వర విజయవిలాసమునందు వేంకటపతికవి తాను 'చండ విద్యావతీ దండకరాజమును రసము హెచ్చుగ నొనర్చితి' నని చెప్పి యున్నాడు. ఈ విద్యావతీ దండకప్రతి యొక్కటి చెన్నపురి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమందున్నది. అందు,

గ్రంథములలో నే యల్పసంఖ్యాకములో తప్ప తక్కినవన్నియు ఛందోవ్యాకరణాలంకార శాస్త్రములకు సంబంధించినవే. శాస్త్ర విచారమునందు కవితా ప్రదీపనమునకు గాని భావ విలసనమునకుగాని యవకాశ మధికముగ నుండదు.

ఆంధ్ర కౌముదిలోని కవిత్వము జూడుఁడు :

అచ్చ తెనుంగున నప్రాణి వాచకో
దంతములపయి సప్తమికి మఱి త్ర
తీయకు నగ్ వచ్చుఁ దెలియఁ నాదేశమై
కొమ్మునన్నిల్చెఁ గొంగుననువిసరె
ననగ నిట్టుల నుదాహరణంబులగు మఱి
యప్రాణి వాచకోదంతములవె
కన్ను వెన్నను జన్ను మిన్నను నుడులకు
గంటవెంటను జంటమింటననఁగ.

---

శ్రీ విశ్వనాథాన్వయాంభోధిచంద్రుండు... సత్యాశ్యపాభిఖ్యగోత్రుండు భాస్వచ్చరిత్రుండు శ్రీ తిర్మలోర్వీతలాధీశ పౌత్రుండు వీరాపనీపాలపుత్రుండు, వీరాదివీరస్తుతోద్దారదోస్సారవచ్చొక్కనాథక్షితీశాగ్రణీసోదరుం డాశ్రితత్రాణ బద్ధాదరుం డర్భకన్యాసమానోల్లసల్లింగమాంబావధూగర్భశుక్తిస్ఫురన్మౌక్తికా కారుఁడై యొప్పు ముద్దళ్ళరిక్షోణిపాలుండు... బాహ్యతులోర్వి పరిక్రీడలన్ మన్మథా భోగసామ్రాజ్య భోగంబులన్ దేలి చొక్కాటపుం గుందనంబందు రాణించు మాణిక్యమున్నట్లు శ్రీ మించి 'వర్ధిల్లుచున్నా'డనియు, 'శ్రీ ముద్దళ్ళరిక్ష్మాతలాధీశు పేరన్ వృషాద్రీశ సంకాశు పేరన్ మహాలక్షణగ్రంథ భాషాభిదాన ప్రథామాధురీసాధురీత్యర్థవచ్ఛబ్దబంధానుబంధ ప్రబంధాదినాథాప్పయామాత్య రాడ్వేంకటార్య ప్రణీతంబుగా బొల్చు నాపుష్ప కోదండకంబైన విద్యావతీ దండకం బుర్వి నాచంద్ర తారార్కమై యొప్పెడున్" అని యున్నది.

జను ద్వితీయను బంచమిని సప్తమిని నొక్క-
రూపమగా లక్ష్యముల్ రూఢి వినుఁడు
చెలికంటఁజూచెను చెలికంట బొడమెను
నిది కంటగాటుక నిడిరొయెనఁగ
వెలయుచునుండు నావల మఱి యప్రాణి
వాచకాదంతశబ్దముల పంయినె

ఇత్యాది. ఇది వేయిచరణముల సీసమాలిక, గ్రంథమందంతటను కవిత్వమిట్లె యుండును. మఱియు నీ యాంధ్రకౌముది ప్రత్యేక గ్రంథము గాదు. మొదట ప్రత్యేక గ్రంథముగ వ్రాసినను వేంకటకవి దీనిని ఇట్టివానినే మఱికొన్నిటిని సర్వలక్షణశిరోమణియం దుల్లాసములుగ జేర్చి గొప్ప లక్షణ

---

ఇందువలన గణపవరపు వేంకటపతికవి చొక్కనాథుని తమ్ముఁడైన ముద్దళగిరికి సమకాలికుఁ డని స్థిరపడుచున్నది. ముద్దళగిరి తన యన్నపక్షమున క్రీ. శ. ౧౬౭౩ సం. న తంజావూరిని పాలించియున్నాఁడు గదా. కావున వెంకటపతియు నప్పటివాడగుట నిస్సంశయము. మఱియుఁ దుండీర ప్రభువులలో నెల్ల గడపటి వాడగు వరదప్ప నాయకుఁడు విద్యాప్రియుఁడై కవుల కాశ్రయ మొసంగినవాఁడు. కర్ణాటక ప్రభువులలో గడపటివాడైన ముమ్మడి శ్రీరంగరాయలకు విద్యావిషయములం దభిరుచి యున్నట్లు కన్పట్టదు. మఱియు నితఁడు కవుల కాశ్రయమిచ్చి పోషించినట్లును తోచదు; కాని యితనికి పెదతండ్రియైన పెదవేంకటపతిదేవమహారాయలు (౧౬౩౦-౧౬౪౨) కవులకాశ్రయమిచ్చి పోషించుటయే కాక తనపేర గృతుల జెప్పించుకొనెను. కావున గణపవరపు వెంకటకవిని సన్మానించిన కర్ణాట తుండీరప్రభువులు పెదవేంకటపతిదేవమహారాయలును చెంజి వరదప్ప నాయకుఁడునై యుందురు. అగుచేని యతఁడు క్రీ. శ. ౧౬౨౦ మొదలు ౧౬౬౦ వఱకును వర్ధిల్లెనని చెప్పవచ్చును.

గ్రంథమును బ్రకటించెను. ఆంధ్రకౌముది సర్వలక్షణశిరోమణిలోని తృతీయోల్లాసము. వేంకటేశాంధ్రమను నామాంతరము గల యభినవాంధ్రనిఘంటువు ఇందులోని ద్వితీయోల్లాసము; గణయతిప్రాసనీసమాలిక ఇందు ప్రథమోల్లాసములోని యొక ప్రకరణము. నిఖిల రేఫ ఱకార నిర్ణయపద్ధతి పంచమోల్లాస ప్రారంభమున గలదు. షట్ప్రత్యయప్రస్తారసరణియు, నిర్వదాఱు ఛందములకు వచనంబును చతుర్థోల్లాస భాగములు. ఆంధ్ర ద్విరూపకోశము దశమోల్లాసము. కావున సర్వలక్షణశిరోమణి పదియుల్లాసములకు దక్కువ కాని లక్షణ గ్రంథము. ఇదియొక యద్వితీయమైన లక్షణ గ్రంథమనుటకు సందియములేదు. ఆంధ్రకౌముదిని పఠించినవారికది యెంతటి యమూల్యమైనదో విదితము కాగలదు. గ్రంథము సంపూర్ణముగ లభింపక పోవుట యాంధ్రుల దురదృష్ట మనుకొనవలయును. కాని యెట్టియుత్తమలక్షణ గ్రంథమైనను, వేంకటపతి కవిత్వాతిశయమును నిర్ధారించుట కది సహకారి కాజాలదు. అతని కవిత్వమహాత్మ్యమును దెలుప గలవి కృష్ణమల్ల కథ, బాల రామాయణ ద్విపద, పరమ భాగవతచరిత్ర, జాంబవతీవిలాస చిత్రకావ్యము, పురాణసారమను కావ్యము ఉపలబ్ధములు గాలేదు. లభించిన గ్రంథములలో నితని ప్రబంధరాజవేంకటేశ్వర విజయవిలాసము గొప్పది. అదియు నమూల్యమైన లక్షణగ్రంథమే కాని, తన్మూలమున నతని కవితాశక్తిని కొంతవఱకు గనుగొనవచ్చును. అతఁడు మహాసమర్థుఁడని యరమర లేక పల్కవచ్చును. అతని పాండిత్య మద్వితీయము, శాస్త్రపరిచయమును లోకజ్ఞానమును అసాధారణమైనవి. ఛందోవ్యాకరణాది శాస్త్ర విచారమున గొంత యొగుడు దిగుడు గానవచ్చుచున్నను శైలి మొత్తముమీద సాఫైనదే. పదముల కూర్పునను గర్భ చిత్రకవిత్వరచనలయం దితని జేర్పు మఱి యొవ్వరికిని లేదు. ఈ విషయమును ప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసపీఠికయందు జక్కఁగ బరిశోధించి యాంధ్రవాఙ్మయవిమర్శకపితామహులనఁదగిన

పూండ్ల రామకృష్ణయ్యగారి ట్లు వ్రాసియున్నారు. "ఇందుదహరింపఁబడిన గర్భ కవిత్వ చిత్రకవిత్వ బంధకవిత్వములలో ౧౦౦ వ, సీసపద్యమును బోలిన పద్యమిదివఱకు నాంధ్ర గ్రంథములలో నెచ్చటను వ్రాయబడి యుండలేదు. ఈ పద్యమునందు గర్భితములన్నియు నఱువదికిం బయిగా నున్నయవి. ఈ యఱువది గర్భితములును రకారప్రాస ఘటితములై యున్నయవి. ఇందు కందములు, తేటగీతలు, ఆటవెలఁదులు, శోభానమంగాళారతులు, శ్లోకములు, చౌపదులు, వృత్తములు, అష్టకములు, ధవళములు, అర్ధచంద్రికలు, ఉత్కళికలు, రగడలు, దరువులు, ఉభయభాషాకందములు లోనగు గర్భితములు వ్రాయఁబడియున్నవి. ఇంతియగాక యీ సీసతేటగీతి యంతయు సర్వలఘువులతో గూర్పబడి యున్నది. వెండియు నీ సీసములోనుంచి వింశతి బంధ కందము కూడా వ్రాయఁబడి యున్నది... ఇట్టిపద్య మిదివఱకుఁ దెలుఁగుఁ గబ్బములలో నెవ్వరును వ్రాసియుండలేదు." బళి! బళి! యని మెచ్చ దగదా యిట్టి యనన్య సామాన్య రచనాకౌశల్యమును. కాని ఇది యంతయు శతసహస్రావధాన కౌశల్యమువంటిది కాని యుత్తమజాతి కవిత్వము కానేరదు.

విజయరంగ చొక్కనాథుఁడు భాషాపోషణ మొనరించిన మధుర నాయకరాజులలో నగ్రగణ్యుఁడని ముందు చెప్పియున్నాఁడను. ఈతఁడు విద్వాంసుఁడు. కవుల కాశ్రయ మొసగి కావ్యరచనకు బ్రోత్సహించుటయే కాక స్వయముగ గ్రంథముల రచియించెను. మనకు దెలియవచ్చినంతవఱకు నితని సంస్థానమునందు సముఖము వేంకటకృష్ణప్పనాయకుఁడు. శేషము వేంకటపతి, కుందుర్తి వేంకటాచలపతి, వెలగపూడి కృష్ణయ్య, బద్దెపూడి ఎల్లనృపాలుడు నను కవులేవురును యక్షగానకర్త తిరుమల కవియు వెలసిరి. వీరుగాక సముఖము వేంకటకృష్ణప్పనాయనికి మిత్రుఁడు బుణిగె కృష్ణయ యను కవి మఱియొక డుండెనని యహల్యాసంక్రందన పీఠికలోని "యుభయ

భాషా కవితా విశేషులైన శేషము వేంకటపతి, బుణిగె కృష్ణకవీంద్రుడు సాకాప్తసఖులు గావున" అను వాక్యమువల్ల దెలియుచున్నది. ఇతఁ డేగ్రంథముల రచించెనో తెలియదు. మఱియు దారాశశాంక కృతిపతియు విజయరంగచొక్కనాథనాయకుని మంత్రియు నగు వంగల సీనయామాత్యుఁడు రామానుజచరిత్ర యను గ్రంథమును, మన్నారు రంగాంకిత గేయమును రచించినట్లు,

"ధాత్రి రామానుజ మహాచరిత్ర ఘటన
కలన కువలయ వికసన కళ ధరించి
సీన ఘనకుండు సర్వజ్ఞఁ శేఖరుండు."
"శ్రీమన్నారు రంగాధిప
నామాంకిత గేయకల్పనానుతమలికిఁ
రామానుజ విజయాంక గ
సీమధురసమోద మాన వేంకటపతికిన్."

అను శేషము వేంకటపతి వాక్యములవలన విదితమగుచున్నది. వంగల సీనయ సుప్రసిద్ధ పదకర్త. ఇతని విషయము ప్రకరణాంతరమున విచారింతము.

మఱి యెందఱు కవులును విద్వాంసులును విజయరంగ చొక్కనాథుని యాస్థానము నలంకరించియుండిరో తెలియదు.

## సముఖము వేంకటకృష్ణప్ప

సముఖము వేంకటకృష్ణప్పనాయకుఁడు రచించిన గ్రంథములు జైమిని భారత, రాధికాసాంత్వ, సాహాల్యాసంక్రందనములను మూడు మనకు లభించినవి. ఇందు జైమిని భారతము వచనకావ్యము, రాధికా సాంత్వ సాహాల్యా సంక్రందనములు రెండును పద్యకావ్యములు. రాధికా సాంత్వనము "ఏకా

శ్వాసక్షుద్ర ప్రబంధము" అని వేటూరు ప్రభాకర శాస్త్రిలవారు నిరసించి నారు. శాస్త్రిల వారికిట్టి యభిప్రాయమేల కలిగెనో తెలుపలేదు. శృంగార గ్రంథమగుట వలననేమొ. "కొంత కాలము క్రింద నా తాళపత్ర గ్రంథమును విక్రయించుటకై యొకరు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమునకు గొని వచ్చిరి. దానిని నేను చూచితిని. ముద్దు పళని రాధికాసాంత్వన మం దిందలి పద్యములన్నియు గలవు. మఱికొన్ని పద్యము లెక్కువగా చేర్చఁబడి నాల్గా శ్వాసములుగా ముద్దుపళని గ్రంథము విభక్తమైనట్లు కన్పట్టుచున్నది" అని శాస్త్రిలవారు వ్రాసినారు. దీనినిబట్టి చూడఁగా ముద్దుపళని వేంకటకృష్ణప్ప నాయకుని కావ్యమును దస్కరించి తాను రచియించినట్లు తన పేర ప్రక టించుకొనెనని చెప్పవలసి యున్నది. ఆంధ్ర సాహిత్య పరిషత్పుస్తక భాండాగారమున వేంకటకృష్ణప్ప నాయకుని రాధికాసాంత్వన ప్రతి యొకటి కలదు. విషయ మవశ్యము పరిశోధనీయము.

ప్రభాకర శాస్త్రిలవారు సెలవిచ్చినట్లు వేంకటకృష్ణప్ప నాయని గ్రంథములోని పద్యములన్నియూ ముద్దుపళని రాధికా సాంత్వనమునందుం డుట వాస్తవమేని, హేయశృంగార వర్ణనలతో నిండినదైనను నది రసవంత మైన కావ్యమని యొప్పుకొనక తప్పదు.

"దీని కవిత్వము నాతి కఠినమయి మృదువుగా నుండినందునకు సందే హము లేదు. దీనికి మంచి సంస్కృతాంధ్ర సాహిత్యమును గలదు...అయి నను గ్రంథములోని భాగము లనేకములు స్త్రీలు వినదగినవియుం స్త్రీ నోటి నుండి రాదగినవియు గాక దూష్యములయియున్నవి...స్త్రీ జన స్వాభావిక మైన సిగ్గును బోవిడిచి శృంగారరసమను పేర సంభోగాది వర్ణనములను పుస్త కమునిండ మిక్కిలి బచ్చిగా వర్ణించినది."

అని వీరేశలింగము పంతులవారు ముద్దుపళనిని గూర్చి చెప్పిన మాటలు వేంకటకృష్ణప్ప నాయని గ్రంథమునకు జక్కఁగ జెల్లగలవు. నీతి బాహ్య

తను విస్మరించిన నిందలి కవితా సౌకుమార్యము నెంత కొనియాడినను తనివి తీరదు. విషధరపన్నగశిరస్థితమైనను చారుమాణిక్య ముపేక్షణీయము కాదుగదా.

అహల్యాసంక్రందనము మిక్కిలియు రమణీయమైన శృంగార కావ్యము. వేంకటకృష్ణప్పనాయకుడు రాధికాసాంత్వనమువలె గాక శృంగారరసము నిందు సభ్యముగ పోషించినాడు. శృంగారముతో సందందు హాస్యమును మేళవించి హృదయమున కానందము గొల్పినాడు. శబ్దాలంకార యుక్తమై నిర్ఝరాంభఃపూరమువలె గమనవేగము గలదై, చమత్కారపాటవము గలదై, రసనిష్యందమై విజయవిలాస కువలయాశ్వచరిత్రలను స్మరణకు దెచ్చుచున్నది. వేంకటకృష్ణప్ప నాయకుడు గొన్ని యెడల చిననారాయణరాజు కవిత్వమును మేలుబంతిగ గ్రహించి తత్తుల్యముగ కావ్యమును సంతరింపఁ దలపెట్టినట్లున్నది. ఇట్లెడనెడ నన్యకావ్య ఛాయలు గానవచ్చుచున్నను వేంకటకృష్ణప్ప నాయకుని కవిత స్వతంత్రమైనది. పురాణోక్తమైన ఇంద్రాహల్యల వృత్తాంతమును గొంత మార్చి కల్పనా నైపుణ్యమును జూపినాడు. తియ్యని తేటతెనుఁగు మాటల గవిత్వము రచించి సరివారిలో వాసికెక్కినాడు.

## శేషము వేంకటపతి

ఇతఁడు కృతిపతి తన్ను,

“బిసరుహా మాకరందరస
పేశలకౌశలవన్మృదూక్తులన్
రసికుల కింపుగాఁ గృతి
పరంపరలన్ రచయించి కీర్తిచే
నెసగితివయ్య వేంకటపతీ
బళి! శేషము వంశ సత్కృతీ!”

యని సంబోధించినట్లు చెప్పుకొన్నను తారాశశాంక మొక్కటి దప్ప యన్య కృతులెవ్వియు నితఁడు రచించినట్లు కానరాదు. అది యొక్కటి చాలదా యతని కవిత్వము నాంధ్రభాష యున్నంతకాలమును స్థిరముగ బాదు కొల్పుటకు? తారాశశాంకమును జదివి యానందింపని యాంధ్రు డక్షరజ్ఞు డెవ్వఁడును లేడు, దూషింపని యాధునిక వాఙ్మయ విమర్శకుఁడును లేడు. తారాశశాంక మైదాశ్వాసముల కావ్యము. అందలి యితివృత్తమాంధ్రలోక మునకు సుపరిచితమే. పురాణగాథలలో రంభా నలకూబరుల కథ, యింద్రా హల్యల వృత్తాంతము, తారాశశాంకోదంతము, రాధామాధవాఖ్యానము మున్నగునవి సుప్రసిద్ధములైనవి. ఇందు రంభా నలకూబరుల కథను సవరము చిన నారాయణ రాజు దన కువలయాశ్వచరిత్ర యందును, నింద్రాహల్యల చరిత్రను సముఖము వేంకటకృష్ణప్పనాయకుఁడు దన యహల్యాసంక్రం దనమునందును, రాధామాధవప్రణయగాథ నతఁడే తన రాధికాసాంత్వన మునను, వెలిదిండ్ల వేంకటపతి తన రాధామాధవసంవాదమునను వర్ణించిరి. మిగిలియుండు తారాశశాంకము శేషము వేంకటపతికి దక్కినది. పురాణము లం దెచ్చటనో యడఁగియుండిన, తారాశశాంకుల కథను బయటికీడ్చి తన యసా మాన్య కవిత్వ వైభవము ప్రకటమగునట్లు మనోహర కావ్యమును రచియించి దక్షిణభారత ప్రపంచమంతటికిని ప్రియతమమైన ప్రణయగాథగ జేలామణిలో నికి దెచ్చినాడు. తారా చంద్రుల మోహమును వివరించునపుడు హద్దుమీఱి శృంగారమును పచ్చిగ వర్ణించి గ్రామ్య ధర్మముతో దాని కైక్యము గల్పించి నాఁడు. మఱియుఁ, "దాటాడులోన వ్రాసిరి పరాంగన గూడిన పాపమం" చనియు, "నెన్ని పువ్వుల వ్రాఁదు శేఁటి? యట్లు మగవా డనువానికి దోస మున్న దే?" యనియు దుర్నీతిని బోధించినాడని విమర్శకులితని గర్హించినారు. దుర్నీతిని వర్ణించునపుడే కవి తన యసమ్మతిని దెలుపు వాక్యము ప్రయోగిం పక పోయినాడనియు, అంతు మంచిదని సాధించుటకొఱకు పురాణములనుండి దృష్టాంతముల నుదహరించినాడనియు దెగడినారు. ఈ విమర్శయందు సత్యము

లేకపోలేదు. కాని తారాశశాంకాది శృంగార కావ్యములను విమర్శించునపుడు సమస్త విషయములవలె కవిత్వ స్వభావముగూడ దేశ కాలానుగుణ్యముగ మారుచుండునను నిజమును స్మరణయం దుంచుకొన వలయును. ఒక దేశమువారు మఱియొక దేశము వారికిని యొక కాలము వారింకొక కాలము వారికిని ముక్కుకు సూటిగ వ్రాయజాలరు. ఆధునికాంధ్రు లాంగ్లవిద్యానిష్ణాతులు; వారి యభిరుచులన్నియు సీమనుండి దిగుమతియైనవి; వారి యాదర్శములన్నియు మిషనరీ పాదిరీ దొరల కర్మాగారములలో తయారుచేయబడినవి. కావున ఆధునికదృష్టితో మన పూర్వసాహిత్యమును విమర్శింప జూచుట సరి కాదు. మఱియు నెల్లప్పుడును కవులుగాని యన్యగ్రంథకర్తలు కాని సమకాలికుల మెప్పు నాకాంక్షించియే కృతులను రచియింతురు. చేమకూర వేంకట కవి యంతటి ప్రతిభావంతుఁడు గూడ "ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా" యని వందురినాఁడు. శేషము వేంకటపతి వర్ధిల్లినది నాయకయుగము నందు. నాయకయుగము శృంగార యుగమని చెప్పియున్నాడ. అందును తిరుచినాపల్లియందు విజయరంగచొక్కనాథుని యా స్థానమునందు అది విశృంఖలమై పెల్లుకొన్నది. ఆ సంస్థానమందలి రసిక శిఖామణులు మెచ్చునట్లు కవిత్వము చెప్పజాలని కవికి గణ్యత లేదు. కావున తారాశశాంకమందలి దోషములకు మూలకారణ మప్పటి వాఙ్మయాభిరుచులని చెప్పవలసి యున్నది. మఱియు గావ్య నాటకాదులలోని పాత్రల యభిప్రాయములను దత్కర్తల కంటగట్టి జూచుట న్యాయముగాదు. పాత్ర పోషణకొఱకు కవులును నాటక కర్తలును నాయా పాత్రల స్వభావములకు దగిన మాటలను అభిప్రాయములను వాని ముఖాంతరమునుండి వెడలజేయుదురు. కావున పరాంగన గూడుట పాపముగాదనియు, బురుషునకు దోషము లేదనియుఁ దారచేఁ బలికించి నంతమాత్రమున శేషము వేంకటపతి కట్టి యభిప్రాయములు గలవనియు, దుర్శీలిని బోధించు నుద్దేశముతో నతడామె చే నట్లు పలికించెననియు నెంచుట తప్పు.

ఇది సంభావనీయమైనను గాకపోయినను శేషము వేంకటపతి యసాధారణ ప్రతిభాశాలియైన మహాకవి యనుట నిర్వివాదాంశము. చేమకూర వేంకటకవి యనంతర మింతటి గొప్ప కవి మఱియొకఁడు దాక్షిణాత్యాంధ్రులలో బుట్టలేరు. ఆంధ్రదేశమందలి కవులలో నీతిని కీడుజో డనదగినవారెందఱో లేరు. తియ్యని తేటమాటలును, హాయిగొల్పు భావములును, హారువైన పద్యములును, హృదయంగమమైన శైలియు, అమృతంపు సోనకెనయైన వాగ్ధారయు, యమేయవాక్చాతుర్యమును, నసాధారణకల్పనాశక్తియు నేకమై శేషము వేంకటపతి కవిత్వమై వెలసినది. ఇతని కావ్యమున జవిలేని మాట లేదు, రసవంతముగాని పద్యము లేదు, మనోజ్ఞముగాని భావములేదు. కావుననే నేటి దనుక యాంధ్రలోకమును రంజింపఁ జేయుచున్నది.

## వెలగపూడి కృష్ణయ్య

ఇతఁడు బహు గ్రంథకర్త. మాలతీమాధవము, గౌళికా శాస్త్రమను పద్యకావ్యములను, చతుర్విధకందశతకమును, వేదాంతసారసంగ్రహమను వచనకావ్యమును రచియించినట్లు భానుమద్విజయ పీఠికలో జెప్పియున్నాడు. ఇతని రచనలలో లభ్యమైనది భానుమద్విజయమను నైదాశ్వాసముల ప్రబంధమొక్కటియె. ఇదియైనను ముద్రితముగా లేదు. "ఇతని కవిత్వము రసవంతమైనద"ని వీరేశలింగముపంతులవారి యభిప్రాయము. ఆంధ్రకవుల చరిత్రయందుదాహృతమైన,

"గిరులం బాఱెడి యేఱులట్లుగ
వడింగీల్గొన్న కన్నీరులా
గురువక్షోరుహ తారహార
ములతో గూడం బ్రకాశింప నా

ధరణీశాంగన దుస్సహాత్మగత
సంతాపంబులో నేడ్చె భా
స్వరవాసంతపికీస్వరాకలిత
వాచావైఖరీ మాధురిన్.

అను పద్యమునుబట్టి చూడగా నీతఁడును పెద్దన, తిమ్మన, రామరాజభూషణులమార్గము ననుసరించి యేకొప్ప పద్యమును రచించినట్లున్నది. కాని యితనిది వారి పద్యములతో డీటుగాదు. వెలగపూడి కృష్ణయ్యగారి భానుమద్విజయము గొప్ప ప్రబంధమని కొనియాడదగియున్నది. బ్రౌన్ దొరగారి మెప్పునకు బాత్రమైనది. భానుమంతుఁడను బ్రాహ్మణ యువకుఁడు ఉజ్జయిని రాజపుత్రిక నుద్వాహమాడిన కథ ఇందు వర్ణింపఁబడియున్నది. ఐదాశ్వాసముల గ్రంథము; మిక్కిలియు నుపయుక్తమైన యీ మనోహర కావ్యము శైవమత ప్రబోధకమైనది. శైలిచక్కనిది; కవిత్వము ప్రౌఢమైనది; శ్రీ దక్షిణామూర్తి కంకితమీయబడినది. పంచమాశ్వాసమున బాతంజలయోగ శాస్త్రము జక్కఁగ వివరింపబడినది. శైవమత ప్రతిపాతముగుటచే నేమొ ఇది యరవభాషలోనికి దన్నూలరియుంబెరుమాళను పేర దర్జుమా సేయబడినది.

## కుందుర్తి వెంకటాచలపతి

ఇతఁడు పాండ్యభూనాథుఁడగు విజయరంగ చొక్కనాథుని సభయందు "కథాశుకవి"నని చెప్పుకొనియున్నాఁడు. కథాశుకవి యనఁగా కథల నాశువుగఁ జెప్పువాడని తోచుచున్నది. మఱియు దన కాశ్రయుఁడైన యా ప్రభువు కవిజనకల్పకంబనియు నఖిల కావ్యరసజ్ఞుడనియు నతి ధార్మికుఁడును మహానుభావుడుననియు ప్రశంసించినాడు. ఇది వాస్తవము. తంజావూరి రఘునాథ విజయరాఘవుల యనంతర మింతటి పండితుఁడును, ఉదారుఁడునైన

విద్వత్ప్రభువు మఱియొకడీ యాంధ్ర ప్రపంచమున బుట్టలేదు. వేంకటాచల కవి తాను పెక్కు గ్రంథములను రచించినట్లు తన మిత్ర విందాపరిణయ పీఠికయందు వచించియున్నాడు. భారతభాగవతములను వచనకావ్యములును, బహునాటకములను, చాటుకృతుల ననేకములను జెప్పెనట. ఈ నాటకములు యక్షగానములు గావచ్చును. మిత్రవిందాపరిణయ మొక్కటి దప్ప ఇతని తక్కిన కృతులన్నియు నామమాత్రావశిష్టములై పోయినవి.

మిత్రవిందాపరిణయ మాఱాశ్వాసముల ప్రబంధము. శ్రీ కృష్ణ మిత్రవిందల వివాహమును వర్ణించునది ఇందలి యితివృత్తము. ఈ కవి కాలము దప్పి నాయకయుగమున బుట్టెను. సమకాలిక కవిత్వ లక్షణము లనేకము లితని గ్రంథమున గానరావు. కవిత్వము మంచిదే, కాని జీవ కళ యల్పము. సాంప్రదాయసిద్ధమైన ప్రబంధ లక్షణముల నన్నిటిని తు, చ తప్పక యనుసరించినాడు. పురవర్ణన, చతుర్జాతులవర్ణన, చతురంగబలవర్ణన, పుష్పలావికావర్ణన, రాజ వర్ణన, గ్రీష్మర్తు వర్ణన, వర్షర్తు వర్ణన, శరదృతు వర్ణన, దౌహృద వర్ణన, బాలక్రీడాభివర్ణన, యౌవన వర్ణన, కాసార వర్ణన, వసంత వర్ణన, వనవిహారము, జలక్రీడ, మన్మథపూజ, అస్తమయ వర్ణన, జ్యోత్స్నాభివర్ణన, చంద్రదూషణ, సూర్యోదయ వర్ణన, రణ వర్ణన, రత్నాకర వర్ణన మున్నగునవి యీ గ్రంథమున గానవచ్చు ముఖ్య వర్ణనలు. ఇవి కథయందు సందర్భోచితముగ వచ్చునవి కావు. ఇందలి కథ వర్ణనల ననుసంధింప సంపాదించిన సూత్రము. గతానుగతికుఁడై పూర్వ కవులు చేసిన వర్ణనలనె చర్వితచర్వణముగ జేయు కవికి స్వాతంత్ర్య మెక్కడిది? కల్పనాశక్తియేదది? కాని వూండ్ల రామకృష్ణయ్యగారివంటి రసజ్ఞులు "ఇక్కవిత యక్కజపుఁ గల్పనానల్పచాతుర్యమునంజేసి మనుచరిత్రాదుల కెనయునం దసరు" అని సెలవిచ్చినారు. కటకటా!

## పుదుకోట సాహిత్యము

పుదుకోట ఆంధ్రనాయక రాజ్యము కాదు. పుదుకోట రాజులు శుద్ధ ద్రావిడులు, మరవకళ్లరు జాతులలో నొక జాతికి జెందినవారని చరిత్రకారుల యభిప్రాయము. ఈ శుద్ధ ద్రావిడ ప్రభువుల కాంధ్రభాషపై నభిమానము గల్గుటయు నందు వారు గ్రంథ రచన సేయుటయు వింత. క్రీ. శ. 1682 నుండి 1730 వఱకును పుదుకోట సంస్థానము నేలిన మొదటి రఘునాథుని కాలమునుండియు నాంధ్రభారతి కది తావలమై యుండెనని తోచుచున్నది. ఈతనిపై నాంధ్ర కవులు రచించిన చాటువులు పెక్కు గానవచ్చుచున్నవి. ఇతని తమ్ముని కుమారుడైన రామస్వామినృపాలుని నాయకునిజేసి యుద్దండ విద్వత్కవితాంకుడైన శేషయార్యుడు శృంగారిణీదండకమును రచించెను. మఱియు నీ మొదటి రఘునాథరాజు పుత్రుడైన తిరుమల రాయుడును నతని పుత్రుడగు రాజగోపాలుడును నాంధ్రకవుల నాదరించి వారిచే నుతింపబడిరి. క్రీ. శ. 1730 మొదలు 1769 వఱకు రాజ్యమొనర్చిన విజయరఘునాథుడు సుప్రసిద్ధుడు. ఇతని యాస్థానమున నుదురుపాటి కవులు, ఉద్దండకవి సీతారామార్యుడును నతని పుత్రుడగు వెంకనయు వెలసిరి. వెంకన తాను రచించిన యాంధ్రభాషార్ణవమను నిఘంటువును విజయరఘునాథుని కంకితము గావించెను.

## రాయ రఘునాథతొండమాను

ఈ రఘునాథుని పుత్రుడు, క్రీ. శ. 1769-89ల మధ్య ప్రజాపాలన మొనర్చిన రాయ రఘునాథ తొండమా నాంధ్రకవియై వాసికెక్కెను. ఇతడు తానుద్దండకవి విధేయుడనని చెప్పుకొనియున్నాడు. ఈ యుద్దండకవి నుదురుపాటి వెంకన్న తండ్రియగు "మహోద్దండకవి" బిరుద ప్రశస్తుడైన సీతారామార్యుడే కాని యన్యుడు గాడు. కావున కొచ్చెర్లకోట వెంకట

కృష్ణారావుగా రూహించినట్లు రాయరఘునాథు డీ సీతారామార్యుని శిష్యుడును, నతని పుత్రుడగు వెంకనార్యునికి సమవయస్కుడును సహాధ్యాయుడునై యుండవచ్చును. రాయరఘునాథు డుద్దండకవికి పేరు తెచ్చిన శిష్యుడు. ఇతడు మహావిద్వాంసుడై కవితా ప్రావీణ్యాతిశయముచే వన్నెకెక్కెను. రాయరఘునాథుడు తాను, "వాత్స్యాయనాది వేదవేదాంత పర్యంత నిఖిల తంత్ర నిర్మిత గ్రంథ సకృచ్ఛ్రవణ విదిత మహాకవి ప్రబంధ నూతన తంత్రకరణ సామర్థ్య నిరంకుశ ప్రతిభా విభాసురు"డనని తన వైదుష్యమును ధీ బలమును బ్రకటించుకొన్నాడు. అంతటివా డగునేమో చెప్పజాలముగాని యతడు రచించిన పార్వతీపరిణయమును బట్టి యతని కవితా నైపుణ్య మసాధారణమైనదని చెప్పక తప్పదు.

పార్వతీపరిణయ కృతిని గూర్చిన యైతిహ్య మొకటి గలదు. నుదురుపాటి వెంకన్న ఈ గ్రంథమును రచియించి రాజుపేర బ్రకటించెనని ప్రతీతి. పార్వతీ పరిణయ కవిత్వ మాంధ్రభాషార్ణవము యొక్క కవిత్వము వంటిదే. కాని పార్వతీపరిణయములోని దుష్ప్రయోగముల నాధారపఱచుకొని యది వెంకనార్యుని రచన కాదనియు రాయరఘునాథకృతమే యనియు కొచ్చర్లకోట వేంకటకృష్ణరావుగారు వాదించుచున్నారు. వ్యాకరణ విరుద్ధప్రయోగములనుబట్టి గ్రంథకర్తృత్వమును నిర్ణయించుటకు వీలు కాదు. కృష్ణరావుగారు చూపు దుష్ప్రయోగములన్నియు నాయకయుగవాఙ్మయమున సామాన్యముగ గానవచ్చునవే. వెంకనార్యుఁ డట్టి దుష్ప్రయోగముల జేసియుండఁ డనుట యతని గ్రంథములనన్నిటిని బరిశీలించి నిర్ధారింపవలసిన విషయము. కాని మనకు లభించిన సాక్ష్యము నాధారపఱచుకొని రాయ రఘునాథుఁడు పార్వతీపరిణయకర్త కాదని నిశ్చయించుటకు సాధ్యము గాదు. ప్రస్తుత మది రాయరఘునాథ కృతమనియే యంగీకరించుట యొప్పు.

"ఏది యెట్లున్నను," వేంకట కృష్ణరావుగారు చెప్పినట్లు, "గ్రంథము మాత్రము లోకోత్తరములగు వర్ణనలతో నిండియున్నది." కాని. యందలి కవితామాధుర్యముచే నానందపరవశులై వారు చెప్పిన, "అలంకారికులు చెప్పిన ద్రాక్షేక్షు కదళీ నారికేళాదిపాకము లీ రుచికి సమానమని చెప్ప వలను పడదు. శయ్య యద్భుతమైనది. అనే కాంధ్ర గ్రంథములు పుట్టిన పిమ్మటఁగూడ నిట్టి క్రొత్తకల్పనం జేర్చినవా డీతఁడొక్కడే. కొన్ని తావులను మహాకవి కాళిదాసుని కుమార సంభవములోని శ్లోకముల ననుసరించెను. ఇతనికి దెలిసినంత యౌచిత్య మితరులకు దెలియదనుట సాహసము కాదు" అను విమర్శనా వాక్యములను సంపూర్ణముగ నంగీకరించుటకు వలను పడదు.

పార్వతీపరిణయ కథను ఇతివృత్తముగ కావ్యములను రచించిన ఆంధ్ర కవి వతంసులు కొందఱున్నారు. నన్నెచోడకవి కుమారసంభవమునను, శ్రీనాథుడు హరవిలాసమునను పార్వతీ పరిణయమును వర్ణించి యున్నారు. నన్నెచోడుని భావగాంభీర్యముగాని శ్రీనాథుని కవితావిలాసముగాని రాయ రఘునాథుని కావ్యమున గానరావు. అట్లనుటవలన నతని కవిత్వము సామాన్యమైన దని యెంచరాదు. తేట తెనుఁగు మాటల రసము చిప్పిల్లునట్లు గవిత్వము నమృత ధారాధరము వర్షించునట్లు చెప్పుటయం దతనికి సాటివారు లేరు. ఆంధ్ర కావ్యములలో రాయ రఘునాథుని పార్వతీపరిణయ మత్యున్నత స్థానమున నెలకొనదగి యున్నది.

## నుదురుపాటి వెంకనార్యుడు

రాయ రఘునాథుఁడు కవిజన కామధేనువు. ఇతని యాస్థానమును విద్వత్కవు లనేకు లుండిరి. వీరియందు ముఖ్యుఁడు నుదురుపాటి వెంకన్న. కవిత్వమునం దితఁడు రాయ రఘునాథునికి సమానుఁడు. ఇతని ముద్రిత గ్రంథములలో నొకటి నిఘంటువు, మఱియొకటి రాజవంశ ప్రశస్తి. వీని మూలమున

నతని కవిత్వాతిశయమును వివరించుటకు సాధ్యము కాదు. ఇతని మల్లు పురాణమును రఘునాథీయమును ప్రకటితములగువఱకును సాహిత్యప్రపంచమున నితని స్థానము నిర్ణయించుటకు వీలుపడదు.

## గొనసూరు నారాయణయ్యంగారు

రాయ రఘునాథుని యనంతరము పుదుక్కోట సింహాసనము నలంకరించిన విజయరఘునాథుడును నాంధ్రభాషాభిమానియే; స్వయము గ్రంథకర్త గాకపోయినను గవులను జేరదీసి సత్కరించి గ్రంథరచనకు బురికొల్పెను. నుదురుపాటి వెంకనార్యుని పుత్రుడగు సాంబకవి యితని సమకాలికుడే. ఇతని యాస్థాన కవులలో గొనసూరు నారాయణయ్యంగారగ్రగణ్యుడు. ఇతడు భారద్వాజగోత్రసంభవుడు; అప్పయార్యుని మనుమడు; జియ్య వేంకటమహాచార్యుని పుత్రుడు; వీరరాఘవముని ప్రేంఖత్కృపాధ్యక్షుడు; శఠకోపయోగి కరుణాసంప్రాప్త సారస్వతుడు; మీదు మిక్కిలి విజయరఘునాథునికి గురువు. రఘునాథుని యాదేశముపై భానుమిశ్రుని రసమంజరి యను శృంగార శాస్త్రగ్రంథము నాంధ్రీకరించెను. ఇతనిది సరసమైన కవిత్వము; ధారాళమైనధార; సంస్కృతపదభూయిష్ఠమైనను భాషనాలికతినమై సులభగ్రాహ్యమై మృదుమధురమై యొప్పారుచున్నది. ఇతని యాంధ్ర రసమంజరి గుడిపాటి కోదండకవి యాంధ్రీకరణమువలె నింకను నముద్రితమే. ఇవి ముద్రితమై ప్రచురము లగువఱకును వాని తారతమ్యములను నిర్ణయించుటకు గాని యెంతమట్టు యథామాతృకములో కనుగొనుటకుగాని వీలులేదు. విజయరఘునాథుని తమ్ముడును నతని వెనుక సింహాసనము నధిష్ఠించి క్రీ. శ. 1835 మొదలు 1839 వఱకును పుదుక్కోట నేలిన 'హిజ్ ఎక్సలెన్సీ' బిరుదాంకితుడైన రఘునాథుడును నాంధ్రకవులను బోషించెనని చాటువులవలన విదితమగుచున్నది. ఇతని కుమారుడగు రామచంద్రుడు నుదురుపాటి వెంకన

మనఃమహైన చిదంబర కవిని పోషించి యతనిచే చంద్రానసాదండక మును దనపేర జెప్పించుకొనెను. ఇట్లే డెనిమిది తరములవఱకును పుదుకోట ప్రభువులు ద్రావిడదేశమునం దాంధ్రభాషను బెంపందించి ధన్యాత్ములైరి.

## ద్వి ప ద కా వ్య ము

### పచ్చకప్పూరపు తిరువెంగళకవి

దక్షిణదేశమున ద్విపదకావ్యరచన తంజాపూరు, మధురనాయక రాజ్యముల స్థాపనకాలముకంటె ముందె ప్రారంభమైనది. అచ్యుతరాయల యేలుబడిక్రింద క్రీ. శ. 1530-40 మధ్య మధుర ప్రాంతదేశమును బాలించిన గోళ్ల బసవనాయకుని పుత్రులు పెదరామప్ప చినరామప్ప లాంధ్ర సారస్వతమును ద్రావిడదేశమున నెలకొల్పినవారిలో బ్రథములనియు, వారి ప్రోత్సాహముచే బచ్చకప్పూరపు తిరువేంగళకవి చొక్కనాథచరిత్రను వ్రాసెననియు ముందు చెప్పియున్నాను. చొక్కనాథచరిత్ర ద్రావిడ దేశమున విరచింపబడిన ప్రథమ ద్విపదకావ్యము. తిరువేంగళకవి విద్వత్కుటుంబమునకు జెందినవాడు. విజయనగరసంస్థానమును నితని పెద్దలు వంశ పారంపర్యముగ నాశ్రయించి యుండిరి. "ఈతని తండ్రి తిప్పరాజు, ఈతని తాతయుం జిన్నతాతయు నగు తిమ్మరాజును నయ్యలును కర్ణాటాధీశ్వరుడైన ప్రౌఢరాయలచే సత్కృతులై పచ్చకప్పురము వారని పేరందిరి." ఈ చొక్కనాథ చరిత్రయందు మధురయందు వెంచేసియుండు చొక్కనాథ—సుందరేశ్వర—స్వామి లీలలు వర్ణింపబడినవి. శైలి సరళమైనది; నాతి కఠినమైన భాష. కవిత్వము ధారాశుద్ధి కలిగి చదువుట కింపుగ నుండును. కాని సామాన్యమైనది; మొదటి తరగతి ద్విపద కావ్యములలో జేరదు.

నాయక రాజ్యములు స్థాపింపబడిన పిమ్మట దాక్షిణాత్యకవులు ద్విపదను విస్తారముగ యక్షగానములందు వాడిరి; కాని కేవలము ద్విపద కావ్యములను రచించినవారి సంఖ్య చాల తక్కువ. తంజావూరివారి దృష్టి విశేషముగ పద్యకావ్య యక్షగాన రచనలందు లగ్నమై యుండినవి; మధుర వారు శృంగార ప్రబంధ వచనకావ్య రచనాసక్తులై యుండిరి. కావున ద్విపద కావ్యములం దభిరుచి యాంధ్రదేశమందువలె దక్షిణదేశమునందంత విరివిగ పెరుగలేదు; కాని ద్రావిడదేశమందు ద్విపద కావ్యరచన సంపూర్ణముగ నాగిపోయెనని యనుకొనరాదు.

## రఘునాథుడు

తంజావూరు రఘునాథ నాయకు డచ్యుతాభ్యుదయ నలచరిత్ర లను రెండు ద్విపద కావ్యములను రచియించెను. రఘునాథుడు నలచరిత్ర పీఠిక యందు,

"భూషించి యచ్యుతాభ్యుదయ కావ్యంబు
నిర్మాణమున మాకు నిఖిలదేశముల
నిర్మల సత్కీర్తి నెగడుగావునను
నటువలె ద్విపద కావ్యము వేఱెయొకటి
ఘటియించి సత్కీర్తి గైకొందుననుచు

* * *

కలిదోషహరణము కలితపుణ్యైక
ఫలితమైనది నలోపాఖ్యానమనుచు."

అని నిర్వచించియున్నాడు. ఇందు అచ్యుతాభ్యుదయ మింకను లభ్యముగాలేదు. నలచరిత్ర 1928 సెప్టెంబరు మొదలుకొని 1929 ఏప్రిల్ మాస పర్యంతము కీ. శే.

కావ్యనిధి చెలికాని లచ్చారావుగారిచే స్థాపితమైన యాంధ్రభాషోల్లాసిని యను సారస్వత మాసపత్రికయందు ప్రకటింపబడెను.*

రఘునాథ నాయకుడు అచ్యుతాభ్యుదయ నలచరిత్రలను వ్రాసెనని విజయరాఘవుని రఘునాథ నాయకాభ్యుదయములోని

భువి మెచ్చ నచ్యుతాభ్యుదయ కావ్యంబు
నవరస సహితంబు నల చరిత్రంబు
హరువైన పారిజాతాపహరణంబు
మెఱవడి జూపు వాల్మీకి చరిత్ర
జానకీ కల్యాణ చాటు కావ్యంబు.

అను పంక్తులవలన దెలియవచ్చుచున్నది. ఈ పంక్తులే రఘునాథాభ్యుదయము నందును గానవచ్చుచున్నవి. సంగీతసుధయందును దీని ప్రస్తావము గలదు.

"శ్రీ పారిజాతాహరణ ప్రబంధం
చిత్రంచ వాల్మీకి చరిత్ర కావ్యం
తథాచ్యుతేంద్రాభ్యుదయం గజేంద్ర
మోక్షం చరిత్రంచ నళస్య చిత్రం

---

* ఈ గ్రంథము చిత్రాడ రామవిలాస ముద్రాశాలలో 1921వ సంవత్సరమున ముద్రిత మాయెనని శ్రీ నిడదవోలు వెంకటరావుగారు వ్రాసి యున్నారు! కాని యది సందేహాస్పదము. ఏలనగా, మొదట మాసపత్రిక సంచికలలో గొంచెము కొంచెముగ బ్రకటించి తరువాత గ్రంథము నొక్క సంపుటముజేసి ప్రచురించుట యెల్లయెడలను వాడుకయందుండు పద్ధతి. ఈ పద్ధతినే యాంధ్రభాషోల్లాసినీ పత్రికాధిపతులును నవలంబించిరి. కావున శ్రీ వెంకటరావుగారు వ్రాసినట్లు 1921లో నది బ్రకటింపబడి యుండజాలదు. 1931లో బ్రకటితమయ్యెనేమో.

శ్రీ రుక్మిణీ కృష్ణ వివాహ యక్ష
గానం ప్రబంధా నపి నైక భేదాన్."

ఈ నలచరిత్రము ఎనిమిది యాశ్వాసముల గ్రంథము. శ్రీరామ చంద్రుని కంకితము సేయబడినది. నలదమయంతుల కథ సంపూర్ణముగ నిందు వర్ణింపబడినది. పీఠికయందు కథాంశమును రఘునాథు డిట్లు సూచించి యున్నాడు.

"అరసి యీ కథ తొల్లి వ్యాసమహర్షి
వరుడే యాద్యంతముల్ వ్యక్తంబుగాగ
పలికెను పిమ్మట పల్కంగలేక
యలసులై యేమొ శ్రీ హర్షాదికవులు
పూర్వభాగము జెప్ప బూనిరిగాని
సర్వంబు జెప్పంగ జాలరై రెండు
పూర్వోత్తర కథాంశములు సకలంబు
నిర్వచించెదనంచు నెమ్మది నేని
తలచి యిందుల కిష్ట దైవంబు కరుణ
గలుగంగవలె నంచు గాంక్షింపుచుండ."

నలచరిత్ర పూర్వోత్తర కథాంశములను వర్ణించు ద్విపదకావ్యము చక్రపురి రాఘవాచార్యకృతము మఱియొకటి కలదు; కాని రఘునాథుడు శ్రీహర్షాదు లలసులై పూర్వభాగమునే చెప్పిరిగాని సర్వము జెప్పక విడిచి రనుటవలన నతడు రాఘవాచార్యుని కావ్యము నెఱుగ డనియును, నొకవేళ రాఘవాచార్యుని కృతి రఘునాథుని కర్వాచీనమైనది కావచ్చుననియు దోచుచున్నది. రఘునాథకృత నలచరిత్ర రాఘవాచార్యుల రచనకంటె రసవత్తరమైనది. కవిత్వము వాల్మీకి చరిత్రవంటిదే. పదముల పొంకమును

నుడికారపు బింకమును, వర్ణనా చమత్కారమును, పాత్రపోషణ విధానమును రఘునాథుని కవిత్వమునకు వన్నెయిడుచున్నవి. వాస్తవికత యుప్పెనలార వర్ణనాంశములు కనులకు బొడకట్టునట్లు మాటల చిత్తరువును జిత్రించుట యందు రఘునాథునికి జక్కని నేర్పుకలదు. నలదమయంతుల యరణ్య సంచారవర్ణన నొక యుదాహరణముగ గొనవచ్చును.

కాంతారమున త్రోవ గనియుండు వెంట
కాంతామణియు దాను గంటంబు లెండ
జడిసి యాకుల యట్టు జలమై యాకులత
బుడిసిటఁద్రావి గొబ్బున ప్రేగులెల్ల
నొక్కట వాలికి నొడ్డగిలంగ
గ్రక్కుచు నీరోత గనుకంటె నిచట
గ్రక్కున బోయిన గడు మేలటంచు
పొక్కుచు నాకటు బొదలపై బొదల
యొల యింత నేడైన నలమిడ నమలి
బలిమి మ్రింగుచు గుండె బట్టిన నేల
కులికెలబడి యొక్కొక్కళ్లు చేయూత
గలి గూడుకొన లేచి కదలిపోవుచును
మ్రుక్కపై తోలు వస్తులె చిక్కచాల
చిక్కి చక్కలములై చేరంగరాని
మైలకంపును జన్మమె యింక చాల
చాలుబో యనుపించు చలిబోని చీర
యొంటికట్టుల చేత నొరయుచు రొండి
యంటి చీములు గార నడవులు దూర
కంపలు జీరసై కడు దుమ్ము కేర

చెంపల వెండ్రుకల్ చెమటలు జార
దుర్భరఖేదంబు దొరయ నరణ్యాది
గర్భేశ్వరులు మహాగహన మధ్యమున
నటు నొకచోట బాయక ప్రొద్దుగ్రుంకి
నటువలె నిపుడు గాంఢాంధకారములు
మూఁగ పార్వనికుంభముల ఘూకసమితి
మూఁగ దయ్యములన మూల్గుచునుండ
చుట్టుపట్టులు మానుసులు వచ్చినట్లు
చెట్టులు గనుపింప చేరివీక్షించి
మఱియును మట్టాడ మానిసి లేక
పఱచి తూరుపుబోయ పల్లెలనుండి
కఱచి తెచ్చిన యెముకలు పచ్చితోలు
తఱచుగా పంత గ్రద్దలు క్రిందవైవ
కడుకొని చీకటీగలు చాల ముసరి
పడిలేచి ఝుమ్మని వలగొని తిరుగ
యెడనెడ పెనుపుట్ట సెడలిన చీము
లడరగా వెనువెంట లక్వుటప్పటికి (?)
వచ్చి పంచిలివి పోవంగ నచ్చోట (?)
పుచ్చి పచ్చని తోకపురుగులు వెడలి
లులలుల మనుచు తొల్చుచు నుండ నంటు
బొలసిన గదురు కంపునకు పై దోమ
గమియుప్పతిలి యెల్ల కడలనుగప్ప
జోమ జోమన నెల్లచోటుల చక్క-
పిడుజూలు పురువులు బెట్టి న ట్టట్టు

గడుదురీగలు యీరుగాలి గొట్టులకు
కడకు కొంతటజారి కామించి పూరి
యెడనెడ వ్రేలంగ నెడపక తుమ్మ
దూలముల్ నుసిరాల దునిసి వాసములు
వ్రాలివ్రీలగ వారి వదలిన పాడు
గోడలపై పాముకుబుసంబులాడ
చూడంగ రోత వచ్చుచునుండు నొక్క
రచ్చకొట్టుకు గాంచి రమణియు దాను.

గ్రంథము జక్కఁగ బరిష్కృతముగాక వ్రాతప్రతిలోనున్నదియున్నట్లే ముద్రితమగుటవలన దప్పులకుప్పయై యున్నది. పునర్ముద్రణమవశ్యము కర్తవ్యము.

## విజయరాఘవుడు

విజయరాఘవుఁడు రెండు ద్విపదకావ్యములను రచించినట్లు తంజావూరు సరస్వతీ మహాలు పుస్తక భాండాగార తెలుగులిఖిత గ్రంథ పట్టికవల్ల దెలియుచున్నది. అందు పాదుకాసహస్ర మొక్కటి. ప్రహ్లాద చరిత్ర పీఠికలో,

"ఘనతరంబగు పాదుకాసహస్రంబెల్ల ద్విపదజేయు కళావతీతనూజ" అని చెప్పుకొని యున్నాడు. కాని పై ద్విపదకావ్యము ఇప్పు డలభ్యము. రెండవదియగు రఘునాథనాయకాభ్యుదయ మిటీవల ముద్రింపబడియె. ఇది మూడాశ్వాసముల గ్రంథము; విజయరాఘవుని తండ్రియగు రఘునాథుని రాజ్యవైభవమిందు వర్ణింపబడినది. రాజధానియగు తంజాపురమును, రాచనగరు నందలి దైనందిన జీవనవిధానమును జక్కఁగా వర్ణింపబడినవి. రఘునాథనాయకు డొకనాడు వాహ్యాళికిబోగా వారకాంతయొక్కతె యతనిగని

వలచి దనకోర్కెను నెఱవేర్పుమని వేడుచు పెంపుడు చిలుకచే వర్తమాన మంపెను. దాని వేడికో లంగీకరించి రఘునాథు డా రాత్రి యా వేశ్యామందిర మునకుబోయి దాని గూడెను. ఇది యీ ద్విపదకావ్యమందలి ఇతివృత్తము. చరిత్రాత్మక మగుటచే నిందు కథాకల్పన కవకాశములేదు. రఘునాథుని వాహ్యాళి సమయమునగాంచి మోహించిన వారకాంత చిత్రరేఖయను చారిత్రక వ్యక్తి యగునేమో. కల్పితమైనను దానికథయందు క్రొత్తదన మేమియు లేదు. పోతనగారి కాలమునుండియు నీరకమైన కథ యాంధ్రలోకమునకు బరిచితమైనదే. మఱియు ద్రావిడవాఙ్మయమున వాడుకయందుండు "ఉలా" కూడ నిట్టిదే. కావున విజయరాఘవుని కథాసంవిధానమున నవ్యత యేమియు గానరాదు. ఇతని ద్విపదరచన చక్కనిదే. సోమశేఖరశర్మగారు చెప్పినట్లు, "యథోచితములైన వర్ణనవిశేషములతో వీనులకు విందుగొల్పుచుండును. కుంటుగంటులు లేని ధారాళమైన మృదుమధురశైలి విజయరాఘవునిది. భావోద్వేగమున బదములు లలితమైన కూర్పులోబడి ప్రతిచరణము సడ్డుమూకలు లేక పరువులు వారుచుండును;" కాని విజయరాఘవునిది యత్యుత్తమజాతి ద్విపదగాదు. రంగనాథ సోమనాథ తిరువెంగళనాథాదుల ద్విపదకీతనిది సరిపోలదు. కాని చారిత్రకదృష్టిని పరిశీలించిన రఘునాథనాయకాభ్యుదయము మిక్కిలి యుత్కృష్ట రచన యని చెప్పక తప్పదు. విజయరాఘవుడు నాయకరాజుల కాలమున దంజావూరు సంస్థానమున వాడుకయందుండిన నగరి మర్యాదలను, రాజకీయసాంఘికవిషయములను, సంగీతవాద్యనాట్య విద్యావిశేషములను జక్కగ జిత్రించియున్నాడు. కావున రఘునాథ నాయకాభ్యుదయమును దీని కనుబంధమని చెప్పదగిన రఘునాథాభ్యుదయ నాటకమును నాయకయుగచరిత్ర రచన కత్యంతోపయుక్తములైన యమూల్య మూలాధార గ్రంథములు. ఇవి రెండునుగాక విజయరాఘవుడు మోహినీవిలాస మను ద్విపదకావ్యమును రచియించెనని శ్రీ నిడదవోలు

వెంకటరావుగారు చెప్పుచున్నారు. తమ వాక్యమున కాధారముగ బ్రహ్లాద చరిత్రపీఠికలోని, "ఆలమోహినీ విలాసాఖ్య ద్విపదకృతి నాటకం బొనరించు నలసమాన" యను సీసపాదము నుదాహరించిరి. ఇది పొరపాటు. విజయ రాఘవకృత మోహినీవిలాసము నాటకముగాని ద్విపదకావ్యముగాదు. ఎవ్వరో రచించియుండిన ద్విపద కావ్యమును నతడు నాటకమొనర్చినాడు. అంతియ. అతడు మొదట దానిని ద్విపదగ రచించి తరువాత నాటకము జేసియుండ రాదా? యను ప్రశ్న మొకటి రావచ్చును. కాని యట్టి సందర్భములందు నాటకమునకును ద్విపదకును దానే కర్తనని విజయరాఘవుడు స్పష్టముగ జెప్పుకొన్నాడు. "ధర రఘునాథాభ్యుదయము నాటకముగా, ద్విపదగా రచియించు ధీరవర్య"యని. మోహినీవిలాసమునం దిట్లు చెప్పక "మోహినీ విలాసాఖ్య ద్విపదకృతి నాటకంబొనరించితి"నని వచించియుండుటవలన మోహినీ విలాస ద్విపద యతడు రచించినది కాదని తెలియుచున్నది.

ఇదిగాక విజయరాఘవుడు దన కవితా సామర్థ్యమును దెల్పుచు:—

"కేళిమై గోపికాగీతలు భ్రమరగీ
తలు తెనుగించు నద్యతన భోజ
సరిలేని ఫాల్గుణోత్సవమెల్ల రగడచౌ
పదములొనర్చిన భవ్యచరిత
ధర రాజగోపాలదండక సందర్భ
వైదర్భికన్న విద్వత్కవీంద్ర
సారమౌ పీఠశృంగారసాంగత్యంబు
మెఱయించు రసికుల మేలుబంతి
సంపంగిమన్నారుసాంగత్యము నమర్చి
జగతి నెచ్చిన నెఱజాణరాయ"

యని తాను సంఘటించిన కావ్యవిశేషములను వివరించినాడు. అతడు తెన్గించిన గోపికాగీతములును భ్రమరగీతములును ద్విపదలో పద్యరచనములో నిర్ణయించి చెప్పుటకు వలనుపడదు. ఫాల్గుణోత్సవమును గోపాలదండకమును రగడచౌపద దండక రచనలం దతనికిగల నేర్పును వెల్లడి సేయుచున్నవి. అన్నిటికంటె వీరశృంగారసాంగత్యమును, సంపంగిమన్నారుసాంగత్యమును ముఖ్యమైనవి. ఇవి రెండును కర్ణాటక సాంగత్య ఛందమున వ్రాయబడిన యాంధ్ర ప్రబంధములు. కర్ణాటక ఛందోరీతులననుసరించి గ్రంథరచన జేసిన యాంధ్రకవి యితడొక్కడే. ఈ సాంగత్య కావ్యములు రెండును నామమాత్రావశిష్టములై పోవుట కడుశోచనీయము.

సుప్రసిద్ధ లక్షణకవియగు గణపవరపు వేంకటపతికవి తాను "బాల రామాయణ ద్విపద"ను పొసగించినట్లు ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాస పీఠికయందు జెప్పియున్నాడు. ఇది నష్టమై పోయినది.

ఈకాలమున ద్విపద భారతము, కట్టావారి ద్విపద రామాయణము మున్నగు పెక్కు ద్విపదకావ్యములు వెలువడినవి. కాని యా గ్రంథములకు నాయకరాజులతో నెట్టిసంబంధ ముండినట్లగపడదు. కావున యా ద్విపద కావ్యములనిట ప్రస్తావించవలసిన యావశ్యకత లేదు.

## వచన కావ్యములు

ఆంధ్రభాషయందు వచన రచన గడు ప్రాచీనమైనది. పద్యముకంటె బహుమే ముందు పుట్టినది. క్రీ. శ. 7 వ శతాబ్దమునుండియు వచనము వ్యవహారమందుండెనని శాసనములు సాక్ష్యము బల్కుచున్నవి. "శ్రీ సోఅ మహారాజుల్లొళన ఇన్నుఅలోలి అణపోతుల రేవణకాలు వుద్దనకాలు ఇచ్చిన పన్నాస పెన్నాఅ ఇశె తేనికిన్ తేనిటచ్చిన వాన్డు పఞ్చమహాపాత కన్డకున్. అసిమైరువు లికితమ్." ఇది యేడవశతాబ్దమునాటి వచన రూపము.

ఇందు "కొన్నికొన్ని పదాలు మాత్రమే కాకుండా వాక్యరచనకూడా విలక్షణంగానే వున్నది." అని శాసన పరిష్కర్తలు సోమశేఖరశర్మగారి యభిప్రాయము. సంస్కృతభాషాసంపర్కమువలన నీ రూపము సత్వరముగ మారినది. భాష సంస్కృత పదభూయిష్ఠమైనది. పదియవ శతాబ్ద ప్రారంభ మప్పటి కిది యెట్లుమారెనో ప్రథమచాళుక్య భీముని ధర్మవరశాసనము విదితము సేయుచున్నది. "గుణగణాభరణుండు దన. కె. ని ఈశ్వరునకుం గార్తికేయుండుంబోలె చామష్టి కలావిశారదుండయిన అయ్యపయ్యము సకల శాస్త్రార్థపారగులయిన పెదపణ్డరంగులు అయులమపెగ్గడలుం గరనమ్మున పండరంగును ఈ ధర్మనిర్వహణోద్యోగమునకు..." ఇత్యాది. కొంచె మించుమించుగ నిట్టివచనమె నన్నయ్యభట్టుగారి భారతమున గానవచ్చుచున్నది. నన్నయ్యభట్టు మహాభారతమె యాంధ్రకవులకు మేలుబంతి యైనది. కాని యీ వచనమంతయు పద్యకావ్యాంతర్గము. కేవల వచన గ్రంథములు 17 వ శతాబ్దారంభమువఱకును దలచూపలేదు.

మనకిప్పు డుపలబ్ధములైన వచనకావ్యములను రెండు తెరగుల విభజింపవచ్చును. జనానీకమున దైనందిన వ్యవహారమునందుండు వాడుక భాషయందు వ్రాయబడినవి కొన్ని. ఇవి జనసామాన్యము నుద్దేశించి వ్రాయబడినవి. ఇప్పుడు కొంతవఱ కందలి భాష దుర్గ్రాహ్యమైనను వాని రచనాకాలమునం దవి సులభగ్రాహ్యములుగనె యుండెడివి. గ్రాంథికభాషయందు రచింపబడినవి మఱికొన్ని. ఇవి విద్యావంతులకొఱకు వ్రాయబడినవి.

వాడుక రచనయందు వ్రాయబడిన వచన రచనలలో రాయవాచకము ప్రధానమైనది. ఇది చరిత్ర గ్రంథము. కృష్ణదేవరాయల చరిత్రము యిందు వర్ణింపబడినది. ఇది విశ్వనాథ నాయనికి అజ్ఞాత నామధేయుడైన యతని స్థానాపతి వ్రాసిపంపిన విన్నపమైన ట్లిందు కలదు. గ్రంథకర్త

కృష్ణరాయలకు సమకాలికుడుగాడు. సుజనులచే విన్న యట్టి విషయమును వ్రాసితినని చెప్పుకొన్నాడు.

"విజయనగర వృత్తాంతము
సుజనులచే విన్నయట్టి సూనృతవాక్కుల్
ప్రజలకు దేట పడంగా
సృజియించితి కృష్ణరాయ శేఖరు చరితల్."

అని గ్రంథారంభముననె చెప్పినాడు. ఈ విశ్వనాథ నాయనయ్యవారె వ్వరో తెలియదు. ఈ విశ్వనాథనాయనయ్య మధురనాయకరాజ్య స్థాపకుడైన కటికము విశ్వనాథనాయకు డగుటకు సంశయము లేదని జయంతి రామయ్య పంతులుగా రానతిచ్చినారు. ఇందు కనుగుణముగ పదునాఱవ శతాబ్ద మధ్య కాలమున వ్రాయబడెనని సెలవొసగినారు. ఈ గ్రంథకర్త మధురనాయకరాజ్య స్థాపకుడైన విశ్వనాథనాయకునియొక్క స్థానాపతియుంగాడు; పదునాఱవ శతాబ్దమునం దీ గ్రంథము వ్రాయబడనులేదు. కుమారధూర్జటి రాయవాచకమును కృష్ణరాయవిజయ మనుపేర బద్యకావ్యముగ రచియించి యార్వీటి చిన వెంకట పతి కంకితమిచ్చెను. ఈ చిన వెంకటపతి క్రీ. శ. 1630-42ల మధ్య కర్ణాటక సామ్రాజ్యమును పాలించిన ముమ్మడి వెంకటపతిరాయలతమ్ముడు. కావున అప్పటికె రాయవాచకము రచియింపబడి యుండెనని నిశ్చయముగ జెప్పవచ్చును. ఇంతకంటె సూక్ష్మముగ రాయవాచక రచనా కాలమును నిర్ణయించుటకు దగిన సాక్ష్యమందె కలదు. రాయవాచక కర్త భాగ్యనగరము నెఱుగును; బాహుబలేంద్ర ముకుందగజపతిని, రాణెజగదేవుని, మల్ల అనంతరాజును పేర్కొని యున్నాడు. భాగ్యనగరము క్రీ. శ. 1589 సంవత్సరమున నిర్మింపబడెను. బాహుబలేంద్ర ముకుందగజపతి క్రీ. శ. 1694 వఱకు రాజ్యము జేసెను.

రాణాజగదేవుడు,

"అళియ రామావనీశ తిర్మలనృపాల
వరుల శ్రీరంగరాయల సరసుడైన
వీరవేంకటరాయల వెలయ రాయ
పట్టభద్రులజేసె సప్పార్థివుండు."

అని పొన్నతోటయాభళికవి తన వామనపురాణ పీఠికయందు చెప్పియున్నాడు. వీరవేంకటరాయలు క్రీ. శ. 1685 వ సం॥న పట్టభద్రుడాయెను; మల్లు అనంతరాజు క్రీ. శ. 1607 వ సంవత్సరమున సిద్ధవటమునందు శాసనమును నిల్పెను. కావున రాయవాచక రచయిత క్రీ. శ. 16 వ శతాబ్దము తుదను 17 వ శతాబ్ద ప్రారంభమునను వర్ధిలెనని చెప్పవచ్చును. అతడు రాయవాచకమున జెప్పుకొన్నట్లు వాస్తవముగ మహామండలేశ్వర కాశీ విశ్వనాథ నాయనయ్య వారికి స్థానాపతియై యుండిన ఆ విశ్వనాథనాయనయ్య యెవ్వరో విచారించదగియున్నది. మధురనాయకరాజ వంశములో నా రాజ్యస్థాపకుడైన విశ్వనాథ నాయకునకు గాక మఱియొక విశ్వనాథుడు గలడు. అతడు క్రీ. శ. 1595 మొదలు 1601 వఱకు పాలించిన రెండవ కృష్ణప్ప తమ్ముడు; 1601 మొదలు 1609 వఱకు పాలించిన ముత్తుకృష్ణప్ప నాయకుని తండ్రి. అతడు క్రీ. శ. 1601 వ సం. మునకు ముందు తన యన్న రాజ్యకాలమున గతించుట వల్లనేమొ సింహాసనము నెక్కలేదు. రాయవాచక రచయిత కొలచిన ప్రభు వీ విశ్వనాథ నాయకుడై యుండవలయును. అగునేని రాయవాచకము 16 వ శతాబ్దాంత్య దశకమున వ్రాయబడెనని నిశ్చయింపవచ్చును.

రాయవాచకము 16 వ శతాబ్దాంతమున రాయసామ్రాజ్యమున రాజకార్యవ్యవహారములను నడుపు అధికారవర్గమునందు చెలామణియందుండిన భాషయందు వ్రాయబడినది. పార్సీభాష సంపర్కమువలన ఆ

భాషనుండి రాజకీయ పారిభాషికపదము లనేకము లిందుజొచ్చినవి. తత్కారణమున నది సులభ గ్రాహ్యముగాక పాఠకులకు క్లేశము గలిగించుచున్నది. అతి దీర్ఘవాక్యములును ప్రాత వచన రచనావిధానమును అచట నచట భావ వైశద్యమునకు బంధకములై వ్యథా జనకము లగుచున్నవి. కాని మొత్తము మీద నిందలి భాష, పొల్లుమాటలుగాని యనావశ్యకవర్ణనలుగాని లేక, పటుత్వము గలిగి యున్నది.

రాయ వాచకమును బోలినదె మఱియొక వచన గ్రంథమును ఆంధ్ర సాహిత్యపరిషత్తువారు ప్రకటించియున్నారు. దీనిపేరు తెలియదు. "రాయ వాచకమువంటి చరిత్రము" అని పరిషత్తువారు నామకరణము జేసియున్నారు. భాష రాయ వాచకమువంటిదె. కాని చరిత్రవిషయమంత సత్యాత్మకమైనది కాదు; దీని నెవ్వ రెప్పు డెచ్చట రచించిరో నిర్ణయించుటకు దగిన సాధనములు లేవు.

కాలక్రమము ననుసరించి రాయ వాచకమునకు బిమ్మట వాడుక భాషయందు వ్రాయబడిన వచన గ్రంథము మధురమంగాపుంశ్చలీవిలాసము. ఈ మధుర మంగ చొక్కనాథనాయని రాణియై, యతని యనంతరము తన మనుమడగు విజయరంగచొక్కనాథునికి బ్రాపై యాతనిపక్షమున 1689 మొదలు 1706 వఱకును మధురనాయక రాజ్యమును పాలించిన మహారాణి మంగమ్మ. ఇందు వర్ణింపబడినది యామె రాజ్య పరిపాలన చరిత్ర కాదు. గ్రంథనామమున సూచింపబడిన ట్లామెయొక్క పుంశ్చలీవృత్తి. మహారాణి మంగమ్మ దానధర్మపరాయణురాలని లోక ప్రతీతి. దీనికి ప్రత్యక్ష విరుద్ధమైనది ఇందలి ఇతి వృత్తము. ఇందు ఆమె మన్మథక్రీడలు వర్ణింపబడి యున్నవి. గ్రంథకర్త యెవ్వరో నిశ్చయించి చెప్పుటకు వీలు పడదు; అత డేకారణమువలననో మంగమ్మయొక్క కోపమునకు బాత్రుడై,

దేశత్యాగము జేసి తిరుచినాపల్లినుండి యానెగొంది వఱకును గల దేశమున పలుతావుల గ్రుమ్మరుచు నిడుములు గుడిచెను. అతడు మంగమ్మపై గసిదీర్చుకొనుటకు చంద్రికావిలాపమునుబోలి పచ్చిబూతులు గల భాషలో నామె దుశ్చరిత్రమును గర్హించెను. మఱియు దన యనుభవములను సమకూర్చెను. బూతుల పుస్తకమైనను—అప్పటి దేశకాలవిద్యమానము లందు బ్రతిబింబించు చుండుటవలన—చరిత్రకారుల కది యత్యంతోపయుక్తమైనది.

అన్యదేశరాజకీయ పరిభాషాపదభూయిష్ఠముగాకున్నను, ఇందలి భాషకును రాయవాచక భాషకును దగ్గరి పోలికలు గలవు. రచనాపద్ధతియు, నన్వయ సౌలభ్యములేని దీర్ఘవాక్యములును రెంటికిని సామాన్యము. మదనోద్రేకముగల్గించు వర్ణనలు, తీక్ష్ణమైనభాష, పోకైన మాటలును నీ గ్రంథమునకు బ్రత్యేకతను గల్గించుచున్నవి. గ్రంథకర్త కవిత్వము జెప్ప నేర్చినవాడు. పుంశ్చలీవిలాసమునం దందందు ద్విపద కలదు.

తిరువాత పేర్కొనదగినవి మాఘమాహాత్మ్య శ్రీరంగ మాహాత్మ్యములను రెండు మాహాత్మ్య గ్రంథములు. మహారాణి మంగమ్మయొక్క పౌత్రుడైన విజయరంగ చొక్కనాథ నాయకు డీ గ్రంథములకు కర్త. ఇవి కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్పుస్తక భాండాగారమునం దున్నవి. భాష వ్యావహారికము. "ఈ వచనము నిర్దుష్టమన వలనుపడదు. సులువుగా నర్థమగునట్లు వ్యావహారిక శైలిని రచింపబడినది" యని ప్రభాకర శాస్త్రులవారి విమర్శ. ఇవి ముద్రితములైనగాని విజయరంగ చొక్కనాథనాయని వచన రచనా విధాన మిట్టిదని వివరించి చెప్పుటకు సాధ్యముగాదు.

రాయవాచకాదుల పద్ధతి ననుసరించి వ్రాయబడిన మఱియొక వచన గ్రంథముగలదు. ఇది తంజావూరాంధ్రరాజులచరిత్ర. దీని రచయితయెవ్వడో తెలియదు. కాని యతడు మధుర నాయకుల కాశ్రితుడో

పక్షపాతియో కావలయును. ఏలనగా నతఁ డీ గ్రంథమును వ్రాసినది కేవలము సత్యమైన చరిత్రాంశములను యథాతథముగ వర్ణించుటకొఱకు గాదు. తంజావూరు రాజ్యమును ఆక్రమించుకొని యేలుటకు మధుర నాయకులకు న్యాయమైన హక్కు గలదని నిరూపించుట కొఱకు. దీనిని నిరూపించుటకు చరిత్ర విరుద్ధమైన కథ నొకదానిని గల్పించినాడు. నాగమనాయకుడు కృష్ణ రాయల కవిధేయుడై తిరుగబడెననియు, నందుమీదట నాగమనాయని పుత్రుడు విశ్వనాథ నాయకుడు తండ్రియని గణింపక రాయల నడిగి యాజ్ఞను గైకొని దండుతో దరలిపోయి యాతని గట్టితెచ్చి రాయలముం దుంచె ననియు, రాయ లాతని స్వామిభక్తికి మెచ్చి దక్షిణ సింహాసనమున కాతని నధిపతిగావించి చోళపాండ్యరాజ్యముల నాతనికి బంచియిచ్చెననియు, దరువాత అచ్యుతరాయలు తన మరదలు మూర్తిమాంబను చెవ్వప్పనాయున కిచ్చి పెండ్లిచేసి, యామె కరణముగ చోళరాజ్యమును విశ్వనాథ నాయకుని యేలుబడినుండి విడదీసి యతని కిచ్చెననియు నొక గాథను సృష్టి చేసినాడు. గ్రంథ రచనా కాలమెద్దియొ సూక్ష్మముగ నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. కాని ప్రాయశః అది పదునెనిమిదవ శతాబ్దమున రచింపబడెనని యూహించుటకు గొంత యవకాశము గలదు. ఏలననగా, నీ తంజావూ రాంధ్రరాజుల చరిత్ర ఇట్లు సమాప్తమగుచున్నది. "పారిపోయిన చెంగమల దాసుకొడుకు విజయరాఘవనాయకుడు, అతని కొడుకు విజయమన్నారప్ప నాయుడు, అతడు చొక్కనాథనాయని మనుమడు విజయరంగ చొక్కనాథనాయని వారికి తన చెల్లెలి నిచ్చి వివాహముచేసి వారిచ్చిన జాగీరు అనుభవిస్తూ వుండెను." విజయరంగ చొక్కనాథుడు క్రీ. శ. 1706—1732 ల మధ్య రాజ్యపాలనము జేసెను, కావున నీ గ్రంథరచన పిమ్మట ఎప్పుడో జరిగి యుండవలయును.

V. R. NARLA MEMORIAL LIBRARY
D.P.R.I.
Acc. No.

తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర, భాషనుబట్టి చూడగా, రాయవాచకము కంటెను, మధురమంగాపుంశ్చలీవిలాసముకంటెను గడు నర్వాచీన రచన యని తోచుచున్నది. మెకంజీ సంపుటములోని గ్రామ కైఫీయతులలో బెక్కింటి భాష యింతకంటె ప్రాచీనతరముగ గాన వచ్చుచున్నది. విస్పష్టమైన భాష; అజ్ఞాత పదములు గాని, బహుళముగ నన్యభాషా పదములు గాని కానరావు. వాక్యము లాధునిక రచన లందువలె నాతి దీర్ఘములు; వాని రచనా విధానము గూడ నట్టిదె. పరిష్కర్తలు వేటూరు ప్రభాకర శాస్త్రిలవారి "తొడిమ" యందలి భాషాదులకును దీనికిని విశేషభేదము గానరాదు.

గ్రాంథిక వచన రచనలు :—గ్రాంథిక వచన రచన లనగా గ్రాంథిక భాషలో వ్రాయబడినవి. గ్రాంథికవచన రచనలు మన కెఱుకపడినంత మట్టుకు క్రి. శ. 17 వ శతాబ్దపు టుత్తరార్థమున ప్రారంభమైనట్లు కాన వచ్చుచున్నవి. ఇవియన్నియు భారత భాగవత రామాయణాది పురాణేతి హాసములకు దెలుగు సేతలే. కొందఱు వీని యాంధ్రీకరణముల ననుసరించిరి; మఱి కొందరు సంస్కృత మూలములబడి తెనుగు వ్రాసిరి. ఆంధ్రవాఙ్మయ చరిత్రాధ్యాపకులు స్మరణయందుంచుకొన దగిన విశేషాంశ మొకటి కలదు. ప్రాచీ నాంధ్రకవులు సంస్కృతేతిహాసపురాణాదులను బద్యకావ్యములుగ దెనిగించిరి. 17 వ శతాబ్దము వారు వీనినె వచన కావ్యములు సేయగడగిరి. ఇది యితిహాస పురాణాదులపై వారికిగల యభిమానము దెల్లము సేయుటయె కాక స్వతంత్రగ్రంథ రచనయందు వారి కభిరుచి చాల తక్కువ యనియు జాటుచున్నది! గీర్వాణ సాహిత్యమున కాంధ్ర సాహిత్యము నకలుగ దయారగుట కిదియె ముఖ్యకారణమని తోచెడివి.

తుపాకుల అనంత భూపాలుడు దాక్షిణాత్య గ్రాంథికవచనకావ్య రచ యితలలో మొదట పేర్కొనదగినవాడు. భారత వచన రచనయందు కళువె

వీరరాజున కితడు తోడ్పడుటచేత నేమొ శ్రీ నిడదవోలు వెంకటరావుగా రితని మైసూరివారిలో జమకట్టిరి. "ఈ తుపాకుల యనంత భూపాలకుడు మధుర రాజుల యొద్ద దళవాయి యని తెలియుచున్నది" అని పల్కినారు ప్రభాకర శాస్త్రిలవారు. అతని గ్రంథాంతగద్యవలన యతని చరిత్ర కొంత తెలియుచున్నది. ఇందు "చంద్రగిరి కృష్ణనృప తనూజ... తుపాకుల యనంత భూపాల" యని తన యుదంతమును జెప్పుకొన్నాడు. ఇందువలన నతని తండ్రి చంద్రగిరి వాస్తవ్యుడైన కృష్ణ నృపుడనియు నతని యింటి పేరు "తుపాకుల" యనియు దెలియవచ్చుచున్నది. ఈ చంద్రగిరి కృష్ణనృపుడు సుప్రసిద్ధుడైన తుపాకుల కృష్ణప్ప నాయకుడుగాని యన్యుడుగాడు. తుపాకుల కృష్ణప్ప మొట్టమొదట క్రీ. శ. 1637 లో చెంజినాయకుల సేనాధిపతియై యుండెను. క్రీ. శ. 1648 లో చెంజికోటను రాజ్యమును విజాపుర సుల్తాను జయించి స్వాధీనము జేసికొనిన పిమ్మట నతడు గోల్కొండ సుల్తానుకు సర్వాధికారియైన మీరుజుమ్లా కొలువున జేరి యతని సేనాధిపతియై యతని శత్రువులతో యుద్ధములు సేయుచుండెను. క్రీ. శ. 1656లో మీరుజుమ్లా స్వామిద్రోహము జేసి యౌరంగజేబు కొలువున బ్రవేశించినప్పుడు, కర్ణాటకమునందలి దన సైన్యమును దుపాకుల కృష్ణప్ప కొప్పజెప్పెను. క్రీ. శ. 1654 వ సం॥ర తుపాకుల కృష్ణప్ప నాయకుడు పులికాటును ముట్టడించియుండగా నబ్దుల్లా కుతుబ్‌శాహు సైన్యాధిపతియైన కులీబేగు సైన్యముతో నతనిదాకి యుద్ధమున బరాఙ్ముఖుని గావించి బందీకృతుని జేసెను. అతని కుమారుడైన యనంత భూపాలకుడు వెంకట్రావుగారు తలచినట్లు మైసూరు రచయితలలో జేరడు. తుపాకుల కృష్ణప్ప నాయకుడు బందీకృతు డయిన పిమ్మట అతని సన్నిహిత జ్ఞాతియు నతని క్రింది దళనాయకులలో నొక్కడునైన తుపాకుల లింగమ నాయుడు కుటుంబముతోగూడ తిరుచినాపల్లెకు బోయి చొక్కనాథ నాయకు నాశ్రయించెను. చొక్కనాథనాయకు డాతని కుమార్తెను మంగమ్మను వివాహము జేసికొని యతనికి సేనాధిపత్యమిచ్చెను. అతడు

పూర్వము తన యజమానునిమీది యభిమానముచే నతని పుత్రుడగు ననంత భూపాలుని దనవెంట దోడ్కొనిపోయి మధుర సైన్యమున దనక్రింది దళ వాయిగా నియమించి యుండవచ్చును. అగునేని యతడు (ప్రభాకర శాస్త్రి లవా రనినట్లు మధురనాయకులయొద్ద దళవాయిగ నుండుటయం దసంగత మేమియుం లేదు.

అనంతభూపాలుడు పెక్కు వచన కావ్యములను వ్రాసెను. విష్ణు పురాణము, మహాభారతమున నాది, సభా, భీష్మ, అను శాసనిక పర్వములు— మొదటి మూడు పర్వముల రచనయం దితడు కళువె వీరరాజునకు దోడ్పడెను. కడపటి పర్వము నీత డొక్కడే రచించెను. రామాయణము—సుందరకాండ —భగవద్గీతలు. ఇందు విష్ణుపురాణము ముద్రితమైనది. కాని యిప్పుడు ముద్రిత ప్రతులు దొరకవు. కళువె భారతమును భగవద్గీతయును ముద్రి తములే. తక్కిన వముద్రితములు. అనంతభూపాలుడు ఉభయభాషా సాహిత్య భోజుడు. అఖిల పురాణేతిహాసకథానుసంధానసమేధమానచాతుర్యుడు, వచనరచనా విచక్షణుడు. ఇతని భాష విలక్షణము. సులభగ్రాహ్యము. శబ్దాడంబరములేక మృదుపద బహుళమై చదువుట కింపుగ నుండును. ఇతని విష్ణు పురాణమును గూర్చి (ప్రభాకర శాస్త్రిలవారు చేసిన ప్రశంస యొప్పిదమై యున్నది. "విష్ణు పురాణముకంటె నియ్యది కడు విపులమై సంస్కృత మూలము ననుసరించుచున్నది ... ఈ విష్ణుపురాణ వచనము ధారాళమగు రచన గల్గియుండుటచే ప్రౌఢమై మిక్కిలి చక్కగ నున్నది. వచన భారత మందువలె గాక యిందు సంస్కృత సమాసములు కొంచెము మెండుగా జూపట్టుచున్నవి."

## కామేశ్వరకవి

అనంత భూపాలునికి సమకాలికుడె లింగనమఖి కామేశ్వరకవి. ఇతడు తిరుమల నాయకుని కాలము నుండియు మధుర సంస్థానము నాశ్రయించి

యుండి చొక్కనాథ నాయకుని యాదరమునకు పాత్రుడై ముద్దుపళనికి సత్య భామాసాంత్వన మను శృంగార ప్రబంధము నంకితమొసగె నని ముందు వివరించి యున్నాడను. ఇతడు ధేనుమాహాత్మ్యము, ఆచార్యవిజయమను రెండు వచన కావ్యములను రచించినట్లు ప్రభాకర శాస్త్రిలవారు వ్రాసి యున్నారు. ఈ రెండవ గ్రంథమును వారెచట జూచిరో తెలియదు. ధేను మాహాత్మ్యము తంజావూరు సరస్వతీ మహలు పుస్తక భాండాగారమం దున్నది. ఇతని వచనశైలి మంచిదే. కాని యనంత భూపాలుని సారళ్యము గాని భాషామాధుర్యముగాని ధేనుమాహాత్మ్యమున గానరావు.

విజయ రంగ చొక్కనాథుని కాలమునం దనేక వచనకావ్యములు వెలువడినవి. విజయరంగచొక్కనాథుని యాస్థాన స్థితులయిన కవులు కొందఱు వచన కావ్యములను వ్రాసిరిమని చెప్పుకొనియున్నారు. కుందుర్తి వేంకటాచలకవి భారత, భాగవత, రామాయణములను వచన కావ్యములుగా రచించెను. వెలగపూడి కృష్ణయ్య వేదాంతసార సంగ్రహమను వచన కావ్య మును జెప్పెను. ఈ గ్రంథము లింకను లభ్యపడలేదు.

## సముఖము వేంకట కృష్ణప్ప

విజయరంగ చొక్కనాథుని యాస్థానమందలి వచన కావ్యకర్తలలో శ్రేష్ఠతముడు సముఖము వేంకటకృష్ణప్ప నాయకుడు. జైమిని భారతము సారంగధర చరిత్రలను రెండు గద్యకృతులను రచించెను. జైమినిభారతము పిల్లలమఱ్ఱి పినవీరన్న పద్యప్రబంధమునకు వ్రాయబడిన వచన కృతి. ఐదా శ్వాసముల గ్రంథము. అచటనచట శృంగారాది వర్ణనల పట్టున మూలాతిరే కముగానవచ్చినను గ్రంథమునం దెల్లయెడలను పీరన్న మాటలను లోకోక్తులను మార్చక యట్లే వచనము జేసినాడు. గ్రంథము విజయరంగ చొక్కనాథుని కంకితము సేయబడినది. గ్రంథరచనయం దితడు కొంతవఱకు కళువై నంజరాజు

పద్ధతి నవలంబించినాడు; హాలాస్యమాహాత్మ్యాధ్యాయాద్యంతములందువలె నీతడు జైమినీ భారతాశ్వాసాద్యంతములందు పద్యముల గూర్చినాడు; శైలి ప్రౌఢమై శబ్దాలంకారాత్మకమై యొప్పారుచున్నది.

సారంగధరచరిత్ర మూడాశ్వాసముల గ్రంథము. ఇందును ఆశ్వాసాద్యంత్యముల పద్యములు గలవు. శ్రీ రంగనాథస్వామి కంకితము సేయబడినది. ఇది చేమకూర వేంకటకవి విరచిత పద్య ప్రబంధము ననుసరించి వ్రాయబడెనేమొ. గ్రంథ మముద్రిత మగుటచేతను, అందుబాటున లేకపోవుటచేతను విషయమును పరిశీలించి చూచుటకు వీలుగాకున్నది. శైలి చక్కనిదే. కాని వెంకటకృష్ణప్పనాయకుని వచన కావ్యములందు, అతని పద్యకావ్యములలో గానవచ్చు భాషాపేశలత్వమును, వాఙ్మాధుర్యమును గానరావు. ఇందులకు గారణ మాతడు వచన రచనయం దన్యుల భాషను స్వీకరించుటయేయని తోచుచున్నది.

సంస్థానాశ్రితులు గాకపోయినను, విజయరంగ చొక్కనాథనాయకుని కాలమున వర్థిల్లిన వచన గ్రంథకర్తలు మఱికొందరు గలరు. శ్యామరాయ కవియు వేంకటసుబ్బకవియు రామాయణ వచన కావ్యములను వ్రాసిరి. రామభద్రకవి యను నతడు హాలాస్యమాహాత్మ్యవచనమును విరచించెను. ఇట్లు 17, 18 శతాబ్దములందు ద్రావిడదేశమునం దాంధ్ర వచన కావ్యములు కొల్లగ నుత్పత్తియాయెను. ఈ వచన వాఙ్మయ మింకను ముద్రితము గాక యుండుట శోచనీయము.

# ప్రకరణము. ౫

## యక్షగానము

యక్షగానమాంధ్ర దేశమున కాకతీయుల కాలమునుండియు వ్యాప్తి యందుండు నాటక విశేషము; ఇంతటి ప్రాచీనమైనదియైనను అప్ప కవికి బూర్వము మన లాక్షణికు లెవ్వరును యక్షగాన ప్రస్తావము సేయరు. అటు వెనుకనైనను పండితు లెవ్వరును ఆదరింపకపోవుటవలన యక్షగానము పామర సాహిత్యముగ మన తరముదాక పరిగణింపబడుచు వచ్చినది. ఇటీవలనే మన విద్యావంతుల దృష్టి దీనిపై బ్రసరించుటవలన నదియు నన్య సాహిత్య శాఖలవలె సాదరపాత్ర మను నభిప్రాయము జనానీకమునందు ప్రబలినది. కావున యక్షగాన విషయమైన చింతన ఇప్పుడిపుడే ప్రారంభమగుట వింత కాదు. యక్షగానోత్పత్త్యభ్యుదయములనుగూర్చి యాంధ్రదేశముననె కాక దక్షిణభారతమందంతటను చర్చలు పెరిగినవి. యక్షగాన పరిశోధనలో గొంత శ్రద్ధవహించి పనిచేసిన విద్వాంసులలో శ్రీ వేటూరు ప్రభాకరశాస్త్రిలవా రగ్రగణ్యులు. వీరి మతానుసారము యక్షగాన మీ క్రిందివిధముగ నుత్పతిల్లినది.

తొలుత ద్రావిడభాషలలోని దృశ్య రచనలు కుఱవంజు లనబడునవి. కుఱవజాలివారు నటించునవి కావున వానికా పేరు వచ్చినది. ఆంధ్రదేశమున పుణ్యక్షేత్రయాత్ర—జాత్ర, తిరునాళ్ళ—ల యందీ కుఱవలు నాట్యప్రదర్శనము జేసి ధనమార్జించువారు. మొట్టమొదట ఉత్తయాటగ ప్రారంభమైనది. క్రమక్రమముగనది గేయ విశిష్టమైనది. అటుయూ దదర్థము విరచితములైన గేయ రచనలును కుఱవంజు లను పేర బ్రసిద్ధికెక్కినవి. ఈ కుఱువలు అటువిక వస్తువులనమ్ముటకు నగరములకును బల్లెలకును వచ్చినప్పు డచట తమ గేయ నృత్య విశేషముల బ్రదర్శించుటచే నవి నాగరక దేశములందు వ్యాపించెను. ఆ గేయ

విశిష్ట నృత్యమును జక్కులవారు—యక్షులు, కళావంతులు—తరువాత నగరములయందు ప్రయోగించుటచే నది యక్షగాన మనబడెను. ఇది ముక్తసరిగ యక్షగానోత్పత్తినిగూర్చి ప్రభాకరశాస్త్రిలవారు ప్రతిపాదించిన సిద్ధాంతము. అలతి పునాదులపై నిర్మింపబడిన సౌధమువలె నిది నిలువజాలదు. కొఱవంజె యను మాటపై నీ సిద్ధాంత మాధారపడియున్నది. ఇది యరవమాట. సరియైన రూపము కొఱవంజి. కొఱవంజి యనగా నెఱుకతె. తమ సిద్ధాంతమున కాధారము గల్పించుట కొఱకు కొఱవంజె యని దిద్దినారు ప్రభాకరశాస్త్రిలవారు. కొఱవంజు లని యక్షగానములందు ఒక తరగలి నాటకము లుండుట వాస్తవమే. నాయికా నాయకులకు గద్దెచెప్పుట కందు ప్రవేశపెట్టిన యెఱుకతెవలన దాని కాపేరు వచ్చినది. మొట్టమొదట నీ కొరవంజిని ప్రవేశపెట్టిన వారు తంజావూరు యక్షగాన కర్తలు. తత్పూర్వము ఆంధ్రదేశమున విరచితములైన యక్షగానము లందు కొఱవంజి ప్రసక్తిలేదు. తంజావూరు నాటకముల గుండ నిది యాంధ్రదేశమునకు దిగుమతియైనది. మఱియు గొఱవ లెప్పుడును నృత్యగేయములచే వాసికెక్కిరనుట కాధారములేదు. కావున కొఱవల మూలమున యక్షగాన ముత్పత్తియాయె నని తలచుట పొరపాటు.

యక్షగానములు మతప్రచారము కొఱకు ప్రభవించినవి గాని వేడుక కొఱకు కాదు. మతబోధ కొఱకు మన ప్రాచీను లవలంబించిన మార్గములలో బురాణేతిహాసాదులలోని గాథలను జనసామాన్యమునకు గన్నుల గట్టునట్లు ప్రదర్శించి చూపుట యొకటి. బౌద్ధమత ప్రచారమునకు అశోక చక్రవర్తి యీ మార్గము ననుసరించిన ట్లాతని శాసనములవలన దెలియుచున్నది. మత ప్రచారమునకు మిక్కిలి యనుకూలమైన సమయములు యాత్రలు; వీనిని మనము జాత్రలనియు, దిరునాళ్ళనియు జెప్పుదుము. ఆ సమయములందు కూడు వేలకొలది జనులను వినోదపెట్టుచు దన్మూలమున ధర్మబోధన సేయుటు కొఱకీప్రదర్శనము లేర్పడినవి. ఇట్టి ప్రదర్శనము లాద్యమున కొయ్యబొమ్మల

మూలమునను దోలుబొమ్మల మూలమునను సాగెడివి. సూత్రధారుడు—అనగా బొమ్మలకు గట్టిన దారములను ధరించువాడు—కథను గేయముగ బాడుచు దదనుగుణముగ దారములను లాగి బొమ్మల నాడించువాడు. ఇట్టి బొమ్మలాటలు శివరాత్రి మహోత్సవ సమయమున శ్రీశైలమునందు ప్రదర్శించువారని పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రమున గలదు.

భారతాది కథల చీరమలుగుల
నారంగ బొమ్మల నాడించువారు
కడునద్భుతంబుగ గంబ సూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు.

ఇందొకటి తోలుబొమ్మలాట. మఱియొకటి కొయ్యబొమ్మలాట. ఈ బొమ్మలాటల పరిణామమే మన యక్షగానము. కాలక్రమమున బొమ్మలకు బదులు మనుజులే ప్రదర్శించిన నెక్కుడు ప్రయోజనకర మగునను నభిప్రాయము గల్గినది. కథలయందలి పాత్రలకర్హమైన వేషములను ధరించి నర్తకులు ప్రదర్శింపగడింగిరి. తొలునొల్త నిది బొమ్మలాట సంప్రదాయము ననుసరించి మూక నాట్యముగ బ్రారంభమైనది. సూత్రధారుడును నతని తోడివారును గేయరూపమైన కథను బాడుచుండగా నుచిత వేషధారులైన నర్తకులు తదనుగుణముగ నభినయము సేయుచు నాట్యము సల్పెడివారు. కేరళదేశమున నేటికిని వాడుకయందుండు కథకళి దీనికి దార్కాణ. నర్తకులు మూక నాట్యములో జిరకాలము తృప్తినందియుండలేదు. కొయ్య, తోలు బొమ్మలవలె సూత్రధారుని పాట కనుగుణముగ నాడుట వారికి నచ్చలేదు. రెండు కార్యములను దామే నిర్వహించిన స్వారస్య మిత్తోధికముగ నుండునని యెంచి తామే పాడుచు తదనుగుణముగ నభినయము సేయుచు నటింపగడగిరి. అంతట మూకనాట్యము యక్షగానముగ బరిణామమందినది.

యక్షగాన మన నేమి? పైజెప్పిన నాట్యప్రదర్శనమున కాపేరెట్లు వచ్చినది? అను ప్రశ్నలు సమాధానము గోరుచున్నవి. ఆంధ్రదేశమున జక్కులవారను నాటకప్రదర్శనమే వృత్తిగ గల యొక తెగ జనులున్నారు. "జక్క" శబ్దము సంస్కృత "యక్ష"శబ్దమునుండి పుట్టినది. కావున జక్కులాడెడి నాటకము యక్షగానమని ప్రసిద్ధికెక్కినది అని కొందఱు చెప్పుదురు. కాని జక్కులవారాడుటవలన యక్షగానమున కాపేరు వచ్చెనో లేక యక్షగాన ప్రదర్శనమే బ్రదుకుదెరువుగ గల జనులు, నిజవృత్తి కారణముగ నొక ప్రత్యేక కులముగ నేర్పడి, జక్కులన బరగిరో నిశ్చయించి చెప్పుట కష్టము. జక్కులవారి వృత్తి యక్షగాన ప్రదర్శనమని నిరూపింపగల సాక్ష్యమును లేదు. జక్కులవాండ్లు అను మాటకు *wizards who worship the fiend Camesvari, Circe* అని బ్రౌనుగారును, "జక్కులు"శబ్దమునకు "కామేశ్వరిని గొల్చెడి యొక జాతివారు," అని శబ్దరత్నాకరకారులను, "కామేశ్వరిని గొలుచు మాంత్రికులగు నొక జాతివా"రని సూర్యారాయ ఆంధ్ర నిఘంటు కర్తలును అర్థము నిర్వచించిరే కాని "యక్షగాన ప్రదర్శకుల"ని యెవ్వరును జెప్పలేదు. కావున జక్కుల కులవృత్తి యక్షగాన ప్రదర్శనమనుట సంశయాస్పదము; వారిమూలమున దానికా పేరు వచ్చెనని ప్రబలమైన సాక్ష్యము లేక యంగీకరింపదగిన విషయము గాదు. యక్షగాన మనగా యక్షులు చేయు గానమని యర్థము. యక్షు లెవ్వరు? యక్షులు దేవయోనులలో నొకరని నామలింగానుశాసనము దెలుపుచున్నది. వీరి రాజు కుబేరుడు; ఇతనికి వైశ్రవణుడనియు పేరు కలదు. అష్టదిక్పాలకులలో నిత డొకడు. ఉత్తర దిశ కధిపతి. యక్షుల వృత్తాంతము మన పురాణేతిహాసములలోను, బౌద్ధమత గ్రంథములందును విస్తారముగ వర్ణింపబడి యున్నది. దక్షిణాపథమున వీరి కథలు గుణాఢ్యుని కాలమునుండియు వ్యాప్తియందుండినవి. ఆటపాటలందు వీరి కాసక్తి మెండు. దేవయోనులుగ బరిగణింపబడినను వారు కేవలము

మిథ్యాప్రపంచమునకు జెందినవారు కారు. నాగ రాక్షస పిశాచాదులవలె వారును మానవజాతికి జెందినవారే. బౌద్ధయుగమున యక్షులు గొందరుండిరని బౌద్ధగ్రంథములందు కలదు. ఆంధ్రదేశమున యక్షులు బౌద్ధయుగమున ప్రబలియుండిరనుటకు గొంత యాధారము కలదు. గుంటూరు మండలములోని భట్టిప్రోలు స్తూపమందు దుపలబ్ధమైన క్రీస్తుకు మూడు శతాబ్దములకుముందు వ్రాయించిన శాసనమునందా ప్రాంతమును బాలించుచుండిన కుబేరకుడను రాజు పేర్కొనబడి యున్నాడు. కుబేరునికి ధనదుడని నామాంతరము. ధనద ప్రోలు నిర్మాపకుడైన ధనదుడీ కుబేరుడే కావచ్చునని చరిత్రకారుల యభిప్రాయము. మధ్యయుగమునందలి వేంగిదేశ శాసనములలో గోదావరి మండలాంతర్గతమైన పెనుగొండ యందలి వైశ్యులు తాము కుబేరుని వంశము వారమని చెప్పుకొనిరి. ఈ యంశములనుబట్టి చూడగా నాంధ్ర దేశమున బౌద్ధయుగమున యక్షజాతివారు కొందఱు వసించుచుండిరనియు యక్షగానమునకు వీరితో నెద్దియో సంబంధ ముండియుండుననియు దోచుచున్నది.

యక్షగానము దేశినాటకమని వాఙ్మయ విమర్శకుల యభిప్రాయము. దేశి యనగా సంస్కృత ప్రాకృతములకంటె భిన్నమైనది. ఆంధ్రదేశమునందిది యన్య భాషా సంప్రదాయములకు బద్ధముగాని రచనా విశేషమని చెప్పుదురు; కాని యక్షగానము కేవలము దేశి రచన గాదు. ఇందు విస్తారముగ గానవచ్చు ఛందము ద్విపద. ప్రారంభదశయందు యక్షగానము సంపూర్ణ ద్విపద రచనయై యుండవచ్చును. మనవా రనుకొనునట్లు ద్విపద దేశి ఛందముగాదు. ప్రాకృతమునుండి యెరవు తెచ్చుకొన్నది. ద్విపద రెండుపాదముల బుక్కా నియు, ప్రాకృత పద్యభేదమనియు సంస్కృత నిఘంటువులలో గలదు. కాళిదాసు విక్రమోర్వశియందు ద్విపదకమును పేర్కొనియున్నాడు. దీని లక్షణమును భరతముని చెప్పియున్నాడు. ఈ ద్విపదకమే మన ద్విపద యైనది. మఱియు యక్ష గానములవంటి రచనలు సంస్కృతమున లేకపో

లేదు. ఆటపాటలతో గూడిన నాటకముల ప్రస్తావన భరతుని నాట్యశాస్త్రమున గలదు. కాళిదాసుని విక్రమోర్వశీ యందలి చతుర్థాంక మిట్టి నాటకమని నాట్యవిద్యావిశారదు లభిప్రాయపడుచున్నారు. ఈ యంశములను విమర్శించి చూచిన యక్షగానము కేవలము దేశి రచన కాదనియు సంస్కృత ప్రాకృత వాఙ్మయములనుండి మనవారు గ్రహించి పెంపొందించిన దృశ్య ప్రబంధ విశేషమనియు దోచెడివి.

దాక్షిణాత్య భాషలం దన్నిటిలో యక్షగానములు గలవు. అవి యన్నియు దెలుగు యక్షగానముల బడి వ్రాయబడినవే. తెలుగు యక్షగానములు ప్రాచీనతమములు. తమిళ, కన్నడ యక్షగానము లా దేశములం దాంధ్రుల వ్యాపన మతిశయించిన పిమ్మటనే రచియింపబడెను. క్రీ. శ. 17-వ శతాబ్దమునగాని తమిళమున యక్షగానముల పొడ చూపలేదు. ఆంధ్ర దేశమున యక్షగానములు పాల్కురికి సోముని కాలమునుండియు బ్రచారముండెననుటకు గొంత యవకాశము గలదు. శ్రీనాథుని కాలమున యక్షగాన ప్రదర్శనము సర్వసామాన్యమై యుండెననుట నిస్సంశయము. వీరనరసింహ కృష్ణరాయల దినములలో జనానీకమునకు యక్షగాన ప్రదర్శనములం దభిరుచి హెచ్చుగుటవలన భాగవతమేళము లేర్పడి వర్షవర్షమును రాయల సామ్రాజ్యములోని గ్రామములందును పట్టణములందును నాటక ప్రదర్శనము సల్పుటకొఱకు సంచరింపగడగినవి. కూచిపూడి పోతవర భాగవత మేళములా కాలమున వాసికెక్కినవి. యక్షగాన ప్రదర్శనమున నిపుణులైన నటీనటుల నామములు కొన్ని వాఙ్మయమునను శాసనములందును పాదుకొనిపోయినవి. భాగవతుల బుచ్చిగాడు, నట్టువ నాగయ్య, పెండెల నాగి, గంగి, నట్టువ తిమ్మయ కుమారిత మున్నగువా రాంధ్రనాటకరంగము నలంకరించినవారిలో ప్రముఖులు. ఇట్లు యక్షగాన ప్రదర్శనము లాంధ్రదేశమం దంతటను జనాదరణమునకు పాత్రములైనను ప్రాచీన యక్షగానము లన్నియు నడపాడ

గానరాకపోవుట చిత్రము. 15 వ శతాబ్దాంతమున రచింపబడిన ప్రోలుగంటి చెన్నకవియొక్క సౌభరి చరిత్రయు, 16 వ శతాబ్దారంభమున విరచితమైన 'తాయికొండ నాటకము'ను నామమాత్రావశిష్టమైపోయినవి. కృష్ణరాయల యష్టదిగ్గజములలో నొక్కడైన కందుకూరి రుద్రకవి కృత సుగ్రీవవిజయ మొక్కటిమాత్రము మనకు దక్కినది.

తంజావూ రాంధ్రనాయక రాజ్య స్థాపనతో యక్షగానరచనయం దొక నూతనయుగము ప్రారంభమాయెను. దీనికి ముఖ్యకారణము రఘునాథ విజయరాఘవనాయకుల యక్షగానాభిమానమే. మన కెఱుక పడినంతవఱకు రఘునాథుని కాలమున వెలువడిన యక్షగాన మొక్కటియె. అతడు రచించిన రుక్మిణీ పరిణయము యక్షగానమని, "శ్రీ రుక్మిణీకృష్ణ వివాహ యక్షగానం ప్రబంధానపి నైకభేదాన్" అను యజ్ఞనారాయణదీక్షితుని వాక్యములవలన దెలియుచున్నది. కృష్ణాధ్వరి కృతమైన కల్యాణకౌముదీకందర్పనాటకము యక్షగానమే యగునేని యది రఘునాథుని కాలమున విరచితమైన రెండవ యక్షగానకృతి కావచ్చును. అట్లయినయెడల రఘునాథనాయకుడు యక్షగాన నాటకకర్తయు భర్తయు నగుచున్నాడు. రఘునాథ కృష్ణాధ్వరుల నాటకములు లభ్యపడలేదు. కాన వాని రచనావిధానాదులగూర్చి యేమియు జెప్పుటకు వీలుపడదు.

విజయరాఘవుడు తండ్రిని మించినాడు. తండ్రి యంతటి కవి గాకపోయినను నతనికంటె నధికుడైన నాటకకర్త. విజయరాఘవుడు తన కృతుల నేబదింటిని ప్రహ్లాద చరిత్ర పీఠికయందు పేర్కొని యున్నాడు. అందు రాజగోపాల విలాస నాటకము, ఉషా పరిణయ నాటకము, రఘునాథాభ్యుదయ నాటకము, మోహినీ విలాస నాటకము, పూతనాహరణ నాటకము, మంజరీ ద్విపద ప్రబంధ నాటకము, కృష్ణవిలాస నాటకము, జానకీ కల్యాణ

నాటకము, పుణ్యకవ్రత నాటకము, మున్నగు నీ పదియును యక్షగానము లగుట నిస్సంశయము. ఇవిగాక ప్రహ్లాద చరిత్ర, విప్రనారాయణ చరిత్ర, కాళీయ మర్దనములు మూడును నాటకములే. తక్కినవానిలో మఱి యెన్ని గ్రంథములు యక్షగానములో తెలియదు. మనకు దెలియవచ్చునంత వఱకు నితడు పదమూడు నాటకములు రచించెను. ఇందు రఘునాథాభ్యుదయము, విప్రనారాయణ చరిత్ర, ప్రహ్లాద చరిత్ర, పూతనాసంహారణము, కాళీయ మర్దనమును నుపలబ్ధమైనవి. మొదటి రెండును ఇటీవల ముద్రితమైనవి. కడపటి మూడును అముద్రితములు. తక్కిన నాటము లన్నియు నష్టమై పోయినవి.

విజయరాఘవు డిట్లు యక్షగాన రచనా నిమగ్నుడు కాగా నతనియాస్థాన కవులెల్ల నాటక రచన కారంభించిరి. వీరిలో మొదట పేర్కొనదగినవాడు విజయరాఘవుని పుత్రుడు మన్నారుదేవుడు. ఇతడు విజయరాఘవాభ్యుదయము, హేమాబ్జ నాయికా స్వయంవరము అను రెండు గ్రంథములను రచించెను. ఇందు రెండవది మాత్రము దొరకినది. ఇది యక్షగానము. ఇందలి యితివృత్తము తంజావూరు సరస్వతీమహాలు పుస్తక భాండాగారాంధ్ర గ్రంథపట్టికయందు సంగ్రహముగ నిట్లు చెప్పబడియున్నది. "మన్నారు కొలువుండగా నొకనాడు దేవతలు వచ్చి వానితో సముద్రమథన విషయము వివరించిరి. మన్నారపుడు వెడలి పాలమున్నీట బుట్టిన యమృతంబు దేవతల కొసగి సముద్రుని కన్యయగు రక్తాబ్జయను నావెను వివాహమాడెను." సీతారామభట్టాచార్యులవారు "నాటకము గద్యపద్యోభయమయముగా నున్నది. తుదిని కొన్ని పాటలును గలవు. ఈయనకు కూడ సంగీత జ్ఞాన మున్నట్లు నాటకమును జదివిన స్పష్టముగా దెలియగలదు." అని వక్కాణించి యున్నారు. ఇతడు రచించిన విజయరాఘవాభ్యుదముగూడ యక్షగానమని భట్టాచార్యులవారి యభిప్రాయము; కాని యది యంగీకరింప

దగినదికాదు. ఏలనగా మన్నారుదేవుడు హేమాబ్జ నాయికా స్వయంవరము కడపటి భరత వాక్యమున "విజయ రాఘవాభ్యుదయాది ప్రబంధ నిబంధన చాతురీ ధౌరేయుడ" ననియు "హేమాబ్జ నాయికా స్వయంవరనాటక" కర్తననియు జెప్పియున్నాడు. కావున విజయరాఘవాభ్యుదయము నాటకము గాదనియు బద్య ప్రబంధమనియు దోచుచున్నది. ఇది మనకు లభించలేదు.

రంగాజమ్మ మన్నారుదాసవిలాసమను నొక యక్షగానమును రచించెను. మన్నారు దాస విలాస ప్రబంధ కథనె ఇందు నాటకముగ వ్రాసినది. కథానాయకుడు మన్నారుదాసనామాంతరము గల విజయరాఘవనాయకుడే. అతడు మన్నారుగుడికి రాజగోపాలచెంగమల బ్రహ్మోత్సవమును జరుపుటకు బోయినప్పు డచట రాజచంద్రుని కూతురు కాంతిమతి యతనిగాంచి మోహించి పెండ్లాడిన వృత్తాంతము ఈ నాటకమున వర్ణింపబడినది. ఈ నాటకము విజయరాఘవుని కాలమున వెలువబడిన నాటకములలో సుప్రసిద్ధమైనది. కోనేటి దీక్షితుడు విజయరాఘవకల్యాణమును రచించెను. ఇందు విజయరాఘవ మదనమంజరుల వివాహము వర్ణింపబడినది. ఇతడు రామాయణమును విజయరాఘవుని కుపదేశించి యతనిచే సారాగ్రహారతారహారాదులను బడసెనట; భారతభాగవతాదిశిక్షావైచక్షణ్యవిజితవిబుధాచార్యుడట. కోనేటి దీక్షితుడు శ్రీ వైష్ణవుడు, రామానుజాచార్యుని పుత్రుడు, శతక్రతు శ్రీనివాసతాతాచార్యుల శిష్యుడు. కామరసు వెంకటపతి సోమయాజి విజయరాఘవచంద్రికావిలాసమును వ్రాసెను. ఇతడు విజయరాఘవ పట్టభద్రుని కట్టుంపుకవి యట. విజయరాఘవ చంద్రుని చంద్రికా విహార శృంగారవిలాస మిందు వర్ణింపబడినది. కవి జిహ్వారంగ శృంగాటకంబుల ధాటిసల్పు భారతి ఘోటకంబుగా శృంగారరసవర్షా విర్భావంబునకు గర్భోటకంబుగా నతడీనాటకంబును నిర్వహింపబూనెను;

నాటక మముద్రితమై దూర దేశంబున నిక్షిప్తమై యుండుటవలన కవి యెంత పటిమ దన పూనికను నెఱవేర్పగలిగెనో కనుగొనుటకు సాధ్యపడదాయె. పురుషోత్తము దీక్షితు డను మఱియొక కవి తంజాపురాన్నదాన మహా నాటకమును వ్రాసెను. ఈ నాటకమునకు "సత్రమరల్" అను నామాంతరము గలదు. కైవారమునందు తాను రచించిన నాటక స్వభావమును బురుషోత్తమ దీక్షితు డిట్లు సూచించి యున్నాడు: "విజయరాఘవ నామ ధేయుండవై వెలయు నీవును, అనవరత శతలక్ష విప్రాభీష్టమృష్టాన్న ప్రదాతలు గావున సకల జన శ్లాఘాపాత్రంబగు నీదు సత్రంబున భుజియింప జేంచేసిన......తదీయారాధనంబు నతి హర్షంబున పురుషోత్తమ దీక్షితుండు...శృంగార హాస్యరసాద్భుత రసప్రధానంబుగా" తంజాపురాన్న దాన మహానాటకమును హావణించెనట. నాటకాంతమందలి,

"పారు లిరువురు సాని పడుతులతో గూడి కూరిమి నటించిరి నేరుపుల్ మెఱయ"

యను దరువు ఇతని శృంగార హాస్యరసముల నించుకంత రుచి చూపుచున్నది. తంజావూరి ఆంధ్రరాజుల చరిత్రయందు విజయరాఘవుని యన్నదానమును గూర్చిన కథ యొకటి కలదు. సంగ్రహముగా నాకథ ఇది. ఒక యేడు ముసురుపట్టి వర్షము సంతతధారగా బహుదినముల పర్యంతము కురియ సాగినది. చుట్టుప్రక్కల దేశమునుండి రాకపోక లాగిపోయినవి. వంటచెఱకు బొత్తిగ లేకపోగా నగరి సత్రమున ప్రతిదినమును భుజియించు పండ్రెండువేల బ్రాహ్మణ్యమునకు వంటసాగకపోయినది. విజయరాఘవుని కడకుపోయి సత్రాధికారు లావిషయము విన్నపము జేసిరి. నగరిలోని ప్రాత కట్టడముల నిడియ గొట్టించి యందలి కలపసామానుతో వంట సాగింపుడని యత డాజ్ఞ జేసెను. ఆ కొయ్య సామానంతయు మూడు దినములలో ముగిసి

నది. మరల సత్రాధికారులు విజయరాఘవునికి విన్నపము సేయగా నతడు
నగరి బొక్కసములోని వస్త్రములను బయటవేసి నగరిలోనివి బజారులోనివి
నూనె నేతికుండలను దెప్పించి వస్త్రములను చమురున దడిపి రగులబెట్టి వంట
చేయున ట్లాజ్ఞాపించెను. వంట ఎంతసేపటికి కాకపోవుటవలన బ్రాహ్మణ
భోజనమునకు జాల ఆలస్యమాయెను. అంత దనుక విజయరాఘవుడును నగరి
జనమంతయు భోజనము సేయక ఉపవాసముండిరి. పురుషోత్తమదీక్షితుడీ
కథనె నాటకముగ రచియించెనేమొ. విషయము పరిశోధనీయము.

మధుర సంస్థానమునను యక్షగాన రచన కొంత సాగినది. విజయరంగ
చొక్కనాథనాయకుని యాస్థానాశ్రితకవులలో నిద్దరు యక్షగాన కర్తలు
గలరు. కుందుర్తి వెంకటాచల కవి ద్రాక్షపాకముగ బహు నాటకములను రచి
యించెనట. కాని ఇతని నాటకములలో నొక్కటియైన నేడు కానరాదు. బాల
సరస్వతిమఖి మనుమడు, వెంకటాధ్వరి కుమారుడు, తిరుమలకవి చిత్రకూట
మాహాత్మ్యమను నాటకమును 'విద్యలమాఘిగన్న కవులెన్న'-'వచన చమత్కార
వైఖరి మీఱ' 'నర్తనయోగ్యముగ' రచనజేసెను. సంగీత సాహిత్య చతురు
డగు విజయరంగ చొక్కావనీ రమణుడు కర్ణభూషణములు కరభూషణములు
స్వర్ణాంబరములు సరిపెణలు తాళియందలము అగ్రహారాది ఘన బహుమాన
ముల నిచ్చి సత్కరించెనట. చిత్రకూట మాహాత్మ్యనాటకమున వర్ణింప
బడిన కథ తంజావూరు సరస్వతీపుస్తకభాండాగార పట్టికయం దిట్లు
సంగ్రహింప బడియున్నది. "సర్వేశ్వరు డొక్కనాడు ప్రమథగణంబుల
గూడి కొలువుండి వారిని పార్వతి జాడయడుగ వార లామె చిత్రకూటమున
తిల్లయను పేరునుగాంచి యున్నదనిరి. అప్పు డీశ్వరుడు పల్లవాధర నిపుడు
చూడక సొంపు సంధిల్లదు, ఆమె నాట్యమున దన వన్నెవాసి ధరణిలో
బొగడ నన్నెడబాసి యొంటిగా దిల్లవనిని బొందె. అల వాలుగంటిని
తలచుకొంటిని యని వేటాడునెపమున నటుకు వెడలి యచటి నాల్గు దినంబు

లుండి పార్వతిని గలిసి తమకుండనపు మేడకు" వచ్చెను. చిత్రకూట మాహాత్మ్యమునకు "తిల్లగోవిందరాజ నాటకము"ను నామాంతరమున్నట్లు తోచుచున్నది.

తంజావూరు నాయకరాజ్య స్థాపనతో యక్షగాన చరిత్రయందొక నూతన యుగము ప్రారంభమాయె నని యంటిని. యక్షగానములు బహుళముగ నాయకయుగమున వ్రాయబడుటయె కారణముగ పలికిన మాట కాదు ఇది. తంజావూరి నాటకకర్తల మూలమున యక్షగానస్వరూపము చాల మారినది. ఈ మార్పు ద్వివిధములైనది. నూతన రచనముల ప్రవేశ పెట్టుటవలన గల్గిన మార్పు కొంత; నాటకరచనపద్ధతి యందు గల్గిన మార్పు మఱికొంత. ఈ ద్వివిధములైన మార్పులవలనను యక్షగానము రూపాంతరమందినదని చెప్పవచ్చును.

ఆంధ్రభాషయందుగల యక్షగానములలో నెల్ల సుగ్రీవ విజయము ప్రాచీనతమమైనది; ఈ సుగ్రీవవిజయ రచనబడి వ్రాయబడినవి విష్ణుమాయా విలాస నాటకాదులు కొన్ని కలవు గాని యవి యర్వాచీనములు. సంవిధానము ప్రాతదైనను, నందు గన్పట్టు నూతన రచనములు వాని యర్వాచీనతను జాటుచున్నవి. కావున వానినిగూర్చిన ప్రసంగమున కిచట తావులేదు. మొదటి మార్పు నించుక విచారింతము: "యక్షగానమందలి ప్రధాన గేయ రచనములు దేశి రచనలగు రగడలలో గొంత మార్పు జరిపి—త్రిపుట, జంపె, ఏక, అట, అను తాళముల కనుగుణముగా గల్పింపబడినవిగా గానవచ్చును. అప్పకవి రగడ రచనములను తాళముల పేర పేర్కొనెను. కాని వానికి పేరులు వేఱె తెలుపలేదు. పై పేర్కొన్న యీ రచనములే కాక యక్షగానములలో నింకను ననేకవిధములైన దేశి రచనలు చేరినవి. ఏలలు, జోలలు, సువ్వాలలు, ఆరతులు, ధవళములు, చందమామ సుద్దులు, వెన్నెల పదములు,

విరాళి పదములు, తుమ్మెద పదములు, కోవెలపదములు, చిలుక పదములు అల్లోనేరేళ్లు, సీస కందార్థములు, త్రిభంగులు, ద్విపదలు త్రిపదలు, చౌపదులు, షట్పదులు, మంజరులు, జక్కులరేకులు మొదలగునవి" అని ప్రభాకరశాస్త్రిలవారు వ్రాసిరి. పై పేర్కొనిన రచనముల జాబితాను ఇప్పుడు మనకు లభించిన ముద్రితాముద్రిత యక్షగాన నాటకముల నన్నిటి బరిశీలించి చూచి తయారు చేసిరో లేక యక్షగానమం దివి యుండునని యూహించి గణుతి పెట్టిరో తెలియదు. పరిశోధించి చూచినగాని నిజమేర్పడదు. మఱియు యక్షగాన పరిణామమును చారిత్రదృష్టితో జూచిన నీ రచనము లన్నియు యక్షగానములం దాద్యమునుండియు గానవచ్చునని యెంచుటకు వీలులేదు. ఇందన్ని కాకపోయిన గొన్నియైనను కాలక్రమమున యక్షగానములందు పొడచూపినవని చెప్పవలసియుండును. ఒక యుదాహరణము. కందార్థము ప్రాచీన యక్షగానములందు లేదు. ఆధునిక యక్షగాన కర్తల రచనలయం దిది బహుళముగ గానవచ్చుచున్నది. ప్రభాకరశాస్త్రిలవారు లెక్కపెట్టిన రచనలలో ననేకములు సుగ్రీవ విజయమున లేవు. ఇందు కానవచ్చునవి: ఉత్పలమాల 1. సీసము 2. తేటగీతలు 4. కందము 1. మఱియు రగడ వికారములని యప్పకవి చెప్పు త్రిపుట, జంపె, కుఱుచ జంపె, అట యేకతాళములును, విలధవళార్ధచంద్రికలును ద్విపదలును వచనములును గలవు. ద్విపద యన్నింటికంటె దఱచుగ వాడబడినది. వచనములు చిన్నవి; ముఖ్యముగ పాత్రల ప్రవేశములను తెలుపుటకును, నాటక కథలోని సంధులను వివరించుటకును ఉపయోగింపబడినవి. తాళములు పేర్కొనబడినను రాగముల ప్రస్తావన లేదు.

తంజావూరి నాటకములలో నిప్పటివఱకు మూడే ముద్రితములై ప్రచారమునం దున్నవి. విజయరాఘవునివి రెండు: రఘునాథాభ్యుదయము, విప్రనారాయణ చరిత్ర; రంగాజమ్మ మన్నారుదాసవిలాస మొకటి.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
P.R.I.
Acc. No.

వీనిని పరిశీలించి చూచిన యప్పటి యక్షగాన రచన విధానము గొంత తెల్లము గాగలదు. విజయరాఘవుని రఘునాథాభ్యుదయ నాటకమునందు గీత సహిత సీస మొక్కటియు గందపద్య మొక్కటియు గలవు. సంస్కృతశ్లోక మొకటి ప్రాకృతశ్లోకములు రెండును గన్పట్టుచున్నవి. విప్రనారాయణ చరిత్రయందు సీసపద్యములు రెండును కందములు నాల్గును గానవచ్చుచున్నవి. ఇవిగాక ద్విపద, మంజరి, జతి, అష్టకము, చూర్ణిక, యేల మున్నగునవి యీ రెంటి యందును వాడబడియుండు అన్యవిధ రచనములు. రంగాజమ్మ మన్నారు దాస విలాసము వీనికంటె పెద్దది. అందు పద్యసంఖ్య యధికము. మన్నారు దాస విలాసము తన్నామ పద్య ప్రబంధమునకు నాటకీకరణమగుటవలన నేమొ పద్యము లిందధికముగ బ్రవేశించినవి. పద్య ప్రబంధమునకును నాటకమునకును సామాన్యములైన పద్యములు గలవేమొ పరిశీలింప దగియున్నది. ఇందు పందొమ్మిది సీసపద్యములును, విడి గీతములు రెండును, కందములాఱును మత్తేభ విక్రీడిత మొక్కటియు, చంపకమాల యొక్కటియు, లయగ్రాహులు రెండును మొత్తముమీద ముప్పదియొక పద్యములున్నవి. సంస్కృత శ్లోకములు మూడును, చూళిక, డిండిమ, రూపక, తాళ, వర్ణములును, అపభ్రంశ, ప్రాకృత, పైశాచి, శౌరసేని, మాగధి, దేశి మున్నగు ప్రాకృత శ్లోకములును గానవచ్చుచున్నవి. ద్విపద, మంజరి ద్విపద, దరువు, పదము, చూర్ణిక, సువ్వి, జోల, శోభనము, ధవళము మొదలగునవి ఇతర విధ రచనములు. వీనిని సుగ్రీవ విజయముతో బోల్చిచూడ వీనియందు పెక్కింటికందు తావులేదు. తంజావూరు నాటకములలో ప్రధాన రచనములైన దరువు పదము మొదలగునవి యందు గానరావు. మఱియు సుగ్రీవ విజయమున పాడ గానరాని రాగములు తంజాపుర నాటకములందు గానవచ్చుచున్నవి. ఇందు ఆహరి, ఉసేని, కన్నడ, కళ్యాణి, కురంజి, (కురవంజి), కాంభోది,(ఎఱుకల, యదుకుల)కాంభోజి, గుమ్మకేదార, కేదారగౌళ, కేదారిపంతు, ఖాబి

(బాబి), గౌడిపంతు (గౌళిపంతు), ఘంటారవము, తోడి, నటనారాయణి, నాగగాంధారి, పంతుపరాళి, పూరిచి, బిలహరి, భైరవి, మధ్యమావతి (మధ్యమాది) మనోహరి, మారువదన్యాసి, ముఖారి, మోహన, రేవగుప్తి, లలితపంచమము, శంకరాభరణము, శుద్ధసావేరి, సామ, సామంత, సారంగ, సావేరి, సాళగసౌరాష్ట్రి, సైంధవి, సౌరాష్ట్రి మొదలగు రాగములును, అట, ఆది, ఏక, జంపె, (ఝంప) త్రిపుడ, రూపక, విజయభూషణ తాళములును వాడబడినవి. వీనిని సుగ్రీవ విజయమందలి రచనములతో బోల్చిచూచినదాని కిని తంజావూరు నాటకములకును నెంత వ్యత్యాసము గలదో తెలియగలదు.

నూతన విధరచనముల ప్రవేశపెట్టుట యొక్కటియె కాదు తంజా వూరివారు చేసిన మార్పు; నాటకరచన విధానమునను మార్పులను దెచ్చి పెట్టి యక్షగానమును గ్రొత్తదారికి ద్రిప్పిరి. ఈ మార్పులకెల్ల ప్రధానకార కుడు విజయరాఘవనాయకుడు. అతడు కవిమాత్రుడు గాడు. సంస్కృ తాంధ్రముల జక్కగ నెఱిగిన విద్వాంసుడు. ముఖ్యముగ సంస్కృతనాటక లక్షణమును అవగాహన జేసికొనిన రసికశిఖామణి. యక్షగాన రచనము నందంతవఱకు వాడుకయందుండిన పద్ధతి యతనికి నచ్చలేదు. యక్షగానము నకు ప్రధాన లక్షణములగు నృత్యగీతాదులను వర్జింపక సంస్కృత నాటక ముల త్రోవను నడపిన నది వాసికెక్కునని తలచెను. కావున నితడు స్వవిర చిత యక్షగానములలో గొన్ని క్రొత్తదారుల ద్రొక్కెను. విజయరాఘవుని నాటకము లన్నియు నతని యిష్టదైవమగు మన్నారుగుడి రాజగోపాల స్తుత్యాత్మకమైన

భోజకన్యా ముఖాంభోజ మరాళ
సత్యాఘన స్తన స్తబక భృంగ
జాంబవతీ విలోచన చకోరశశాంక
మిత్రవిందాతటిన్మేఘరూప
భద్రావశావశ భద్రదంతావళ
వరసుదంతా మనోవన మృగేంద్ర
లక్షణారూపకలాపినీపర్జన్య
భానుసుతాలతాపారిజాత

షోడశ స్త్రీసహస్ర చక్షుః ప్రసార
హార సారమసార మోహన శరీర
విజయరాఘవ భూపాల భజనలోల
కేళిమోదిచ్చెద రాజగోపాలనీకు.

అను సీసపద్యముతో నారంభమగును. ఇందు విశేషమైన మార్పే మియులేదు. సుగ్రీవ విజయమును ఇట్లే దేవతాస్తోత్రములో ప్రారంభ మగుచున్నది; కాని యందు కవియొక్క పేరులేదు, ఇందున్నది. మఱియు సుగ్రీవ విజయమునందు కవీశ్వరుడే కృతిపతిని కొనియాడి షష్ఠ్యంతములు జెప్పి తాను రచించిన యక్షగానమునకు కథాక్రమంబు వివరింప గడగినాడు. ఇది ప్రబంధపద్ధతి గాని నాటకపద్ధతి కాదు. విజయరాఘవుని కిది నచ్చలేదు. కావున నతడు దేవతా స్తోత్రమునకు వెనుక కైవారమును జొప్పించెను. కైవారమనగా స్తోత్రము. ఇది సామాన్యముగ గొప్పవారిముందు స్తోత్రపాఠ కులు పఠించు బిరుద గద్య. దీనికె బిరుదాంకమాలికయను నామాంతరము. దినదినమును వందులు తన మ్రోల సేయు కైవారమునకు గ్రొత్తయుపయో గమును గల్పించినాడు విజయరాఘవుడు. ఈ కైవారమును మేళగాండ్రనోట జెప్పించి వారి మూలమున స్వవిరచిత నాటక ప్రదర్శనమును బ్రకటించినాడు. చూడుడు—

"రాజగోపాలచరణారవిందభజనానందసాంద్ర, రఘునాథనాయక రత్నాకరావతీర్ణసంపూర్ణపూర్ణిమచంద్ర......చతుర్విధ కవితా నిర్వాహక సార్వభౌమబిరుదాంగవిరాజమానచరణాంభోజ, కవిసమాజభోజ, జనక చరణ రాజీవ సేవావిధాయక, విజయరాఘవనాయక, పరాకు! స్వామివారు హావ ణించిన విప్రనారాయణ చరిత్రంబను విచిత్రనాటకంబును నటపటిమ గనుపించ వినుపించేము. విన నవధరించవయ్యా! పరాకు! స్వామి, పరాకు!"

ఈ పద్ధతిని విజయరాఘవుని యాస్థానమున వర్ధిల్లిన నాటకకర్తలు బెక్కండ్రును, శహాజీ యాస్థానమందలి వారు కొందఱును, విజయరంగ చొక్కనాథుని యాశ్రితుడగు తిరుమల కవియు నవలంబించిరి; కాని

మన్నారు దేవుడు ప్రాత మార్గమును విడువలేదు. కామరుస వెంకటాద్రి ప్రాచీన నవీన మార్గముల రెండింటిని సమ్మేళనము గావించినాడు. నాటకాంతమున గొన్ని యెడల విజయరాఘవుడు భరతవాక్యమును జేర్చెను. ప్రహ్లాద చరిత్రము తుదనున్న యీ వాక్యము జూడుడు: "ఇవ్విధంబున ప్రహ్లాదునకు త్రైలోక్య సింహాసనము పాలించిన నృసింహస్వామి అచ్యుత విజయరాఘవ భూపాలునకు ఆయురారోగ్య అయిశ్వర్యాభివృద్ధిని ధనకనక వస్తువాహన సమృద్ధిని అఖండభూమండలాధిపత్యమును గలుగజేసి రక్షించుగాత!" తంజావూరి నాటకకర్త లందఱును విజయరాఘవుని మార్గమును బహుళముగ ననుసరించి తమ కృతులను భరతవాక్యములతో ముగించిరి.

కైవారము సంస్కృత నాటకములలోని నాంది ప్రస్తావనలకు సరియైనది. విజయరాఘవుని యనంతరము దంజనగరమున యక్షగాన రచనాపరాయణులైన మహారాష్ట్ర రాజు లతడు తీసినదారి పోవు గమ్యస్థానమును గుర్తించి కైవారమును విసర్జించి బహిరంగముగ దానికిబదులు సంస్కృత నాటకములందు వలె నాంది ప్రస్తావనలను జేర్చిరి. నటీ సూత్రధార పారిపార్శ్వకులను రంగస్థలము కెక్కించి ఋతువర్ణనలతో గూడ సంస్కృత నాటక సంప్రదాయమును సంపూర్ణముగ నవలంబించిరి. మఱి కొందఱు అంక విభజనముగూడ గావించిరి.

కైవార భరతవాక్యములు మాత్రముగావు యక్షగాన రచనయందు విజయరాఘవుడు తెచ్చిపెట్టిన మార్పులు. త్రిపుటాది తాళములు గేయములతోగూడ పూర్వమువలె జోడింపబడుచు వచ్చినను రగడను సంపూర్ణముగ విసర్జించి దాని స్థానమున దరువు పదము మున్నగు నూతన రచనముల బ్రవేశపెట్టెను. ఈ రచనములు, అందును ప్రధానముగ దరువు, తరువాతి యక్షగాన రచనలలో నెంత ప్రాముఖ్యమందెనో కనుగొంటిమేని ఈ మార్పు యొక్క ఆధిక్యము విశదము కాగలదు.

విజయరాఘవు డొనర్చిన మార్పులలో నెల్ల గడు ముఖ్యమైనది సంభాషణ. నాటక పాత్ర లొండొరులతో భాషించుట సంభాషణ యనబడుచున్నది. పాటకు బదులు పాటయు గీతమునకు బదులు గీతమును బాడుటయు

సంభాషణ కావచ్చును. విప్రనారాయణ చరిత్రయందు దేవదేవికిని దాని యక్కకును ఈరీతి సంభాషణ నడచినది:

చెల్లె: పందెము జెల్లెగదే, ఓయక్క, పందెము జెల్లగదే

అక్క: వీని కందువమాటల కరగించినపుడె నీ పందెము జెల్లె నే బంగారు చెల్లె

చెల్లె: వలపించ రాదంటివె, ఓ యక్క, వలపించరాదంటివే

అక్క: (అ) వలరాజునైనను వలపింప నేర్తువే, చెలి కలియుంగ రంభవు కావా నీవు

చెల్లె: నీ చిత్తము వచ్చునా, ఓ యక్కా, నీ చిత్తము వచ్చునా

అక్క: నీ చెల్వు చూచిన నిలువున కరగరె ఓ చెల్ల, భూచర ఖేచరులైనా.

ఇట్టి సంభాషణ సుగ్రీవవిజయమున లేకపోలేదు. కాని యీ రెంటి లోని సంభాషణలకును కొంత భేదము కలదు. విప్రనారాయణ చరిత్రలో నీచరణ మీపాత్ర పాడినదని కవి ప్రత్యక్షముగ జెప్పక నేరుపుతో అక్క, చెల్లెయను పదముల ప్రయోగములవలన దెలియబఱచినాడు. సుగ్రీవవిజయ మునం దట్లు కాదు. ముందు ఈ పాత్ర యీ గీతము పాడుచున్నదని వివ రించు వచనములేక అందు సంభాషణ నడువదు. చూడుడు:

"అని పలికి పగవ సమయం బిది కాదు. జానకిని సాధించుటకు మున్ను వీని పగతీర్తునని తలంచి సుగ్రీవునితో రామచంద్రుం డిట్లను చున్నాడు.

'నమ్ము సుగ్రీవ యింద్రనందను వధించి
నిఖిల వానరరాజ్యంబు నీకు నిచ్చు
వాడ మీలోన మీకును వైరమైన
కారణం బేమి యన బల్కె కపివరుండు'
అఘువర్తనుండు మాయావి యనియెడు వాడు
రఘువంశతిలక యొక రక్కసుడు గలడు..." ఇత్యాది.

ఇది ప్రాచీన యక్షగాన పద్ధతి. కావ్యములనుండి యెరవు తెచ్చుకొన్నది. పాత్రల కొండొరులతో వివరణపీఠిక లేని సంభాషణయే లేదు. నాటకప్రదర్శనమును జూచు ప్రేక్షకులకు అడుగడుగునకు నాటకకర్తకాని ప్రదర్శకులలో నొకడుగాని ముందుకువచ్చి కథను వివరింపవలసి యుండెను. విజయరాఘవున కిది గిట్టలేదు. ఈ ద్రావిడ ప్రాణాయామము విసర్జించి పై జూపిన పాత్రల నొండొంటితో ముఖాముఖి సంభాషింపజేసినాడు. పాటకు బదులు పాటను, పద్యములందును గీతములందును చరణమునకు బదులు చరణమును జెప్పుటను సామాన్యముగ సంవాదమందురు. అత్తకోడండ్ర సంవాదము, సవతులకొట్లాట మున్నగునవి యక్షగాన మెఱిగినవారి కందఱకు సుపరిచితములే. కాని సాధారణముగ సంభాషణ యనునది ఇట్టిది కాదు. పాత్రలు వాడుకగ జనులాడునట్లు పరస్పరము వచనమున భాషించు మాటలె సంభాషణ యనబడుచున్నది. ఇట్టి సంభాషణ విజయరాఘవుని నాటకములందును రంగాజమ్మ మన్నారుదాస విలాసమునను గానవచ్చుచున్నది. విప్రనారాయణ చరిత్రయందు విపులముగ వాడబడినది. ఈ సంభాషణయం దింకొక విశేషము గలదు; అందు ప్రయోగింపబడిన భాష పాత్రోచితమైనది. పాత్రల యంతస్తులకుదగిన భాషనే వారిచే బల్కించినాడు నాటకకర్త. మఱియు బాత్రోచిత భాష నెపమున నాటక పాత్రలచే సంస్కృతాంధ్ర కర్ణాటక భాషల సంభాషింపజేసినాడు. విప్రనారాయణ చరిత్రనుండి—సంస్కృత సంభాషణ కొక్క యుదాహరణము:

విప్ర: హేతరుణి! కిమేత దత్రాగమనం? కిమావాసస్థానం? కిం భవదీయం నామధేయం? కాషాయాంశుకాది విశేష వేషధారణం కిం కారణం? కిమేతాదృశ దీనతయా? మయా యాదవ శశాంక కింకరేణ తవ కిం కరణీయం? తావకీనం కథయ వృత్తాంత మఖిలమ్.

దేవదే: ఆకర్ణయ మాని జనవరేణ్య. దేవదేవీ నామ్న్యహం దేవదాసీ. లోభాది దుర్గుణసమేతాం మాతరం విహాయ వైరాగ్యేణ సమాగత్య భవద్దివ్య సందర్శనంలబ్ధ్వా స్వామినాం చరణారవింద సేవాం కరోమి. కరుణా కటాక్షవీక్షణేన పరిరక్షణం కర్తవ్యమ్.

ఆంధ్ర సంభాషణ

తలారి: స్వామి! యీ తూరుపు తేరిదాంక హలకులిశ రేఖలుగల యడుగులజాడ కన్పించుచున్నది. గాని మానుసులు నడిచిన అడుగులు కానరాదయ్యా!

అధికారి: అటువంటి యడుగులు గోపాలునికిని విజయరాఘవ భూపాలునికేగాని యితరులకు లేవుగదరా! చోరుని యడుగులెత్తమంటె నవనీతచోరుని యడుగులున్ను యతనికుమారుని యడుగులున్ను కంటినంటా వచ్చేవు. మాకన్న నీవె భాగ్యశాలివిరా!

కర్ణాట సంభాషణ: (రఘునాథాభ్యుదయమునుండి:)

కస్తూరి మాట: ఏనయ్య రంగయ్య ధర్మాసన మొదలాద లెక్క సముఖదల్లి హేళిదెల్ల తాణు వెలి. అవరవరు హిడిదలంచ, పరిధావన హేళ బేడాయందు నినగె అవరవరు ప్రియ హేళిద్దు నానరియనే?

అత్తువణ రంగయ్య: నీ నేను బల్లెయయ్య! అంథాద్దు ఉంటాదరె రూపిసు. రేనుబగుళు లిద్దియ?

అరవసంభాషణ: (విప్రనారాయణ చరిత్రనుండి:)

పూజారి: ఓహోహో! యిదెన్నాడా! యిదెన్నాడా! పంచపాత్రం గళిశే వొరుపొన్ను కిణ్ణియె కాణోం. మోశం వందుదే, అడకూరత్తాళ్వారే!

కూర; అడియేన్.

పూజారి: అడ యెంబెరుమానే!

ఎంబె: అడియేన్.

పూజారి: అడ పరాంకుశా!

పరాం: అడియేన్.

పూజారి: సన్నిధియిలే వొరు పొన్నుకిణ్ణం యేన్ కాణోం? యిదెన్న పిళ్ళాయ్?

పరాం: యిదెన్నమయ్యా, నమ్మెకేళ్ కుక్కిరీర్? నాంగళెల్లా దేవరీర్ పిరిఘే అన్నో వందోం?

ఈ సంభాషణ సందర్భానుసారముగ పాత్రల మాతృభాషల కనుగుణముగ నాంధ్ర, కర్ణాట, ద్రావిడభాషలయందు కలసియైన నుండవచ్చును.

రఘునాథాభ్యుదయమునందును, విప్రనారాయణ చరిత్రయందును ఇట్టి పట్టులు కొన్ని కలవు. కాని పాత్రోచిత సంభాషణను చాతుర్యముతో నడుపుటలో విజయరాఘవునకు రంగాజమ్మయంతటి సామర్థ్యములేదు. ఆమె సంభాషణలందు పాత్రోచిత భాషను వచనచమత్కారముతోడను హాస్యరసముతోడను మేళవించినది. వినుడు ముత్తైదువుల మాటలను:—

రంగావొఝ్ఝుల తిమ్మక్క: యేమెవ్వా ప్రోలుభట్ల యల్లమ్మ, నగరింటి పెండ్లినాడయినా వొక వక్కబ్రద్ద వేసుకొని నములరాదవషవో.

యల్లమ్మ: అవునషే రంగావొఝ్ఝుల తిమ్మక్క. నాకు వక్కబ్రద్దా వొక్కటి కొదవా? చాలుచాలు. నిన్న మావారు సుక్కురారం సంతలో పిండికూరకంచున్ను గానుగపిండి దెచ్చిరి. పెండ్లివందిట్లో నోరు మెదిలించవలెనంచున్న యింత దెచ్చుక తించున్నా నింతే.

తిమ్మక్క: ఔా! పొరుగింటి తిమ్మావధానుల పెండ్లాం పీరమ్మ పాటలు బాడుచున్నది. అంటుకొని నీవు పాడ్రాదషవో.

యల్లమ్మ: యిండేదో నీవు నాగపసానివై పెద్దతనం చేసుక వుండేదానవున్నా, కడమవారు పాటలు బాడేవారూనా?

విద్వాంసుల వివాదము నింతంబె బసందుగ వర్ణించినది:

మల్లుభట్లు: అవునోయి యెషుకుంట్టి భ్రాంత్తుండయినా యిషువలె భ్రమకొనునా? భుజి ధాతువుకు అనుభవ మర్థమని యెషువలె చెప్పాచున్నావోయి?

ఇంకొక పండితుడు: వజ్రకుంఠ మల్లుభట్టిగాండు యేమోయి అనే అట్టు అయనా నా బ్రతుకు?

మల్లు: యిషువంటి బ్రహ్మిష్ఠో బ్రహ్మకొడుకును యేమోయి అనవచ్చునా!

ఇంకొక: వోరి! నీవలె వృభయతోబట్టి ప్రాయశ్చిత్తం జేసుకోక వుంటినషరా?

మల్లు: వోరి! నీవు పుట్టి మూండాయిత్తారాలులే. నిన్నటి సుడుపడవు. నావంట్టి యోగ్యుణ్ణి జూచి యేమి వదరేవురా శునకంవలె. పాదరక్షలు తీసి రెండు ప్రహరింత్తుమో.

ఇంకొక: వోరి వృద్ధగార్దభమా! నోరుగలదంచున్న నెత్తినోరు బెట్టుక కూయవచ్చినాండవు. కపోలతాడనము సేతునో. త్వమేవ గార్దభః, త్వమేవ శునకః, త్వమేవసూకరః.

వాకిటి గొల్లల సంభాషణయందు హాస్య మింతకంటె బహిరంగముగ వ్యక్తమగుచున్నది.

ఒకగొల్ల: వోరె! వోరె! చిన్నబొమ్మ, యీడ యేంట్టిరా గుంప్వు?

మఱొకడు: వోరె! పీండ్లె విద్యావన్తులురా.

ముకుటివాడు: వోరె! నిత్యావస్తులా, అయితే నామీద వొక పదం వింద్రా,

"కూలనమ్మ పెద్దకొడుకు గొల్ల మల్లుగాండు,
బోనపుటీక యిరుచక తినెరా పోతురాజువలెను."

ఒకగొల్ల: వోర! చినమల్లుగ! అల్లవాండె మద్దెల కొరుకుతా వుండ్డాండె తమ అబ్బడి తరమా!

మఱియొకడు: వోరె! వోరె! అల్లవాండు నాగసరం మింగ్గుతా వుండ్డాండు గొంత్తున బడెనేమొ చూడర!

సంభాషణవలన యక్షగానమందలి జడిమపోయి చైతన్యమబ్బినది, వాస్తవికత యేర్పడినది. నాట్య, గేయ ప్రధానమైన యక్షగానము నాటకముగ పరిణామమందినది; సంగీత నాట్య శాస్త్రవేత్తలకేగాక జనసామాన్యమునకుగూడ గ్రాహ్యమగుటవలన నెల్లవారి యాదరాభిమానములకును పాత్రమైనది. ఇదియె విజయరాఘవుని సంస్కారములకు ఫలితముగ యక్షగానమునకు గలిగిన మేలు.

రంగాజమ్మ నాటకమందు ఒకక్రొత్తవిశేషము గన్పట్టుచున్నది. రాజచంద్రుని పుత్రికకు, మన్నారుదాసునిజూచి వలవంతచే గుందుచుండిన కాంతిమతికి, సోడె చెప్పుటకు ఎఱుకత నగరు ప్రవేశించినది. ఇదియె యక్షగాన రంగస్థలమునకు యెఱుకతయొక్క ప్రథమాగమనము. తరువాతి యక్షగాన రచనలం దీయెఱుకత యెంత ప్రసిద్ధికెక్కెనో మహారాష్ట్ర రాజులనాటి నాటకములను దిలకించిన తెల్లము కాగలదు. తన్మూలముననె కొరవంజి యను నూతనవిధమైన యక్షగాన రచనము బయలు వెడలినది.

యక్షగాన రచయిత లెవ్వరును కథాసంవిధానమున నేర్పు జూప లేదు. ఏ పురాణగాథనో స్థలమాహాత్మ్యమునో యనుసరించి నాటక రచన గావించిరి. ఒకవేళ యెందేనియు నూతన కల్పన గానవచ్చినను, నందు నవీనత యుండదు. రఘునాథాభ్యుదయమునను మన్నారుదాసవిలాసమునను నాయికల యుదంతములు కవి కల్పితములే. కాని యవి పూర్వ గ్రంథములనుండి సంగ్రహించినవే కాని క్రొత్తవి కావు. చక్కగ విమర్శించి చూచితిమేని రఘునాథాభ్యుదయనాయిక చిత్రరేఖకును మన్నారుదాసవిలాస నాయిక కాంతిమతికిని సన్నిహిత జ్ఞాతిత్వము గలదు. పేరులు వేఱుగాని కథ యొకటియె. ఇద్దఱును పురవీథుల నూరేగు నాయకునిగాంచి మోహింతురు; తమ వలపును దెలుపుచు వర్తమాన మంపుదురు; నాయకుడు వారి ప్రార్థన నంగీకరించును; తరువాత యిద్దరును దమ నాయకుల గలియుదురు. ఇది చిరపరిచితమైన కథయె కాని క్రొత్తది కాదు. విప్రనారాయణ చరిత్రయు బురాతన గాథయె; కాని విజయరాఘవుడం దొక మార్పును సాహసించి చేసినాడు. వైష్ణవ గ్రంథముల ప్రకారము విప్రనారాయణముని వర్ధిల్లినది చోళరాజుల కాలమున శ్రీరంగమునందు. ఈ నాటకమునందు విప్రనారాయణుని దన కాలమున దన యేలుబడియందలి మన్నారు గుడియందు రాజగోపాలస్వామి సన్నిధియం దుండినట్లును బంగారుగిన్నె కథ యచటనే నడచినట్లును దా నా విషయమును విచారించి వైష్ణవాపచార భయముచే నతని శిక్షించుటకు సందేహించుచుండగా శ్రీరాజగోపాలదేవుడు ప్రత్యక్షమై నిజమెఱిగించి విప్రనారాయణుని గారవించి, 'ఈ యుపచారయోగ్యునివల్ల నపచారపడక సైరణ బూనితివి గనుక నీవు మా దయకు పాత్రుండవైతివి' అని యానతిచ్చినట్లును వర్ణించినాడు. విప్రనారాయణచరిత్రమునందు పరిష్కర్తలు చెప్పినట్లు, 'కవియొక్క స్వాతంత్ర్యము హద్దుమీఱి నడచిన దనుటలో సందేహములేదు.' కాని, 'కవులు నిరంకుశులుగదా' యని యబ్బురపడుటకంటె విజయరాఘవు డీ మార్పు నేలచేసెనో విచారించుట యుక్తము. విజయరాఘవుడు పరమవైష్ణవుడు. తాను 'వైష్ణవ పక్షపాతము'గలాడనని యాతడె వర్ణించియున్నాడు. వైష్ణవాపచారము సహింపడు. వైష్ణవ గాథలందు చోళరాజు విప్రనారాయణుని శిక్షింప నాజ్ఞాపించినాడు,

"......యప్పుడా రంగవిభుని
తీర్పరిం బిలిచి చేతికినిచ్చికనలి
యీ చోరునకు నాజ్ఞయేది శాస్త్రంబు
చూచి సేయింపు డచ్చుగ మీ రటంచు
డెలియ విద్వాంసుల దిక్కు వీక్షించి
పలికిన......"

ఆ చోళరాజు స్థానమున దానె యుండిన నట్టి వైష్ణవాపచారము జరుగనిచ్చి యుండడ నని తెల్పుట కీ మార్పును జేసియుండవచ్చును. సరి, శ్రీరంగముననే పైకథ నడిచిన ట్లేల చెప్పరాదు? అను ప్రశ్న కలుగవచ్చును. కాని దీనికి సమాధానము సులభము. శ్రీరంగము విజయరాఘవుని యేలుబడిలో లేదు; అది యప్పుడు శత్రులైన మధుర నాయకరాజులకు జెల్లుచుండినది. వైష్ణవగాథలలో నున్నట్లు శ్రీరంగమునందె విప్రనారాయణ చరిత్రనడచినట్లు రచించిన విప్రనారాయణుని తప్పిదమును దాను విచారించి తీర్పు సేయుట పొసగదు; తత్కారణమున శ్రీరంగమునుండి విప్రనారాయణుని కథారంగమును మన్నారు గుడికి మార్చెను; కావున విజయరాఘవుని వైష్ణవ మతాభిమానమె ఈ మార్పునకు కారణము.

కథాకల్పన యెట్లున్నను తంజావూరు నాటక కర్తలు పాత్రపోషణ యందు గొంత శ్రద్ధ చూపియున్నారు. ఇందును ప్రధానపాత్రలకంటె క్షుద్రపాత్రలయందు జీవకళ యధికతరముగ తొలకాడుచున్నది. రఘునాథ నాయక మన్నారుదాసు పాత్రలకంటె నర్తవణ రంగయ కస్తూరులును, మల్లుభట్లు గొల్లమల్లుగాడును, చిత్రరేఖ కాంతిమతులకంటె పారోహిత ముత్తైదువులును నెక్కుడు చైతన్యముగలవారలై పాఠకుల హృదయసీమల స్థిరముగ నెక్కొనుచున్నారు. దీనికి కారణము లేకపోలేదు. ప్రధానపాత్రల నిర్మించునపుడు కవులు అలంకారశాస్త్రోక్తాదర్శనాయకనాయికా చిత్రముల ముందుంచుకొని తదనుగుణముగ వారిని దిద్ది తీర్చినారు; క్షుద్ర పాత్రలను సమకాలిక మానవ సమూహమునుండి గ్రహించినారు. ఉత్త మాధమ పాత్రలకుగల తారతమ్యమున కిదియె ముఖ్యకారణము.

## ప్రకరణము. ౬

### గీతము

యక్షగానము నాట్యగీత ప్రధానము గదా; కావున యక్షగానముతో పాటు నాయక యుగమున గీతమభివృద్ధినందుట వింత కాదు. విజయరాఘవుడు,

"గోపాలునకు వేడుకోలు విన్నపములు
దరువులొనర్చు నౌదార్యధుర్య
యేలలు విడి పదాల్ హెచ్చు సంకీర్తన
లధ్యాత్మలొనరించు నతులచర్య
వాల్వచి గుజ్జరి ఖిల్వేడు దండులా
స్యము కందుకక్రీడ యల్లికయును
కోలవంజి శుభలీల గుజరాతి దేశిచౌ
పదము జక్కిణి దురుపదము మదన
పద దూత్యమును జోగి పదచాళి శారదా
సామ్రాజ్యమును చిందు సవలిమచ్చ
రంబులు నాట్యకదంబులు మొదలైన
నాట్యముల్ హావణించు నవరసజ్ఞ."

యని ప్రహ్లాద నాటక కైవారమున సంబోధింప బడినాడు. విజయ రాఘవుడు పై పేర్కొనిన రచనముల నేర్పరియైనను వానిలో నెక్కంటి స్వరూపమిట్టిదని కనుగొనుటకు సాధ్యముగాదు. వేడుకోలు విన్నపములు వచన రచనములు కావచ్చును. విన్నపము విప్రనారాయణ చరిత్రయం దొక చోటగలదు.

"రుక్మిణీ ప్రాణవల్లభ! ద్రౌపద్యభిమాన రక్షక! గజేంద్రవరద! అహల్యాశాపవిమోచన! కాళియఫణిఫణారంగనాట్యలీలావినోద!" ఇత్యాది.

దరువులు, యేలలు, పదములు, సంకీర్తనలు, అధ్యాత్మ కీర్తనలు మున్నగునవి మన గీతాసారస్వతము నెఱిగినవారికి సుపరిచితములే. తక్కిన వాల్వచి, గుజ్జరి, ఖిల్వేడు, దండు, లాస్యము, కందుకక్రీడ, అల్లిక, కోలవంజి శుభ (? క) లీల, గుజరాతి, దేశి, చౌపదము, జక్కిణి, దురుపదము, మదన

పదదూత్యము, జోగి, పదచాళి, శారదాసామ్రాజ్యము, చిందు మొదలగునవి నాట్యభేదములు. నాట్యభేదముల ప్రస్తావన సాహిత్య విచారమునం దేల యన, నొక్కొక విధమైన నాట్యమును ప్రదర్శించునప్పుడు నొక విధమైన పాటను నాట్యమున కనుగుణముగ నర్తకులు పాడువారు; ఈ యంశ మీ క్రింది యుదాహరణమువలన తెల్లమగుచున్నది. కొఱవంజి నాట్య మన్నాడు విజయరాఘవుడు; క్రింది పద్యమునందు ఈ నాట్యము సేయునప్పుడు పాడు పాటలుగూడ చేర్కొనబడినవి :

ఎఱుకో ఎఱుక యటంచుం
గొఱవంజి నటించె నొక్క గురుకుచ చంకన్
బురకడు బంగరు బుట్టియ
సొరిదిం గొల్లాపురమ్మ సుద్దులు వెలయన్.
తరకట బురకటగాదే
తరుణీ నామాట నీకు దార్కాణగ నే
బురకనికి బువ్వదేవే
యెఱుకడగవె యంచు నొక్కయింతి నటించెన్.

రంగాజమ్మ మన్నారుదాసవిలాస నాటకమున గొఱవంజి నృత్యము సేయునపుడు పాడు వచన మొక్కటి కలదు.

"యెరుఖాడు గెరుఖాడు గెరుఖాడు గేదుండి
నీవుతలంచిన తలంపు నీవుతలంచిన తలంపు
నిజముగా శెప్పెనే శెప్పెనే నిక్కముగా శెప్పెనే
తార్కాణగా శెప్పెనే, తార్కాణగా శెప్పెనే, దుండి
అమ్మాయమ్మ అమ్మాయమ్మ యీ బురుకనికి
యీబురుకనికి బువ్వదేవే, బువ్వదేవే
అవ్వ గురిసూడ మొరంబెలో ముత్యాలు దేవే, దుండి."

ఇత్యాది.

త్వరకవి రామకృష్ణయ్యగారి వీరభద్రనాటకము నుండి కొఱవంజి పాట : 'రారే! నా యెఱుకవిని పోరే చెలియలార చెలియలార
వారిజాక్షులార చెలువారా చెప్పెగాని చెప్పెగాని,

రాజాధిరాజులకు రాజయోగులకు
తేజోల్లసద్వైతులాకు తేటపఱచేగాని పఱచేగాని'

ఇత్యాది. దేశియనగా నాయాదేశజనులకు హృదయరంజకముగానుండు ప్రత్యేకసంగీతము (సంగీతములో నేలోక భేదమార్గము) అని సూర్యారాయంధ్ర నిఘంటుకర్త లర్థముజెప్పి, శబ్ద కల్పద్రుమమునుండి

"త త్తద్దేశస్థయారీత్యా యత్స్యాల్లోకానురంజనం
దేశేదేశేతు సంగీతం తద్దేశిత్యభిధీయతే."

యను శ్లోకము నుదాహరించినారు. దీనిని నాట్యము సల్పు పాత్ర యిట్లు వర్ణింపబడినది.

"అజినంబు చెఱగుగా నభినయించుచు దేశి
పాత్రయై యొకప్రేత పాత్రలాడు."

రంగాజమ్మ దేశికొక యుదాహరణము నిచ్చియున్నది.

త్రిభువనకర్తార తుమం ధణే సుదాతారు గాణలయకారు
సమరహాళబ్బోళదుసేదారు మహోదారు మన్నారు.

చౌపదమనగా గిలకల పద్యమని యర్థము చెప్పినారు సూర్యారాయ నిఘంటు కర్తలు; దాని రూపమెట్టిదో వివరింపరైరి. ఈ నాట్యవిధ మీక్రింది సీసపాదమువలన కొంత తెలియవచ్చుచున్నది:

"దంతిదంతమ్మలాతముగ ద్రిప్పుచు నాడు
చౌపదంబులకు బిశాచ మొకటి"

అనగా జౌపద నర్తకుడు చేత మండుచుండు కొఱవిని త్రిప్పుచు నృత్యము సేయువాడని తోచుచున్నది. ఈ నాట్యము సేయునపుడు పాడు పాటయే చౌపది.

చౌపదమునకు ఉదాహరణము:—

1. సతత భక్తియుత సన్ముని జాలా
కృతనుతులను రాగిలు పృథుశీలా
కృతయుగమునను సుకృతమయి లీలా
శ్రీలివృషగిరి యనజెలగును జాలా.

2. సీతావరుదూర్జితముగఁ జేరఁగ
        రీతిగనిన వారినిబోల్పారున్
త్రేతను హరిని ధరించిన చారు
        ఖ్యాతిని గరుడనగంబన మీఱున్.
3. వెలయు జవ్వనపు వ్రేతలపొందుఁ
        గలిగిన కృష్ణునికత లెంచెందు
దళము కొనఁగ నగు ద్వాపరమందు
        నలశేషాచలమన జెలువొందు.
4. కలియుగమునఁ జేకొన్కల నలరుఁ
        గొలిచి యిచ్చు నక్కొలదిని సిరులు
బలువిడి నొసగెడు బహువైఖరులు
        నలువుగ వేంకటనగ మన వరలు.

జక్కిణీ యన నాట్యభేదమని సూర్యారాయ నిఘంటుకర్త లర్థము చెప్పిరి. ఆ భేదస్వరూప మెట్టిదో తెలియదు; "లాగు మై సిరియు బల్లటియు గత్రియు, జెక్కను" దీని ముఖ్యమైన యంగములు; కాని తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయ లిఖిత పుస్తక పట్టికయందు "సురతాణి జక్కిణి" యను నొక పుస్తకము చేర్కొనబడినది. అందు,

చంగల్వపురి నిలయశ్రితముని హృదయ
రంగమున నిలచి తా రసికత మీఱ
కవి పుంగవులు శిరః కంపంబు సేయ
సురతాణి జక్కిణి సొంపుమీఱగను
ఒరపుగా నటియింతు నొప్పుగా నిపుడు

అను గ్రంథారంభమందలి ద్విపదలవలన సురతాణి జక్కిణి యనునది జక్కిణి నాట్యమందలి భేదమని తెలియుచున్నది. ఆ నాట్యమాడుచు పాడు మరాష్ట్రగేయమొకటి యం దుదాహరింపబడి యున్నది.

'హేను జాణ మేరబి మేరుడ, అకదిల్లి మేరబి మేరుడ' ఇత్యాది.

జక్కిణియే నాట్యశాస్త్రములలో చేర్కొనబడిన జక్కరీ యని

శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు చెప్పినారు. జక్కరీ నృత్యమును దమ భరతకోశమున విట్లు వివరించియున్నారు.

జక్కరీ-దేశీవృత్తమ్—

యవన్యాభాషయాయుక్తం యత్రగీతం సునిశ్చలమ్
కోలాదిగ జరాయుక్తం మహార్ఘేన విభూషితమ్.
విదధ్యాన్నర్తనం నానాలయత్రయ విచిత్రితమ్
కోమలాంగైర్యదా నృత్యం భ్రమార్యాదివిరాజితమ్.
సశబ్దాది క్రియాయత్ర ధ్రువకమ్వాది భేదతః
యత్రచేష్టావిరహితం నన్నృత్తం జక్కరీమతమ్.
పారశీకైః పణ్డితైస్తు ఉద్గాహిహాః స్వస్వభాషయా
యద్గీతం జర్కరీసంజ్ఞం యవనానామతిప్రియం.

మఱియు, "అణునిభమధ్య లాక్రియలు నాపరిభాషలు నొప్పు
జిందు జక్కిణి కోలవంజి మేళముల జీలికసల్పిరి,"

అనుట వలన నీ యాటలో కూడ పాటలు పాడుట సంప్రదాయమని తెలియ వచ్చుచున్నది. ఇట్లే పదచాళియందును నాట్యముతో పాటు గీతమును వినిపింపవలయును.

నెలకొని చక్కగా నిలిచిన నిలుకడ
మిహికుందనపుబొమ్మ మహిని నిలువ
జికిలికోపులు కమ్మచేకత్తి మాష్టీని
చికటారి బొదలిక జెలువుగులుక
నభినయించుచును బదార్థముల్ దెలుపుచో
రతిముద్దురాచిల్క రహివహింప
తీవిగా దిరువుగట్టి తటాన దిరుగుచో
దొలుకరి మెఱుగులు దులకరింప
గొనరు జూపుల బెళుకు జేడీసలునిగుడ
సొగసు ముత్యాలచనుకట్టు బిగువుసూప
దళుకు చెంగావి కాసె బిత్తరము నెఱప
జెలగి పదచాళి వినిపించె జెలువయొకతె.

మఱియు నీ నాట్యభేదములకు దగినరీతిని వేణుగానము సేయుటయుం గలదు :—

గీతంబు దరువు జక్కిణి చిందు మొదలుగా
నొక్కొక్క వర్ణంబు నుగ్గడించి
శుద్ధసాళగ సంపూర్ణ శోభితములు
శ్రుతులు చెడకుండ చెవులకు సొగసుగులుక
వేణునాదంబు మొరయించె రాణమెఱయ
మదనగోపాలమూర్తి యమ్మాధవుండు.

ఇట్లు నృత్యగీతములు రెండును అన్యోన్యాశ్రయము లగుటవలన సమముగా నభివృద్ధినందినవి. గాంధర్వవిద్య స్వతంత్రమైనది కాదు; కవిత్వముపై నాధారపడియున్నది; గాయకుడు పాడును, అతడు పాడు పాటలను రచించువాడు కవి. ఈ కారణములచే నాట్యసంగీతములు తామరతంపరగ బెంపొందిన కాలమున కవులెల్లను సంగీతశాస్త్రవిశారదులై గీత రచయితలైరి. ఆ కాలమున నుప్పతిల్లిన గాంధర్వ సాహిత్యమున జాల భాగము నశించిపోయినది. శేషించిన యల్పభాగమునందు క్షేత్రయ పదములు ముఖ్యమైనవి. దాక్షిణాత్య నాయకులపై బదములు చెప్పి వారిచే సత్కృతుడైనను, క్షేత్రయ దాక్షిణాత్యుడుగాడు. దాక్షిణాత్య గేయ రచయితలలో నగ్రగణ్యుడు విజయరాఘవుడు; పదరచనయందు క్షేత్రయకు దీసిపోడు. ఇతని విడిగేయరచనములు కొన్ని తంజావూరు సరస్వతీ మహాలు పుస్తకాలయమందు భద్రపఱచబడియున్నవి; కాని యవి బహుళముగ నతని యక్షగాన కృతులయందు ప్రకటితమైయున్నవి. తరువాత నెన్నదగిన గేయకర్తలు రంగాజమ్మ మొదలగు యక్షగానకవులు. గాంధర్వ వాఙ్మయ పరిశోధన మిప్పుడె ప్రారంభమగుచున్నది. దీని విస్తార మెంతకలదో ఊహించుట ఇప్పుడు సాధ్యముగాదు. ఈ పరిశోధన సులభముగ సాగునది కాదు. దేశసంచారము దానియందు మొదటి ఘట్టము. ద్రావిడదేశములో నాంధ్రులు నివసించుచుండు గ్రామములందు సంచరించి నిక్షిప్తమైయుండు గ్రంథములనే కాక యువతీజన మండలమున నింకను జెలామణియందుండు పాటలను పదములను కీర్తనలను సేకరించినగాని మనసంగీత సాహిత్య స్వరూపమును నిర్ణయించుటకు వీలుకాదు.

# శుద్ధపత్రము

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 2 | 7 | బహుకృతులై | బహూకృతులై |
| 3 | 15 | విదళపఱచు | విశదపఱచు |
| ,, | 17 | యెబడి | యేబడి |
| ,, | 23 | ఆకాలమున | ఆకాలమున |
| 8 | 16 | పాకశాశన | పాకశాసన |
| ,, | ,, | పరదేంద్రు | వరదేంద్రు |
| 9 | 5 | పెంపందించి | పెంపొందించిన |
| 11 | 2 | పీఠీక | పీఠిక |
| ,, | 8 | మెసెంగా | మొసంగా |
| 12 | 1 | కవితసరసజ్ఞుడు | కవితారసజ్ఞుడు |
| ,, | 8 | పెంపందించిన | పెంపొందించిన |
| ,, | 11 | విద్వప్రభువులు | విద్వత్ప్రభువులు |
| 13 | 21 | యింఘ్రీ | యంఘ్రీ |
| 20 | 24 | భేధము | భేదము |
| 29 | 16 | తార్కారము | తాకారము |
| 33 | 15 | వలవుటుంగలార్పు | వలపుటుంగలార్పు |
| 34 | 1 | గ్రథములు | గ్రంథములు |
| 36 | 12 | విశారుదులు | విశారదులు |
| 40 | 4 | లైయ్యును | లైయును |
| 43 | 1 | చిరకాము | చిరకాలము |
| 44 | 3 | అభినవాంధ | అభినవాంధ్ర |
| 47 | 9 | వేంకటికవి | వేంకటకవి |
| 48 | 7 | దళమోల్లాశము | దళమోల్లాసము |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 49 | 24 | సంకంద్రన | సంక్రందన |
| 51 | 4 | పుస్తుక | పుస్తక |
| ,, | 14 | నాకుయని | నాయకుని |
| ,, | 16 | వాస్తమేని | వాస్తవమేని |
| 52 | 12 | కావ్యఛాయలు | కావ్యచ్ఛాయలు |
| 55 | 4 | బుట్టలేరు | బుట్టలేదు |
| 56 | 14 | ప్రతిపాతము | ప్రతిపాదకము |
| 57 | 7 | మాహాశ్వసముల | మాహాశ్వాసముల |
| 60 | 19 | యాస్థానమును | యాస్థానమున |
| 61 | 15 | యోప్పారుచున్నది | యొప్పారుచున్నది |
| 62 | 3 | బెంపందించు | బెంపొందించు |
| 63 | 9 | నలచిరిత్ర | నలచరిత్ర |
| 74 | 11 | వాస్తపముగ | వాస్తవముగ |
| ,, | 13 | విచారించ | విచారింప |
| 80 | 3 | నియఖుంచి | నియమించి |
| 82 | 4 | అశ్వాసము | ఆశ్వాసము |
| 83 | 3 | లాక్షిణికు | లాక్షణికు |
| 85 | 14 | గడింగిరి | గడంగిరి |
| 88 | 11 | యక్షగానముల | యక్షగానములు |
| 91 | 6 | లభించలేదు | లభింపలేదు |
| 95 | 12 | యుదాహారణము | యుదాహరణము |
| 104 | 1 | వృద్ద | వృద్ధ |
| 107 | 21 | లీవా | లీలా |
| 110 | 13 | జక్కిణీ | జక్కిణీ |
| ,, | 25 | మరాష్ట్ర | మహారాష్ట్ర |
| 112 | 19 | భద్రకరచబడి | భద్రపఱుపబడి |

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B117 |
| పుస్తకం పేరు | ఆంధ్ర వాఙ్మయచరిత్ర |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 117 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | CI BCI |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Kethira |
| పేజీలు విడదీసినది | Kethira |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | BUJJI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |